లోకల్ స్టూడెంట్స్ 'రాకెట్' సక్సెస్
2



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..
హైదరాబాద్ - బుధవారం 22 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 106 | పేజీలు:12 | వెల రూ.5

ఇక నుంచి డ్రోన్ డెలివరీ
2




HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

## ప్రభుత్వ కమిటీతో ఆర్టీసీ జేఏసీ చర్చలు విఫలం

# బస్సులు బంద్

### డిపోలకే పరిమితమైన బస్సులు

నాలుగు వారాల సమయం కోరిన సర్కారు

గత్యంతరం లేకనే సమ్మెకు పోతున్నాం: జేఏసీ చైర్మన్ వెంకన్న



**హైదరాబాద్, ఏప్రిల్ 21, ( మనం బ్యూరో):** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సమ్మె బాట పట్టింది. ఏండ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న డిమాండ్ల సాధన కోసం మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన నలుగురు సభ్యుల

...మిగతా 2లో

## మోడీపై వివాదాస్పద వ్యాఖ్యలు!!

### ప్రధానిని ఉగ్రవాది అని తాను అనలేదని ఖర్గే వివరణ



**చెన్నై, ఏప్రిల్ 21:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చెన్నైలో ప్రధానినుద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యాఖ్యలకు ఆయన క్షమాపణలు చెప్పాలంటూ బీజేపీ డిమాండ్ చేసింది. అన్నాడీఎంకే-బీజేపీ పొత్తును ప్రశ్నించిన ఖర్గే.. ఆ పార్టీ మోడీతో ఎలా చేతులు కలిపిందన్నారు. ఆయనకు, బీజేపీకి సమానత్వంపై విశ్వాసం లేదన్నారు. కాంగ్రెస్-డీఎంకే నేతృత్వంలోని కూటమిని మళ్లీ గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మోడీని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఈ అవమానకర వ్యాఖ్యలపై ఖర్గే, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ వివాదంపై ఖర్గే స్పందించారు. తాను ఎప్పుడూ మోడీని ఉగ్రవాది అని అనలేదన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు.

ఎన్నికల ప్రచారానికి తెర

### తమిళనాడు, బెంగాల్‌లో

## రేపు పోలింగ్

కోల్‌కతాలో భారీ సంఖ్యలో కేంద్ర బలగాలు



**కోల్‌కతా, ఏప్రిల్ 21:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. పశ్చిమ బెంగాల్లోనూ మొదటి విడత ఎన్నికల ప్రచారానికి తెరపడింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్

...మిగతా 2లో

## తెలంగాణకు విశిష్ట పర్యాటక గుర్తింపు

### మనందరికీ గర్వకారణమన్న మంత్రి జూపల్లి



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన 'దివ్య భారత్' పర్యాటక నివేదికలో తెలంగాణ రాష్ట్రానికి విశిష్ట గుర్తింపు లభించడంపై పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వైవిధ్యభరితమైన పర్యాటక సామర్థ్యానికి ఈ నివేదిక అద్దం పడుతోందని, ఇది తెలంగాణకు గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ

...మిగతా 2లో

## నేను పాడను గాక పాడను

సీఎం రేవంత్ అడిగినా పాడను

నా గొంతు కేసీఆర్‌కే సొంతం: గాయని మధుప్రియ

3

### తెలంగాణలో అవకాశాలు

## పుష్కలం

'అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్'లో పెట్టుబడులు ప్రోత్సహించండి

ఇటలీ రాయబారి బార్టోలికి మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి

తెలంగాణకు నమ్మకమైన భాగస్వామిగా మారతామన్న ఆ దేశ ప్రతినిధులు



**హైదరాబాద్, మనం బ్యూరో:** దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ పెట్టుబడులకు అత్యంత అనుకూలమని పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్'లో పెట్టుబడులు పెట్టేలా ఇటలీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ

...మిగతా 2లో

## కేసీఆర్‌కు కవిత కౌంటర్

### ఉత్తుత్తి కథలు చెబితే..ఎలా..?

కేంద్రాన్ని పల్లెత్తు మాట అనలే

**ఉద్యమ కారుల ఊసే లేదు**

బీఆర్ఎస్‌లో మహిళలకు విలువ ఉందా

**మహిళా బిల్లుపై పెదవి విప్పలేదెందుకు**

మీ ఓటమిపై ఇంకా ప్రజలను బ్లేమ్ చేస్తారా

**ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోండి..అధ్యక్షా..!**

1000 ఏండ్లయినా బీఆర్ఎస్ మారదు

**యువతకు, మహిళలకు జాగృతిలో పెద్దపీట**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 21(మనం,ప్రత్యేక ప్రతినిధి):** సుదీర్ఘ కాలం తరువాత జగిత్యాల సభలో ప్రసంగించిన మాజీ సీఎం కేసీఆర్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మంగళవారం మీడియాతో కవిత మాట్లాడారు. ఈ క్రమంలో వెయ్యి ఏండ్లు అయినా బీఆర్ఎస్ పార్టీ మారదని కవిత మండిపడ్డారు. 2023 ఎన్నికలలో ఓటమిపై కేసీఆర్ ఇప్పటికీ ఆత్మవిమర్శ చేసుకోవడం లేదని.. పదే..పదే ప్రజలే తప్పు చేశారని వారిని చులకన చేసి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల సభలో తెలంగాణ కోసం ఉరిమే ఉత్సాహంతో పోరాడిన ఉద్యమకారుల గురించి ఒక్క మాట మాట్లాడలేదని, తెలంగాణ ఉద్యమకారులు భిక్షాటన చేసే దుస్థితికి వచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాల బహిరంగ సభలో కేంద్ర ప్రభుత్వాన్ని

...మిగతా 2లో

### రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు ఎవరికీ మంచిది కాదు

ఏపీ సీఎంకు మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 21:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎవరికీ మంచిది కాదని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. విభజనపై ఎంపీ తేజస్వి వ్యాఖ్యలను లోక్ సభ రికార్డుల

...మిగతా 2లో

## ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఎత్తివేత

మే 1 నుండి 31 వరకు ట్రాన్స్‌ఫర్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (మనం బ్యూరో):** రాష్ట్రంలో ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బదిలీలపై కొనసాగుతున్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆర్థిక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మే 1 నుండి 31 వరకు బదిలీలకు షెడ్యూల్ ప్రకటించింది. ఈ ఏడాది జనవరి 1 నాటికి మూడేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారి బదిలీలకు

...మిగతా 2లో

పటాకుల కంపెనీలో పేలుడు..

## 13 మంది సజీవ దహనం

### కేరళలోని త్రిస్సూర్‌లో దుర్ఘటన



**తిరువనంతపురం, ఏప్రిల్ 21:** కేరళ త్రిస్సూర్లోని ఓ బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 13 మంది మృతి చెందగా.. 30 మంది గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. పూరం వేడుక కోసం ముండతికోడ్లో నిల్వ ఉంచిన బాణసంచా కేంద్రాల్లో ఈ ప్రమాదం జరిగింది. స్థానికంగా పంటపొలాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లలో బాణసంచా తయారు చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే,

...మిగతా 2లో

## రేపు కేబినెట్

### ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రారంభంపై చర్చ

ప్రాదేశిక ఎన్నికలు, యాసంగి ధాన్యం సేకరణ పైనా..

ఇద్దరు ఎమ్మెల్సీలకు గవర్నర్ ఆమోదం కోసం తీర్మానం?

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (మనం బ్యూరో):** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం జరుగనుంది. సచివాలయంలోని ఆరో అంతస్థులోని క్యాబినెట్ మీటింగ్ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. ఈమేరకు సమావేశానికి అవసరమైన సమాచారంతో అందుబాటులో ఉండాలని అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కొనసాగుతోంది. జూన్ 12న

...మిగతా 2లో



## తెలంగాణ జైళ్లలో.. సరికొత్త సంస్కరణలు

ట్రైనీ పోలీసులకు డీజీ అవగాహన

**హైదరాబాద్,ఏప్రిల్ 21(మనం,ప్రత్యేక ప్రతినిధి):** తెలంగాణ జైళ్లలో ఖైదీల కోసం సరికొత్త సంస్కరణలు చేపడుతున్నామని జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా స్పష్టం చేశారు. ఈక్రమంలో నేషనల్ పోలీస్ అకాడమీ ట్రైనీ ఏఎస్పీలు, తెలంగాణ పోలీస్ అకాడమీకి చెందిన 102 మంది గ్రూప్-ఐ ట్రైనీ డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ తమ ఫీల్ ట్రైనింగ్‌లో భాగంగా మంగళవారం చర్లపల్లి సెంట్రల్ జైలు సందర్శించారు. ఈ సందర్భంగా డీజీ సౌమ్య మిశ్రా ట్రైనీ అధికారులకు జైలు పరిపాలన, ఖైదీల సంస్కరణ కోసం చేపడుతున్న చర్యలపై ట్రైనీ పోలీసులకు అవగాహన కల్పించారు. జైళ్లలో అమలు చేస్తున్న కొత్త కార్యక్రమాలను, ముఖ్యంగా నివృత్తి అనే ప్రథమ ప్రయత్నం కింద అన్ని సెంట్రల్ జైళ్లలో,మహిళా ప్రత్యేక

...మిగతా 2లో

## 'టెక్' బాట పట్టిన యుద్ధం

### ఉక్రెయిన్లో రోబో సైనికుల హల్చల్!



**కీవ్, ఏప్రిల్ 21:** యుద్ధరంగంలో స్వీయ సైనికులకు ముప్పు లేకుండా ఉక్రెయిన్ జాగ్రత్తపడుతోంది. వీరి స్థానంలో రోబో సైనికులను దించుతోంది. సురక్షిత ప్రదేశం నుంచి వాటిని ఆపరేట్ చేస్తునానరు. వీటి సాయంతో తొలిసారిగా శత్రు శిబిరంపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. అందులో.. నేల మీదున్న రోబోలు.. నింగిలోని డ్రోన్ల తోడ్పాటుతో

...మిగతా 2లో

దిగ్బంధనాన్ని తప్పించుకొన్న

## ఇరాన్ చమురు నౌక

అమెరికాపై సాధించిన మరో విజయమన్న టెహ్రాన్




**టెహ్రాన్, ఏప్రిల్ 21:** హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా కట్టుదిట్టమైన దిగ్బంధనాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించుకుంటున్న క్రమంలో కీలక పరిణామం ఒకటి చోటుచేసుకుంది. ఇరాన్ కు చెందిన ఓ సూపర్ ట్యాంకర్ అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకొని ఇరాన్‌కు చేరుకున్నట్లు తెలుస్తోంది. నౌకల ట్రాకింగ్ డేటా ప్రకారం.. 20 లక్షల బ్యారెళ్ల చమురుతో నిండిన ఈ సూపర్ ట్యాంకర్ మార్చిలో ఇరాన్ నుంచి ఇండోనేసియాకు బయలుదేరింది. రియూ ద్వీప

...మిగతా 2లో




## దిగ్బంధనాన్ని తప్పించుకొన్న ఇరాన్ చమురు నౌక

(మొదటి పేజీ తరువాయి)

సమూహానికి చేరుకున్నాక.. మరొక సూపర్ ట్యాంకర్లోకి ఆ చమురును బదిలీ చేసింది. అనంతరం తిరిగి ప్రయాణం ప్రారంభించింది. ఒకవైపు అమెరికా దిగ్బంధనం కొనసాగుతుండగానే.. దాన్ని తప్పించుకొని స్వదేశీ జలాల్లోకి చేరుకొంది. త్వరలోనే అది ఖర్గ్ ద్వీపానికి వెళ్లనుంది. ఈ చర్య అమెరికా దిగ్బంధనంపై సాధించిన గొప్ప విజయంగా టెహ్రాన్ అభివర్ణించింది.

## ‘టెక్’ బాట పట్టిన యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యర్థి సైనికులను బందీలుగా తీసుకున్నట్లు ఉక్రెయిన్ చెబుతోంది. ఆ తర్వాతి నుంచి ఎన్ సీ13 అనే సైనిక విభాగంలో మానవ సైనికుల స్థానంలో రోబోలను ప్రవేశపెడుతున్నట్లు చెబుతోంది.

**సరకుల సరఫరా నుంచి దాడుల వరకూ..**

ఉక్రెయిన్లో సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యర్థి డ్రోన్ల కార్యకలాపాలు పెరిగాయి. ఇది ఆ దేశ పదాతిదళానికి పెను ముప్పుగా పరిణమించింది. దీంతో ఉక్రెయిన్ పరిశోధకులు భూతల డ్రోన్లతో ప్రయోగాలు మొదలుపెట్టారు. చక్రాలు, లోహపు బెల్టులపై నడిచే రిమోట్ కంట్రోల్ వాహనాలు, నేలపై రోబోటిక్ వ్యవస్థ వంటివాటిని రూపొందించారు. వీటిని చాలావరకూ యుద్ధరంగం నుంచి క్షతగాత్రులను వెనక్కి తీసుకురావడానికి, సరకుల సరఫరాకు ఉపయోగించారు. క్రమంగా దాడులకూ వ్యాపింపజేస్తున్నారు.

## 13 మంది సజీవ దహనం

(మొదటి పేజీ తరువాయి)

ఘటన సమయంలో మొత్తం అక్కడ ఎంతమంది కార్మికులు ఉన్నారనే విషయంపై స్పష్టత లేనప్పటికీ.. వారి కోసం తెప్పించిన ఆహార ప్యాకెట్ల ఆధారంగా దాదాపు 40 మంది ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. సమీప ప్రాంతాల్లోనూ బాణసంచా నిల్వ కేంద్రాలు ఉండటం, వరుసగా పేలుడు జరగడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని రెస్క్యూ బృందాలు వెల్లడించాయి. అయితే, అధిక ఉష్ణోగ్రతలు ప్రమాదానికి ఓ కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు స్థానిక మెడికల్ కాలేజీలో ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ అధికారులకు సూచించారు.

## రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు ఎవరికీ మంచిది కాదు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి తొలగించేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ‘బీజేపీ, తెదేపా నేతలు, జనసేన అధినేత వ్యాఖ్యలు సముచితంగా లేవు. రాష్ట్ర విభజన అనుచితంగా జరిగినట్లు చేసే వ్యాఖ్యలు విద్వేషాలు రగిలించేలా ఉన్నాయి. మీరు చొరవ తీసుకుని నేతలకు సర్దిచెప్పాలి. విభజనపై ఎంపీ తేజస్వి వ్యాఖ్యల విషయమై స్పీకర్ కు లేఖ రాయాలి’ అని పొన్నం ప్రకటించారు.

# బస్సులు బంద్



(మొదటి పేజీ తరువాయి)

కమిటీని ఏర్పాటు చేసింది. రవాణా, రహదారులు, భవనాల శాఖ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి చైర్మన్‌గా కార్మిక, ఉపాధి, శిక్షణ కర్మాగారాల శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ ఎండీ సభ్యులుగా ప్రభుత్వం మంగళవారం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. జేఏసీ ప్రధాన డిమాండ్లయిన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, పీఆర్సీ విడుదల, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనీ, లేదంటే సమ్మెకు దిగుతామని గత నెలలో ఆర్టీసీ జేఏసీ నేతలు యాజమాన్యానికి నోటీసు ఇచ్చారు. ఆర్టీసీ జేఏసీ నేతల డిమాండ్ల పరిష్కారానికి నాలుగు వారాల సమయం ఇవ్వాలని కమిటీ కోరింది. అప్పటి వరకు సమ్మెను విరమించుకోవాలని విజ్ఞప్తి చేసింది. కమిటీ ప్రతిపాదనను జేఏసీ అంగీకరించలేదు. చర్చలకు కొలిక్కి రాకపోవడంతో సమ్మెకు వెళ్లనున్నట్లు ఆర్టీసీ సంఘాల స్పష్టం చేశాయి. చర్చల అనంతరం ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న మాట్లాడుతూ మా సమస్యలను అధికారులకు వివరించాం. ఐఏఎస్ అధికారుల కమిటీ 4 వారాల గడువు కోరింది. మా డిమాండ్లు కొత్తవి కాదు. గతంలో ఇచ్చిన హామీలే. మా మాట వింటే వినండి. లేదంటే లేదని కమిటీ చెప్పింది. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు వెళుతున్నాం. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని అందుకే మిగతా దారి లేకనే సమ్మెకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు ఈ సందర్భంగా వెంకన్న స్పష్టం చేశారు.

# తెలంగాణకు విశిష్ట పర్యాటక గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తింపు నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజధానిలోని హుస్సేన్ సాగర్, చారిత్రక గోల్కొండ కోట, భువనగిరి కోట వంటి కట్టడాలతో పాటు ఆధ్యాత్మికత ఉట్టిపడే యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వంటి ప్రసిద్ధ క్షేత్రాలు నిత్యం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని వివరించారు. కేవలం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలే కాకుండా ప్రకృతి ఒడిలో విరాజిల్లే కుంటాల, బొగత జలపాతాలు, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా పేరొందిన సమ్మక్క-సారలమ్మ మేడారం జాతర వంటి సాంస్కృతిక వేడుకలు రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయని మంత్రి చెప్పారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి ఇక్కత్ వంటి సంప్రదాయ కళలు పర్యాటక రంగాన్ని మరింత సుసంపన్నం చేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని సుసంపన్నమైన సంప్రదాయాలు, రుచికరమైన వంటకాలు, ప్రకృతి రమణీయమైన దృశ్యాలను తిలకించేందుకు దేశ విదేశీ పర్యాటకులు తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు.

# తమిళనాడు, బెంగాల్‌లో రేపు పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది.

**భారీ సంఖ్యలో భద్రతాబలగాల మీటింగ్**

రెండురోజుల్లో పశ్చిమ బెంగాల్లో తొలివిడత పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ చీఫ్ లందరూ కొల్‌కతాలో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే కేంద్రం-బెంగాల్ ప్రభుత్వానికి మధ్య ఉన్న విభేదాలను ఈ పరిణామం తీవ్రం చేసింది. ఇది సాధారణ సమావేశంలా కనిపించడం లేదని, సైనిక తరహా స్వాధీనానికి పన్నాగంలా కనిపిస్తోందని తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. గతంలో ఏ అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇలా సమావేశం కాలేదని, ఇదొక అనూహ్య భేటీ అని వ్యాఖ్యానించింది.

రికార్డుస్థాయిలో 2400 కంపెనీలకు చెందిన 2.4 లక్షలమందిని బెంగాల్లో మోహరించడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న చరిత్ర ఈ రాష్ట్రానికి ఉందని, ఈసారి అలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకూడదనే ఈ మోహరింపులు అని కేంద్రం చెప్తోంది. తొలి విడతలో 3.4 కోట్ల మంది ఓటు వేయనున్నారు. అంటే ప్రతి 140 మందికి ఒక భద్రతాసిబ్బంది చొప్పున మోహరించినట్లు కనిపిస్తోంది. ఘర్షణలు జరిగే ప్రాంతాల్లోకి వెళ్లేందుకు జమ్మూకశ్మీర్ నుంచి బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను తెప్పించారు. ఇదంతా ఓటర్లను భయపెట్టే ప్రయత్నమని, మణిపూర్లో హింస తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు కూడా 290 కంపెనీలకు చెందిన 29,000 మందినే మోహరించారని తృణమూల్ మాజీ ఎంపీ సాకేత్ గోఖలే విమర్శించారు. మోడీ-అమిత్ షా బెంగాల్ను చేజిక్కించుకోవాలని ఎదురుచూస్తున్నారని, ఢిల్లీ నుంచి రాష్ట్రాన్ని నియంత్రించాలనుకుంటున్నారని ఎక్స్ వేదికగా ఆరోపించారు. 2021లో బెంగాల్లో ఎన్నికలు 8 దశల్లో జరిగాయి. ఈసారి రెండు విడతల్లోనే పూర్తి కానున్నాయి. ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న రెండు దశల్లో ఈ రాష్ట్రంలో ఓటింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.

## తెలంగాణ జైళ్లలో.. సరికొత్త సంస్కరణలు

(మొదటి పేజీ తరువాయి)

జైలులో డీ-అడిక్షన్ సెంటర్ల స్థాపన గురించి శిక్షణ పొందుతున్న అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ జైళ్లు కేవలం శిక్ష విధించే సంస్థలుగా కాకుండా, ఖైదీలను సమాజంలో బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దే విధంగా పనిచేస్తున్నాయని వివరించారు.

**కస్టడీ విత్ కేర్:**

జైళ్ళ శాఖ కస్టడీ విత్ కేర్ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా పునరుద్ఘాటించారు.జైలు శాఖ పనితీరు, పరిపాలన, సంక్షేమ కార్యక్రమాలు, కొత్త కార్యక్రమాలపై ఎన్. మురళీ బాబు, ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్, ప్రెజెంటేషన్ ఇచ్చారు. ట్రైనీ అధికారులు జైలు పరిధిలోని సంజీవని (జైలు ఆసుపత్రి), ప్రిజన్ ఇండస్ట్రీ యూనిట్లు, అన్నపూర్ణ (ఖైదీల వంటశాల), గ్రంథాలయం, ఖైదీల బ్యారెక్‌లను సందర్శించారు. అలాగే చర్లపల్లి ఖైదీల వ్యవసాయ కాలనీ, కోళ్ల పెంపకం, పాడి పశుసంవర్ధక, మత్స్యకార్యం, వ్యవసాయం , అనుబంధ కార్యకలాపాలను పరిశీలించారు. అనంతరం పీఏసీ చర్లపల్లిలో డీబ్రీఫింగ్ సమావేశంలో ట్రైనీల సందేహాలకు జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా సమగ్ర వివరణ కూడిన సమాధానాలను ఇచ్చారు.

## విద్యార్థుల రాకెట్ ప్రయోగం విజయవంతం

**నగర శివారులోని నర్రెపల్లిలో ఎన్జీఓ ఆధ్వర్యంలో ప్రయోగం**

హైదరాబాద్, ఏప్రిల్ 21: అంతరిక్షరంగంలో పూర్తి స్వదేశీ సాంకేతికతతో భారత్ దూసుకుపోతున్న సమయంలో యువతలోనూ ఈ రంగం పట్ల ఆసక్తి పెరుగుతోంది. తమ తమ శక్తి మేరకు రాకెట్లు తయారుచేస్తున్నారు.

ఈ క్రమంలోనే రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, నర్రెపల్లిలో సిన్స్-మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. 15 మంది స్థానిక విద్యార్థులు తయారుచేసిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (డీఎస్ఆర్ఎస్ఎల్వీ) విజయవంతంగా పరీక్షించారు.

## ఇక నుంచి డ్రోన్ డెలివరీ

బెంగళూరు, ఏప్రిల్ 21: భారతదేశంలో మొట్టమొదటి ఇంట్రా-సిటీ (నగర పరిధిలో) డ్రోన్ డెలివరీ ప్రయోగాత్మక పరీక్షలను బెంగళూరు నగరంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు దిగ్గజ డెలివరీ సంస్థ 'ఫెడెక్స్' మంగళవారం ప్రకటించింది.

ఐఐటీ-మద్రాస్ భాగస్వామ్యంతో ఈ డెలివరీ ఫ్లైట్ ట్రయల్స్ నిర్వహించినట్లు వెల్లడించింది. ఐఐటీ-మద్రాస్లోని ‘ఫెడెక్స్ స్మార్ట్ సెంటర్’ పరిశోధనల ఆధ్వర్యంలో ఈ పరీక్షలు జరిగాయి. సాధారణంగా రోడ్డు మార్గంలో 53 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పార్శిల్ను డెలివరీ చేయడానికి గంటకు పైగా (60 నిమిషాలు) సమయం పడుతుంది. కానీ, గగనతలంలో 39-42 కిలోమీటర్ల ఏరియల్ రూట్ (వాయు మార్గం) ద్వారా కేవలం 21 నిమిషాల్లోనే డ్రోన్ గమ్యస్థానాన్ని చేరుకున్నట్లు ఫెడెక్స్ స్పష్టం చేసింది. అత్యవసర సమయాల్లో సరుకు రవాణా (లాజిస్టిక్స్) రంగంలో ఇది ఒక గొప్ప ముందడుగు అని సంస్థ పేర్కొంది.



## తలకిందులుగా వేలాడదీసి బుద్ధి చెబుతాం

**టీఎంసీ నేతలకు అమిత్ షా తీవ్ర హెచ్చరిక**

కొల్‌కతా, ఏప్రిల్ 21: పశ్చిమ బెంగాల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) లక్ష్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. మంగళవారం డార్జిలింగ్లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. మే 5 తర్వాత బెంగాల్ పౌరులను, ముఖ్యంగా కొండ ప్రాంత ప్రజలను ఎవరైనా ఇబ్బంది పెడితే టీఎంసీ గూండాలను తలకిందులుగా వేలాడదీసి, సరిచేస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మమతా దీదీకి వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఈ సభలో అమిత్ షా బెంగాల్ ఓటర్లపై వరాల జల్లు కురిపించడంతో పాటు, మమత సర్కారుపై కీలక ఆరోపణలు చేశారు.

# తెలంగాణలో అవకాశాలు పుష్కలం

(మొదటి పేజీ తరువాయి)

దేశ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఇటలీ దేశ రాయబారి ఆంటోనియా బార్టోలి నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ‘తెలంగాణ-ఇటలీ’ కలిసి పని చేసేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. ఐరోపాలోనే అత్యంత బలమైన ఎగుమతి ఆధారిత, ఉత్పాదక రంగం కలిగిన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఇటలీ కొనసాగుతుందని వివరించారు. మెషినరీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. తెలంగాణను గ్లోబల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చేపట్టిన చర్యలను, అనుసరిస్తున్న వ్యూహాలను, పాలసీలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. భారత్-ఇటలీ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండస్ట్రీ 4.0, రోబోటిక్స్, స్మార్ట్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, క్లీన్ మొబిలిటి, రెన్యూవబుల్ ఎనర్జీ తదితర రంగాల్లో ఇటలీ మార్గదర్శకం ‘తెలంగాణ బ్రాండ్’ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటలీకి నమ్మకమైన భాగస్వామిగా ఉండేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ఇన్నోవేషన్ సిస్టం మరింత బలోపేతమయ్యేలా టీ హబ్, వీ హబ్, జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైజెస్ పార్క్, యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలతో ఇటలీ కంపెనీలు, నిపుణులు, సంస్థలు భాగస్వాములయ్యేలా చొరవ చూపాలని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ సమావేశం తొలి అడుగు మాత్రమే. రాబోయే రోజుల్లో తెలంగాణకు నమ్మకమైన భాగస్వామిగా మారుతాం. కీలక రంగాల్లో కలిసి పని చేస్తాం. ప్రత్యేక వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఇటలీ రాయబారి ఆంటోనియో బార్టోలి పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం అనుమతినిచ్చింది. గతేడాది డిసెంబర్ 31 నాటికి నాలుగేళ్లుగా ఒకేచోట పని చేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అప్రాధాన్య పోస్టుల్లో ఉన్న ఉద్యోగులను ప్రాధాన్య స్థానంలోకి బదిలీ చేయాలని మార్గదర్శకాల్లో ప్రభుత్వం వెల్లడించింది. కఠినమైన ప్రాంతాల్లో సుదీర్ఘంగా పని చేస్తున్న వారికి కూడా ప్రాధాన్యమిస్తారు. అయితే, భార్యాభర్తల కేటగిరీలో మూడేళ్ల నిబంధన వర్తించదు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ఉద్యోగుల ఆప్షన్లను స్వీకరించి బదిలీలు చేయనున్నారు. విద్యాశాఖ, పోలీస్, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, రవాణా, అటవీ శాఖ విడివిడిగా ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేశాయి. మే 1 నుంచి 7 వరకు ఉద్యోగ సంఘాలతో చర్చించి ఖాళీలు, కచ్చితంగా బదిలీ చేయాల్సిన ఉద్యోగుల వివరాలను వెల్లడిస్తారు. మే 8 నుండి 15 వరకు ఉద్యోగుల నుండి ఆప్షన్లను స్వీకరిస్తారు. ఉద్యోగి గరిష్టంగా 5 ప్రాంతాలను ఆప్షన్లుగా ఎంచుకోవచ్చు. మే 16 నుండి 24 వరకు దరఖాస్తులు పరిశీలించి 25 నుండి 31 వరకు ఉత్తర్వులు జారీ చేస్తారు. అనంతరం ఉద్యోగి మూడు రోజుల్లో రిలీవ్ అయినట్లుగా పరిగణిస్తారు. జూన్ 1 నుండి ఉద్యోగుల సాధారణ బదిలీలపై మళ్లీ నిషేధం అమలులోకి వస్తుందని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా వెల్లడించారు.

# ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రారంభంపై చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ముగియనున్న ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పలు నిర్ణయాలు ప్రకటించనుంది. అలాగే, జూన్ 2న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించే అవకాశాలున్నాయి. ఈ బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టింది. దీనికి రూ.4 వేల కోట్లను కూడా కేటాయించింది. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ పథకం సాధ్యాసాధ్యాలను గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. మే నెలలో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సన్నద్ధతపై చర్చించే అవకాశాలున్నాయి. గవర్నర్ కోటా కింద ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం పేర్లపై గవర్నర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాతో ఇటీవల భేటీ అయ్యారు. ఈ అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. తాజాగా, ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి కొంత ఇబ్బందికరంగా మారాయి. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలనీ, పెండింగ్ డీఏలను విడుదల చేయాలంటూ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు సైతం చేపట్టాయి. ఈ అంశంపై సైతం రేపు జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చ జరుగనుంది. మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టును ఎల్అండ్‌టి నుండి స్వాధీనం చేసుకోవడం, నిధుల చెల్లింపు అంశంతో పాటు కొత్తగా తీసుకురానున్న రోహిత్ వేముల వివక్ష నిరోధక చట్టంపై సైతం రేపటి మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశాలున్నాయి.

# పొన్నాల పరిస్థితే జీవన్ రెడ్డికి

**చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు**

హైదరాబాద్, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ లో చేరికతో జీవన్ రెడ్డి పండుగ అయిపోయిందని భువనగిరి ఎంపీ, చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ జీవన్ రెడ్డికి జనరల్ సెక్రటరీ పదవి ఇచ్చారు.. ఆ పదవికి కాంగ్రెస్ పార్టీలో ఏ స్థాయి ఉంటుందో జీవన్ రెడ్డికి తెలుసని ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని పీసీసీ ప్రెసిడెంట్ చేయాలనుకుందని, కాంగ్రెస్లో అలిగినట్లుగా బీఆర్ఎస్ పార్టీలో ఆయన అలిగితే పట్టించుకోరని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. పొన్నాల లక్ష్మయ్య పీసీసీ ప్రెసిడెంట్ చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరితే ఇప్పుడు ఆయన పరిస్థితి ఏంటి? చివరకు ఆయన వీడియోలు చేసుకుని సోషల్ మీడియాలో పెట్టుకుంటున్నారని, రేపు జీవన్ రెడ్డి పరిస్థితి అదే అవుతుందన్నారు. బండి సంజయ్ ప్రెస్ మీట్లకే పరిమితమని, కాంగ్రెస్ పార్టీకి కాళేశ్వరం ఏటీఎంగా మారడానికి అక్కడ ఏముంది? అని చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు.

బండి సంజయ్ కి రాష్ట్రంలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కారం చేయాలనే ఆలోచన ఏమైనా ఉందా?, మెట్రో ఫేజ్ 2, ట్రిపుల్ ఆర్, మూసీ ప్రక్షాళన విషయంలో మీ వైఖరి ఏంటి..? బండి సంజయ్ శాఖ పరిధిలోనే సీబీఐ ఉంది కదా? అని ఆయన అన్నారు.

భువనగిరి లోక్ సభ పరిధిలో నిధులు తీసుకువచ్చే సభను బండి సంజయ్, కిషన్ రెడ్డి కలిసి పెడితే పార్టీలకు అతీతంగా ప్రజలను తీసుకువచ్చే బాధ్యతను తాము తీసుకుంటామని ఎంపీ చామల సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐకు ఆదేశిస్తే 24 గంటల్లో విచారణ చేస్తామని కిషన్ రెడ్డి అన్నారని, 2025 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి ఇస్తే ఇప్పటి వరకు విచారణ ఎందుకు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. అవసరం లేని వాటికి మీ జేబు సంస్థలు సీబీఐ, ఈడీ, ఐటీని వాడుతున్నారని ఎంపీ చామల ఆరోపించారు.

# కేసీఆర్‌కు కవిత కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ నాయకత్వం పల్లెత్తు మాట కూడా అనకపోవడంలో మాజీ సీఎం కేసీఆర్ ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. జాతీయ పార్టీగా చెప్పుకుంటూ లోక్ సభలో మహిళా బిల్లు వీగిపోవడం, డీలిమిటేషన్ బిల్లు, జనగణనపై ఒక్కమాట మాట్లాడకపోవడం గమనార్హమన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఆడబిడ్డలకు ఎప్పుడూ గౌరవం ఉండదని, అందుకే మహిళా కోటా బిల్లు వీగిపోయినా కేసీఆర్ ఒక్క మాట మాట్లాడలేదన్నారు. తమ ఓటమికి ప్రజలకే కారణమని ఇప్పటికీ బ్లేమ్ చేస్తున్నారని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్షాలు ఒకే రోజు భారీ బహిరంగ సభలు పెట్టి తూ కిత్నా అంటే.. అంటే మై కిత్నా అంటూ బలప్రదర్శనకు దిగుతున్నాయి తప్పితే ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.

**ఎన్నాళ్ళి..ఉత్తుత్తి కథలు:**

రాష్ట్ర ప్రజలను మరోసారి వంచించేందుకు బీఆర్ఎస్ నేతలు ఉత్తుత్తి కథలు చెబుతున్నారని కవిత ఎద్దేవ చేశారు. బీఆర్ఎస్ అధిష్టానం 75 సంవత్సరాల కురువృద్ధుడు జీవన్‌రెడ్డిని పార్టీలో చేర్చుకుని ఆయనను నవ యువకుడు అంటే తెలంగాణలో ఉన్న యువత పరిస్థితి ఏమిటని కవిత ప్రశ్నించారు. జగిత్యాల సభలో 75 ఏళ్ల కురువృద్ధుడిని చేర్చుకొని రాజకీయ పునరేకీకరణ అనడం విచారకరమన్నారు. రాజకీయ పునరేకీకరణ పేరుతో తెలంగాణ వ్యతిరేక శక్తులను తీసుకువచ్చి తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం చేస్తామని చెప్తున్నారంటే వెయ్యేండ్లు అయినా బీఆర్ఎస్ పార్టీ మారదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలోని మేధావులు, విద్యావేత్తలు బీఆర్ఎస్ ఆలోచన విధానం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. జీవన్ రెడ్డి పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని అన్నారు. తెలంగాణ కోసం ఉద్యమ నాయకత్వం రెండు సార్లు పదవులకు రాజీనామా చేసినప్పుడు తనకు వైఎస్ నాయకత్వం ఉంటే చాలని, తెలంగాణ ఎందుకంటూ జీవన్‌రెడ్డి ప్రశ్నించిన విషయాలను గుర్తు చేశారు. అలాగే ఉద్యమ నాయకత్వంపై రెండుసార్లు ఉప ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఈక్రమంలో బీఆర్ఎస్ ప్రజలకు ఉత్తుత్తి కథలు చెప్పడం మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజలకు సేవచేసేందుకు తాము కొత్త రాజకీయ శక్తిగా ఈనెల 25న వస్తున్నామని తెలిపారు. తాము ఏర్పాటు చేసే పార్టీలో యువనాయకత్వాన్ని ప్రోత్సహిస్తామని.. యువత పెద్ద ఎత్తున చేరాలని కవిత పిలుపునిచ్చారు.

**అదే..లెక్కలేని తనం:**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల విషయంలో ఏ లెక్కలేని తనం ప్రదర్శించిందో అదే లెక్కలేని తనంతో ప్రస్తుత ప్రభుత్వం పాలన సాగిస్తోందని కవిత అన్నారు. ఆర్టీసీలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని, ఆర్టీసీ కార్మికుల సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ఈనెల 25న తెలంగాణ రాజకీయాల్లోకి నూతన రాజకీయ శక్తిగా వస్తున్నామని, ప్రజలందరికీ ఈ వేదిక నుంచి ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ కార్యకర్తలు ఈరోజు పాదయాత్రగా బయల్దేరారని తెలిపారు. తమ పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే క్యాడర్ వాహనాలకు ఎలాంటి ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని పోలీసులు, అధికార యంత్రాంగాన్ని కోరారు. సమ్మెకు దిగిన ఆర్టిజన్లను బెదిరించి విధుల్లో చేరేలా ఒత్తిడి చేశారని అన్నారు. ప్రజలందరూ సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయని అన్నారు.

**జాగృతిలో జాయినింగ్స్:**

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఆర్ వీ ఆర్ ప్రసాద్ తన అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో మంగళవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు సయ్యద్ మతీన్ అహ్మద్ తన అనుచరులతో కలిసి జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కష్టాలు తీర్చేందుకు ఒక ఆడబిడ్డగా తాను ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. ప్రజలంతా తరలివచ్చి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. సమస్య ఉంటే దానిని పరిష్కరించే వరకు పోరాడేందుకు తాము రాజకీయాల్లోకి వస్తున్నామని తెలిపారు.

# పడిపోయిన దేశీయ ఎరువుల ఉత్పత్తి

**పశ్చిమాసియాలో ఉద్రిక్తత వల్ల ఇంధన సరఫరాకు ఆటంకాలే కారణమని కేంద్రం ప్రకటన**

**అయినా, తగు నిల్వలున్నందున ఆందోళన అవసరం లేదని స్పష్టీకరణ**



ఢిల్లీ, ఏప్రిల్ 21: పశ్చిమాసియా యుద్ధ ప్రభావం కీలక రంగమైన వ్యవసాయపైనా పడింది. మార్చి నెలలో దేశీయ ఎరువుల ఉత్పత్తి దాదాపు నాలుగో వంతు తగ్గిపోయిందని కేంద్రం వెల్లడించింది. పశ్చిమాసియా ప్రాంతం నుంచి సహజ వాయువు దిగుమతులు తగ్గుముఖం పట్టడమే దీనికి కారణమని చెప్పింది. హర్మూజ్ జల సంధి గుండా నౌకల రాకపోకలు నిలిచిపోయినందున ఇంధన సరఫరాకు ఆటంకం ఏర్పడింది. యూరియా వంటి ఎరువుల తయారీకి సహజ వాయువు కీలకం. దిగుమతులు తగ్గుముఖం పట్టడంతో ఎరువుల తయారీ 24.6 శాతం తగ్గినట్టు కేంద్రం సోమవారం వెల్లడించింది. అయితే, ప్రస్తుతానికి మనం భయపడాల్సింది లేదని.. ఎరువులు తగిన స్థాయిలో అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. అంతకుముందు ఫిబ్రవరి నెలలో 3.4 శాతం, జనవరిలో 3.7 శాతం, డిసెంబర్లో 4.1 శాతం ఉత్పత్తి పెరగడం గమనార్హం.సాధారణంగా ఖరీఫ్ సీజన్కు సంబంధించి జూన్-జులై నెలల్లో దేశీయంగా ఎరువులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. రబీ సీజన్కు సంబంధించి అక్టోబర్- నవంబర్లో మళ్లీ డిమాండ్ ఉంటుంది. ఎరువులను దేశీయంగా ఉత్పత్తి చేయడంతో పాటు యూరియా, ముడి పదార్థాలను భారత్ దిగుమతి చేసుకుంటోంది. అంతర్జాతీయంగా వీటి ధరలు పెరిగిన నేపథ్యంలో ఆ ప్రభావం రైతులపై పడకుండా సబ్సిడీ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం 11 శాతం ఇటీవల పెంచింది.

# మా అధినేత ఆదేశాలతోనే ఢిల్లీ పోయినం

- మా వ్యక్తిగత ఢిల్లీ పర్యటనపై మీకేందుకు?
- సీఎం రేవంత్ రెడ్డి హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్, మనం ప్రతినిధి : తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాను ఢిల్లీకి వెళ్లానని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆయన చెప్పిన పని కోసమే తాను, వినోద్ కుమార్ తదితరులం వెళ్లామని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి పెట్టే అక్రమ కేసులను ఎదుర్కోవడానికి, కాళేశ్వరం కేసులపై ఢిల్లీకి వెళ్లి లాయర్లతో చర్చించినట్లు చెప్పారు. కానీ, తన ఢిల్లీ పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంవో నుంచి లీకులు ఇచ్చారని, మీడియా వాళ్లతో అర్థం లేని బ్రేకింగ్‌లు పెట్టించారని ఆరోపించారు. విషయం ఉన్నోడు? తెలివున్నోడు ఎవరైనా సరే ఇ(ఎ)లాంటి చిల్లర పనులు చేయరని, సైకో మనస్తత్వం ఉన్నవారే ఇలాంటి అడ్డమైన పనులు చేస్తారని హరీశ్‌రావు తనదైన శైలిలో తీవ్రంగా విమర్శించారు.

**నేడు.. ఓటుకు నోటు కేసు విచారణ**

నేడు.. ఓటుకు నోటు కేసు కూడా సుప్రీంకోర్టులో విచారణకు రానుందని, ఆ కేసు గురించి న్యాయవాదులతో చర్చించామని అన్నారు. ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి, హోంమంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారని, కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం తరఫున అనామక లాయర్‌ను పెట్టారని విమర్శించారు. నిందితుల తరఫున మాత్రం ప్రముఖ లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారని చెప్పారు. నేటి విచారణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముద్దాయిగా ఉన్నారని గుర్తు చేశారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్ గాంధీతో, ఉదయం బీజేపీ వారితో తిరిగారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ బయటకు వచ్చినందనే రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేశారని అన్నారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సిన సొమ్మును పంట చేతికి వచ్చాక ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి, తమ పార్టీ అధినేత కేసీఆర్ స్థాయి ఏమిటో తెలంగాణ ప్రజలకు మొన్నటి బహిరంగ సభలతో అర్థమైందని అన్నారు. కేసీఆర్ జగిత్యాల సభ ప్రసంగాన్ని 36 లక్షలమంది చూస్తే, రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కేవలం 4 లక్షలమంది మాత్రమే చూశారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి తెలిసి చేశారో? లేక తెలియక చేశారో? కానీ, కేసీఆర్ సభ సమయంలోనే రేవంత్ రెడ్డి తన సభను ఏర్పాటు చేసుకోవడంతో ఎవరి రేటింగ్ ఏమిటో ప్రజలకు తెలిసిందన్నారు.

# కేసీఆర్.. మరో యాక్షన్ ప్లాన్?

- 27న అత్యున్నత స్థాయి సమావేశం
- గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ రీ-ఆర్గనైజ్ చేసే దిశగా నిర్ణయం
- భవిష్యత్ పోరాటాలకు శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న గులాబీ బాస్



హైదరాబాద్, మనం ప్రతినిధి : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల సందర్భంగా, పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే, పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా ఈ భేటీ జరగనుంది.ముఖ్యంగా పార్టీ సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కేసీఆర్ ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని రీ-ఆర్గనైజ్ చేసే దిశగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జెడ్పీ మాజీ చైర్మన్లను ఆహ్వానించారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, భవిష్యత్ పోరాటాల కోసం శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా రజతోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా ఒక భారీ యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించే అవకాశం ఉంది.



## రాష్ట్రానికి 8 కొత్త రైళ్లు

**ప్రకటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

ఢిల్లీ, ఏప్రిల్ 21 : ప్రయాణికుల సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రైల్వే మంత్రిత్వశాఖ తెలంగాణకు ఎనిమిది కొత్త రైళ్లను ప్రకటించింది. హైదరాబాద్ లోని కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్ల నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు సర్వీసులందించేలా ఈ వీక్లీ ప్రత్యేక రైళ్లకు ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ వారాంతపు ప్రత్యేక రైళ్లు హైదరాబాద్ నుంచి తిరుపతి, తిరుచానూరు, భువనేశ్వర్, జైపూర్, శ్రీ గంగానగర్ వంటి ముఖ్యమైన గమ్యస్థానాలకు కనెక్టివిటీని పెంచుతాయని, దీంతో ప్రయాణం మరింత సులువవుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలను, కనెక్టివిటీని బలోపేతం చేసే దిశగా సహకారం అందిస్తోన్న ప్రధాని నరేంద్ర మోడీ, రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ రైళ్ల వివరాలను 'ఎక్స్'లో పోస్టు చేశారు.

# ప్రకాశ్ రాజ్‌పై పోలీసు ఫిర్యాదు

హైదరాబాద్,ఏప్రిల్21(మనం,ప్రత్యేక ప్రతినిధి) : నటుడు ప్రకాష్ రాజ్ శ్రీరాముడిని, హిందూ ధర్మాన్ని కించపరిచే విధంగా మాట్లాడారంటూ సినీ నటి కరాటే కళ్యాణి పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రకాష్ రాజ్ ప్రవర్తిస్తున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అనంతరం మీడియాలో మాట్లాడిన కరాటే కళ్యాణి, ప్రకాష్ రాజ్ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిందువుల జోలికి, ముఖ్యంగా రామాయణం జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని, మా సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ప్రకాష్ రాజ్ నటించిన సినిమాలు భవిష్యత్తులో ఎలా ఆడతాయో చూస్తామని, ఆయన సినిమాలను ప్రేక్షకులు ఆదరించకూడదనే అర్థం వచ్చేలా ఆమె సవాల్ విసిరారు. హిందూ దేవుళ్లను లక్ష్యంగా చేసుకుని కొందరు సెలబ్రిటీలు ఇష్టానుసారంగా మాట్లాడటం ఫ్యాషన్‌గా మారిందని ఆమె అసహనం వ్యక్తం చేశారు. ప్రకాష్ రాజ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫిర్యాదు స్వీకరించిన పంజాగుట్ట పోలీసులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# హలో.. రేవంత్ నువ్వు ఎప్పటికి ఆంధ్రా తొత్తువే

- కేసీఆర్ లేకుంటే నువ్వు సీఎం అయ్యేవాడివా?
- సీఎం రేవంత్‌కు జీవన్ రెడ్డి ప్రశ్నల వర్షం



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా నాయకులకు తొత్తుగా మారిపోయారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఆయన మొదటి నుంచి సీమాంధ్ర నాయకుల చేతిలో కీలుబొమ్మగానే ఉంటున్నారని అన్నారు. 2015లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో, వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా చేయాలనే ఉద్దేశంతో ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి దొరికిపోయారని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి పాలన పోయి కేసీఆర్ పాలన రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మేం పాలన మార్పు కోరుకున్నాం తప్ప, భౌతికంగా రేవంత్ రెడ్డి కీడును తాము కోరుకోలేదని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారంటే అది కేసీఆర్ పుణ్యమే అన్నారు. కేసీఆర్ ఉద్యమించకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. అలాంటి ఉద్యమనాయకుడిని పట్టుకుని ఉరితీస్తానని అంటావా అని ప్రశ్నించారు. జగిత్యాలలో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సమయంలోనే రేవంత్ రెడ్డి కావాలని మేడిగడ్డ పర్యటనను పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని, కానీ రేవంత్ రెడ్డి తానే ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉంటానని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటికే బీజేపీలో చేరారని... ఎన్డీఏకు, రేవంత్ రెడ్డికి మధ్య చంద్రబాబు వారధిగా ఉన్నారని అన్నారు.

నాదెండ్ల భాస్కరరావు గురించి రేవంత్ రెడ్డి తెలియకుండా మాట్లాడుతున్నారని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు నాదెండ్ల భాస్కరరావుకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఆయనకు మద్దతుగా తాను మంత్రి పదవికి రాజీనామా చేశానని వెల్లడించారు. తనను ఎవరూ తొలగించలేదని, తనంతట తానే రాజీనామా చేశానని అన్నారు. తనతో పాటు ఇందిరాగాంధీ, కాంగ్రెస్ సహా అందరూ నాదెండ్లకు మద్దతుగా నిలిచారని వెల్లడించారు. ఈ విషయం రేవంత్ రెడ్డికి తెలియదేమో అని విమర్శించారు.

# ఐఏఎస్ రజిత్ కుమార్‌పై ఆరోపణలు

- మూడు నెలల్లో తేల్చండి : కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు




హైదరాబాద్,ఏప్రిల్ 21(మనం,ప్రత్యేక ప్రతినిధి) : తెలంగాణ ఐఏఎస్ అధికారి రజత్ కుమార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి ఢిల్లీ హైకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఐఏఎస్ అధికారిపై వచ్చిన ఫిర్యాదును మూడు నెలల్లోగా తేల్చాలని కేంద్రాన్ని ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ల నిధులతో ఐఏఎస్ అధికారి తన కుమార్తె వివాహం నిర్వహించారని, అది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఫైవ్ స్టార్ హోటల్లో జరిగిన ఈ వివాహ వేడుకలకు సంబంధించిన ఖర్చులను కాంట్రాక్టర్లే భరించారని పిటిషనర్ ఆరోపించారు. నాలుగేళ్లుగా కేసు విచారణలో ఎలాంటి పురోగతి లేకపోవడంపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ ఫిర్యాదుపై తార్కిక ముగింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అధికారం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉందన్న ఢిల్లీ హైకోర్టు.. ఈ ఫిర్యాదుపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది.

## పవన్ త్వరగా కోలుకోవాలని కొండగట్టులో ప్రత్యేక పూజలు

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న జనసేన శ్రేణులు, అభిమానులు**

హైదరాబాద్, మనం ప్రతినిధి : జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి, పవన్ కల్యాణ్ ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని కోరుతూ చొప్పదండి నియోజకవర్గ జనసేన శ్రేణులు ప్రఖ్యాత కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో నిమగ్నం కావాలని స్వామిని కోరుకున్నారు. పవన్ కల్యాణ్కు కొండగట్టు అంజన్న అంటే ఎంతటి అపారమైన నమ్మకమో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే క్షేత్రంలో ఆయన కోసం పూజలు నిర్వహించడం విశేషం.

# ఓలాకు...ఝులక్

హైదరాబాద్,ఏప్రిల్ 21(మనం, ప్రత్యేక ప్రతినిధి) : ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ నిర్లక్ష్యంపై వినియోగ దారుల కమిషన్ కీలక తీర్పు నిచ్చింది. దీంతో సదరు ఓలా సంస్థ భారీ మూల్యం చెల్లించుకుంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నగరంలోని నల్లగండ్లకు చెందిన సంతోష్ రెడ్డి 2023 నవంబర్ 9న ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కొనుగోలు చేశారు. కాగా కొనుగోలు చేసినప్పటి నుంచే వాహనంలో తరచూ సమస్యలు తలెత్తాయి. దీంతో సంతోష్‌రెడ్డి పలుమార్లు ఓలా సర్వీస్ సెంటర్‌ను ఆశ్రయించారు. ఎన్నిసార్లు తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో విసిగిపోయిన బాధితుడు వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారుడి తరపు వాదనలను విన్న వినియోగదారుల కమిషన్, ఓలా సంస్థ సేవల్లో లోపం ఉందని నిర్ధారించింది. ఈక్రమంలో బాధితుడికి జరిగిన నష్టానికి గానూ వాహనం ధర రూ. 1,19,999 వెనక్కి ఇవ్వాలని, అలాగే ఇన్సూరెన్స్ మొత్తం రూ. 7,243 చెల్లించాలని తీర్పు నిచ్చింది. అదేవిధంగా కేసు ఖర్చులు రూ. 5,000, వినియోగదారుడి మానసిక వేదనకు గానూ మరో రూ. 5,000 చెల్లించాలని కమిషన్ జరిమానా విధించింది.



# సంధ్య కన్వెన్షన్ ఎండీపై మరో కేసు



హైదరాబాద్, ఏప్రిల్ 21(మనం,ప్రత్యేక ప్రతినిధి) : సంధ్యా కన్వెన్షన్ ఎండీ శ్రీధర్ రావు మరోసారి కేసు నమోదు అయింది. ఆర్థిక మోసాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఆయనపై సైబరాబాద్‌లోని ఎకనామిక్ అఫెన్స్ వింగ్‌లో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రూ.14 లక్షల మేర తమను మోసం చేశారంటూ ఆయనపై ఢిల్లీ సంస్థ ఎథెనా ప్రాజెకట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫిర్యాదు చేసింది. ఫోర్జరీ డాక్యుమెంట్లు నకిలీ డాక్యుమెంట్లతో తమను మోసం చేశారంటూ సదరు సంస్థ ప్రతినిధులు పోలీసులకు వివరించారు.ఈ వ్యవహారంలో శ్రీధర్ రావు భార్య సంధ్య భాగస్వామ్యం ఉందని ఆ పిర్యాదులో పేర్కొన్నారు. ఎథెనా ప్రాజెక్ట్ ఇచ్చిన ఫిర్యాదుతో శ్రీధర్ రావు దంపతులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. గతంలో కూడా శ్రీధర్ రావుపై పలు భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వివిధ కేసులు నమోదైన సంగతి తెలిసిందే.

# నేను పాడను గాక పాడను

- సీఎం రేవంత్ అడిగినా పాడను..
- నా గొంతు కేసీఆర్‌కే సొంతం : గాయని మధుప్రియ

హైదరాబాద్, మనం ప్రతినిధి : ప్రముఖ జానపద గాయని, తెలంగాణ ఉద్యమ గళం మధుప్రియ మరోసారి తన రాజకీయ వైఖరిని కుండబద్దలు కొట్టారు. మాజీ సీఎం కేసీఆర్‌కు తాను ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తానని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరినా కాంగ్రెస్ ప్రభుత్వం కోసం పాటలు పాడనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నిర్వహించిన జగిత్యాల కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో తన ఆటపాటలతో సభికులను ఉర్రూతలూగించడమే కాకుండా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌పై తనదైన శైలిలో దుయ్యబట్టారు.



చాల కాలం తర్వాత బీఆర్ఎస్ సభ నిర్వహించగా... జగిత్యాల వేదికగా మధుప్రియ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన పాటలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో భారీ జోష్ నింపారు. ఈ సందర్భంగా 'మళ్లీ బాపు రావాలి.. మళ్లీ కేసీఆర్ పాలన రావాలి' అంటూ ఆమె పాడిన పాట సభలో మార్మోగింది. అనంతరం మీడియాతో మధుప్రియ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలకు కేసీఆర్ అంటే ఒక ఎమోషన్ అని, రాష్ట్ర సాధనలో ఆయన పాత్రను ఎవరూ మరువలేరన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్‌తో తనకు విడదీయరాని అనుబంధం ఉందని ఆమె గుర్తుచేసుకున్నారు. ఇక, రేవంత్ ప్రభుత్వం, పాలనపై మధుప్రియ అత్యంత ఘాటుగానే స్పందించారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ రాష్ట్రంలో రైతులకు బాధలు, పెదల ఇళ్ల కూల్చివేతలు పెరిగిపోయాయంటూ ధ్వజమెత్తారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే తెలంగాణ బాగుందని... అందుకే మళ్లీ ఆయనే అధికారంలోకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని మధుప్రియ పేర్కొన్నారు.

తాను ఎప్పటికీ కేసీఆర్ పక్షానే ఉంటానని పునరుద్ఘాటించారు. 'నా వైఖరి స్పష్టం. నేను కేసీఆర్ సైన్యంలో ఒక సైనికురాలిని. ముఖ్యమంత్రిగా వచ్చి రేవంత్ రెడ్డి అడిగినా సరే?.. నేను కాంగ్రెస్ కోసం ఎట్టి పరిస్థితుల్లో పాట పాడనుగాక పాడను. నా గొంతు ఎప్పటికీ కేసీఆర్ కోసమే' అంటూ మధుప్రియ స్పష్టం చేశారు. దీంతో ఇప్పుడు పలువురు సింగర్స్ సైతం ఆమె అభిప్రాయాన్నే వ్యక్త పరిచినట్లు చెప్తూనే మరోకొందరు సైతం మధుప్రియ బాటలోనే ఇదే అభిప్రాయాన్నే ఏకభవిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

## మిమ్మల్ని ఎన్నిసార్లు ఉరితీయాలి?..

**సీఎం రేవంత్ రెడ్డిపై కొప్పుల ఈశ్వర్ ఫైర్**

హైదరాబాద్, మనం ప్రతినిధి : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. మిస్టర్ రేవంత్ రెడ్డి.. అసలు మీరు ముఖ్యమంత్రియేనా? వీధి రౌడీవా? అని ప్రశ్నించారు. తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ అని గుర్తుచేశారు. 14 ఏండ్లు అలుపెరుగని పోరాటం చేసిన వీరుడు కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డికి స్వాగతం పలికిన కొప్పుల జగిత్యాల సభను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు. అనంతరం ఈశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మీరు ఇవాళ అనుభవిస్తున్న సీఎం సీటు కేసీఆర్ పెట్టిన భిక్ష అని వ్యాఖ్యానించారు. మొన్న సీఎం రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడిండు అని మండిపడ్డారు. అవి ఒక ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన మాటలు కావని అన్నారు. బుద్ధి ఉన్నోడు ఎవడూ అలా మాట్లాడడని తెలిపారు. కేసీఆర్‌ను ఉరితీయాలని రేవంత్ వాగుతున్నాడని మండిపడ్డారు. ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ సాధించినందుకు ఉరితీయాలా అని ప్రశ్నించారు. ఎడారిగా ఉన్న తెలంగాణకు పుష్కలంగా నీళ్లు తెచ్చినందుకు ఉరితీయాలా అని అడిగారు. 80 లక్షల మంది రైతులకు పంట సాయం చేసినందుకా, 24 గంటల కరెంటు ఇచ్చినందుకా? గ్రామాలను అభివృద్ధి చేసినందుకా? ఎందుకు ఉరితీయాలో చెప్పాలని నిలదీశారు. హామీలన్ని చెత్తబుట్టలో వేసిన నిన్ను ఎన్నిసార్లు ఉరితీయాలని ప్రశ్నించారు. రైతులను మోసం చేసిన మిమ్మల్ని ఎన్నిసార్లు ఉరితీయాలని నిలదీశారు.

# వైదిక ధర్మాన్ని కాపాడి, అద్వైతాన్ని ప్రచారాన్ని చేసిన మహానుభావుడు శంకరాచార్యులు

- అంతనూరి వినోద

గజ్వేల్ ఏప్రిల్ 21 మనం న్యూస్ : వైదిక ధర్మాన్ని కాపాడి, అద్వైతాన్ని ప్రచారాన్ని చేసిన మహానుభావుడు శంకరాచార్యులు అని అంతనూరి వినోద అన్నారు. జగద్గురు శంకరాచార్యుల జయంతి సందర్భంగా స్థానిక శ్రీ మురళీకృష్ణ ఆలయంలో సాయంత్రం జగద్గురు శంకరాలకు పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ

ఆది శంకరాచార్యులు క్రీ.శ. 788 లో కేరళలోని కాలడి గ్రామంలో శివగురు, ఆర్యాంబ దంపతులకు జన్మించారు. తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో తల్లి పెంపకంలో పెరిగారు. 3వ ఏటనే మాతృభాష, సంస్కృతం నేర్చుకున్నారు. 5వ ఏట ఉపనయనం జరిగింది. 8వ ఏట నాలుగు వేదాలు, వేదాంగాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నీ పూర్తిగా ఆకళింపు చేసుకున్నారన్నారు.

లోక కల్యాణం కోసం సన్యాసం స్వీకరించాలని శంకరులకు బాల్యం నుండే కోరిక ఉండేది. కానీ ఏకైక కుమారుడు కావడంతో తల్లి ఒప్పుకోలేదు. ఒకరోజు నదిలో స్నానం చేస్తుండగా మొసలి కాలు పట్టుకుంది. అప్పుడు 'అమ్మా, సన్యాసం తీసుకోవడానికి అనుమతిస్తే మొసలి వదిలేస్తుంది' అని వేడుకున్నారు. కొడుకు ప్రాణాలు కాపాడుకోవడానికి తల్లి సరే అంది. వెంటనే మొసలి వదిలేసింది. దీనినే 'ఆతుర సన్యాసం' అంటారు. తర్వాత తల్లి అనుమతితో గురువు కోసం ఉత్తర భారతానికి బయలుదేరారు అన్నారు.



నర్మదా నది తీరాన గోవింద భగవత్పాదులను కలిసి వారి శిష్యరికం స్వీకరించారు. గురువు దగ్గర అద్వైత వేదాంతాన్ని పూర్తిగా అభ్యసించారు. 12వ ఏటనే గురువు ఆజ్ఞతో గ్రంథ రచన, మత ప్రచారం మొదలుపెట్టారు. 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య, జీవో బ్రహ్మైవ నాపరః' - బ్రహ్మమే సత్యం, జగత్తు మిథ్య, జీవుడు బ్రహ్మమే తప్ప వేరు కాదు - అనే అద్వైత సిద్ధాంతాన్ని మహానుభావుడు శంకరాచార్యులు అన్నారు.ఆది శంకరాచార్యులు లేకపోతే ఈ రోజు హిందూ ధర్మం ఈ స్థితిలో ఉండేది కాదని చరిత్రకారులు చెబుతారు. చిన్న వయసులోనే దేశమంతా తిరిగి, ధర్మాన్ని ఉద్ధరించి, అద్వైతం అనే ఏకత్వ భావాన్ని ప్రపంచానికి చాటిన జగద్గురువు ఆయన. అందుకే ఆయనను 'షణ్మత స్థాపనాచార్య', 'జగద్గురు' బిరుదులతో కొలుస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుందర్ సత్సంగ్ సభ్యులు ఉప్పల వెంకటేశం, దూపకుంట మైత్రవములు, అత్తిలి లక్ష్మయ్య అంతునూరి శివకుమార్, ధార రామచంద్రం, తొగుట శ్రీనివాస్, జై హిందు, దూపకుంట లక్ష్మణ్, బండి వెంకట నరసయ్య, సిరిపురం సత్యనారాయణ, ఉప్పల పద్మ, అత్తిలి పద్మ, సిరిపురం చంద్రకళ, నాగమణి, విజయ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మనం Manam


## వసంతగ్రీష్మం

ప్రతి యేడూ
మండు టెండలకు మాడిపోతూ,
వర్షర్తువులో తెప్పరిల్లుతూ,
శరత్తులో తెల్లని మబ్బుల చాటున
దోబూచులాడే హిమాంశుడి తరుగూ పెరుగు
పక్షాల ఆటుపోట్ల చల్లని వెన్నెలకడలిలో
రాత్రుళ్ళు కూసంత ఆదమరచి నిద్రిస్తూ,
హేమంతంలో గడగడా వణుకుతూ
మూడంకె వేసి ముడుచుకు పడుకుంటూ,
శిశిరంలో నిరాశాది పత్రాలను రాల్చుకుంటూ
పదకొండు నెలలూ ఇంకా మంచిరోజుల కోసం
తపనపడుతూ అలసిపోయే
ప్రాణుల దాహం తీర్చడం కోసం
ప్రతిసంవత్సరమూ క్రొత్తవసంతం-
హరితామృతాన్ని ప్రకృతిచషకంలో పోసి
తీసుకువస్తుంది, బాధ లన్నింటినీ మరపింప
జేస్తూ.. మిగతా సంవత్సరానికి సరిపడా
నవోత్సాహ గుణవృద్ధిని కలిగిస్తుంది;
కానీ...ఈ సారి వసంతం ఒంటరిగా
వచ్చినట్లుగా లేదు...
అందరిలాగే తానూ వసంతం అందాలను
చూద్దామనీ,
ఆనందాలను అనుభవిద్దామనీ
వసంతాన్ని నీడలాగా వెన్నంటి
తాపాల రారాజు గ్రీష్ముడూ వచ్చినట్లున్నాడు;
అందుకే ఉదయం పదిగంటల నుండి
సాయంత్రం ఆరుగంటల వరకూ
అప్రకటిత 'కర్ఫ్యూ' పెడుతున్నాడు,
వసంతసౌందర్యానందవీక్షణలు తన సొంతమే
అన్నట్లుగా
గ్రీష్ముడు చూపుల పైనా
నిషేధాజ్ఞలూ విధిస్తున్నాడు
కోకిల కోసం విరహమధురగీతాలు పాడే
కోకిలుడి గొంతు పైనా
వాడిగా వేడిగా దాడి చేస్తున్నట్లున్నాడు
అందుకే కోకిలుడి గీతం వినిపించడం లేదు
అరుదుగా వినిపించినా
బొంగురుగా వినిపిస్తోంది
ఆహ్లాదమలయానిలాలూ
మనస్ఫూర్తిగా వీచడం లేదు,
ఏ హృదయంపైనా అందాల
వసంతసంతకం కనిపించడం లేదు
అనంత వసంత సుందర ప్రకృతి వనాలనూ,
సర్వపుష్ప పరిమళ పవనాలనూ,
గతజ్ఞాపకాలలోనే జనం
చూసుకుంటున్నారు
కవుల కావ్యాలలోనే చదువుకుంటున్నారు
ఇది- ఈ సంవత్సర కేవల వసంతం కాదు
మనకు తెలిసీ ఇది తొట్టతొలి 'వసంతగ్రీష్మం'
ఆనందవిషాదాలను కలగలిపి కాలం
మనకు అందిస్తూన్న అనుభవగీతం!!!

- 'రఘువర్మ'
9290093933

# 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదమైతే...!



భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి మూల స్తంభం. స్వాతంత్ర్యం తర్వాత ఏర్పడిన ఈ రాజ్యాంగం దేశ పరిపాలనకు మార్గదర్శకంగా నిలుస్తూ వచ్చింది. కాలానుగుణమార్పులు అవసరమవుతుంటాయి కాబట్టి సవరణలు కూడా చోటుచేసుకుంటాయి. అయితే ప్రతి సవరణ రాజ్యాంగ ఆత్మను కాపాడే విధంగా ఉండాలి. ఇటువంటి సందర్భంలో పార్లమెంటులో ప్రవేశపెట్టబడిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ఒక ముఖ్యమైన పరిణామం. ఈ బిల్లు ఆమోదమైతే దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో గణనీయమైన మార్పులు సంభవించే అవకాశం ఉండేది.

ఈ బిల్లు కేంద్ర ప్రభుత్వ అధికారాలను విస్తరించే దిశగా ఉందని విమర్శలు వచ్చాయి. భారతదేశం ఒక సమాఖ్య వ్యవస్థ కలిగిన దేశం. ఇందులో కేంద్రం, రాష్ట్రాలు పరస్పర సహకారంతో పనిచేయాలి. కానీ ఈ బిల్లు ఆమోదమైతే రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి తగ్గిపోవడం అనివార్యమయ్యేది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కోల్పోయే ప్రమాదం ఉండేది. దీనివల్ల ప్రాంతీయ అసంతృప్తి పెరిగి దేశ ఐక్యతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉండేది.

భారత రాజ్యాంగంలోని ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం ప్రకారం కొన్ని మూల విలువలు ఎట్టి పరిస్థితుల్లోనూ మార్పులకు లోబడవు. ఫెడరలిజం, న్యాయ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య పరిపాలన వంటి అంశాలు ఇందులో భాగం. ఈ బిల్లు ఆమోదమైతే ఈ ప్రాథమిక నిర్మాణంపై ప్రభావం చూపే ప్రమాదం ఉండేది. ముఖ్యంగా న్యాయవ్యవస్థ స్వతంత్రత తగ్గిపోతే సాధారణ ప్రజలకు న్యాయం అందే ప్రక్రియ దెబ్బతినే అవకాశం ఉండేది. రాజకీయ పరంగా కూడా ఈ బిల్లు తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది. కేంద్ర అధికారాల పెరుగుదలపై ఇప్పటికే అనేక రాష్ట్రాలు అప్రమత్తంగా ఉంటాయి. ఈ బిల్లు ఆమోదమైతే దేశవ్యాప్తంగా నిరసనలు, రాజకీయ అస్థిరత, ప్రభుత్వంపై అవిశ్వాసం పెరిగే పరిస్థితులు ఏర్పడేవి.

ఆర్థిక పరంగా చూస్తే రాష్ట్రాల ఆర్థిక స్వతంత్రత తగ్గిపోవడం అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపేది. రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకునే అవకాశం తగ్గిపోవడం వల్ల ప్రాంతీయ అసమానతలు పెరిగే ప్రమాదం ఉండేది. సామాజికంగా కూడా ఈ బిల్లు ప్రభావం చూపే అవకాశం ఉంది. భారతదేశం భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలతో కూడిన దేశం. కేంద్ర అధికారాల పెరుగుదల వల్ల ఈ వైవిధ్యంపై ప్రభావం పడితే సామాజిక ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉండేది. ప్రాంతీయ భావోద్వేగాలు దెబ్బతింటే జాతీయ ఐక్యతకు సవాళ్లు ఎదురయ్యేవి. అయితే ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థ బలాన్ని చూపిస్తుంది. ప్రతిపక్షం, మిత్రపక్షాలు వ్యక్తం చేసిన ఆందోళనలు, చర్చలు ఈ బిల్లును నిలిపివేశాయి.

131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదమైతే అధికార కేంద్రీకరణ పెరిగి ఫెడరల్ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉండేది. ప్రజాస్వామ్య విలువలు దెబ్బతినే అవకాశముంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అస్థిరత ఏర్పడే అవకాశం ఉంది. ఈ బిల్లు వీగిపోవడం వల్ల ఈ ప్రమాదాలు తప్పించుకున్నట్లు భావించవచ్చు. భవిష్యత్తులో రాజ్యాంగ సవరణలు ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, ప్రజాస్వామ్య మూల సూత్రాలను కాపాడే విధంగా ఉండాలి అనే పాఠాన్ని ఈ సంఘటన స్పష్టంగా తెలియజేస్తుంది.

భారతదేశంలో సమాఖ్య వ్యవస్థ అనేది కేవలం రాజ్యాంగపరమైన నిర్మాణం మాత్రమే కాదు, అది భిన్న సంస్కృతులు, భాషలు, ప్రాంతీయ ప్రత్యేకతలను సమన్వయపరచే ఒక సున్నితమైన వ్యవస్థ. ఈ వ్యవస్థలో కేంద్రం ప్రధాన పాత్ర పోషించినప్పటికీ రాష్ట్రాలకు కూడా సమాన ప్రాముఖ్యత ఉంటుంది. 131వ సవరణ బిల్లు ద్వారా కేంద్రం అధిక అధికారాలను స్వీకరించడానికి ప్రయత్నిస్తే, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి క్రమంగా తగ్గిపోయే అవకాశం ఉండేది. ఈ పరిస్థితి దీర్ఘకాలంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాలను దెబ్బతీసి రాజకీయ ఘర్షణలకు దారి తీసే ప్రమాదం ఉండేది. ఇంకొక ముఖ్యమైన అంశం ప్రజల విశ్వాసం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ప్రభుత్వంపై ఉంచే నమ్మకం అత్యంత కీలకం. అధికార కేంద్రీకరణ ఎక్కువైతే ప్రజలు తమ ప్రతినిధుల ద్వారా పాలనలో భాగస్వామ్యం కావడం కష్టమవుతుంది. ఇది ప్రజలలో అసంతృప్తిని పెంచే అవకాశం ఉంది.

న్యాయపరంగా కూడా ఈ బిల్లు ప్రభావం గణనీయంగా ఉండేది. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం ప్రకారం న్యాయవ్యవస్థ స్వతంత్రంగా ఉండాలి. ఒకవేళ కేంద్రానికి న్యాయ వ్యవస్థపై పరోక్ష నియంత్రణ సాధించే అవకాశం కలిగితే, న్యాయ స్వేచ్ఛ తగ్గిపోవచ్చు. దీని వల్ల న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంది.


రాజకీయ వ్యవస్థలో ప్రతిపక్ష పాత్ర కూడా చాలా ముఖ్యం. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రభుత్వ చర్యలను పరిశీలిస్తూ సమతౌల్యం తీసుకువస్తుంది. కానీ అధికార కేంద్రీకరణ పెరిగితే ప్రతిపక్షం బలహీనపడే అవకాశం ఉంది. పాలనా నిర్ణయాలు సమగ్ర చర్చలు లేకుండా తీసుకునే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది.

ఆర్థిక పరంగా కూడా ఈ బిల్లు ప్రభావం విస్తృతంగా ఉండేది. రాష్ట్రాలకు ఆర్థిక స్వేచ్ఛ తగ్గిపోతే అభివృద్ధి కార్యక్రమాలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవడం కష్టమవుతుంది. ఇది ప్రాంతాల మధ్య అసమానతలను పెంచే అవకాశం కల్పిస్తుంది.

అంతర్జాతీయ స్థాయిలో కూడా ఈ బిల్లు ప్రభావం కనిపించే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం ప్రపంచంలో మంచి గుర్తింపు పొందింది. ఒకవేళ అధికార కేంద్రీకరణ ఎక్కువై ప్రజాస్వామ్య విలువలు బలహీనపడితే అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉంది.

ఈ బిల్లు వీగిపోవడం వల్ల పై చెప్పిన అనేక ప్రమాదాలు తప్పించుకున్నట్లు చెప్పవచ్చు. ప్రజాస్వామ్యంలో చర్చలు, వాదనలు, విమర్శలు ఎంత ముఖ్యమో ఈ సంఘటన స్పష్టంగా చూపించింది.

పార్లమెంట్ కేవలం చట్టాలు ఆమోదించే వేదిక మాత్రమే కాదు. అది ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే సంస్థ. ఈ




బిల్లు ఆమోదం పొందకపోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో సమతౌల్యం నిలిచింది.

భవిష్యత్తులో ఇలాంటి సవరణలు ప్రవేశపెట్టేటప్పుడు ప్రభుత్వం మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. రాష్ట్రాల అభిప్రాయాలు, నిపుణుల సూచనలు, ప్రజల స్పందనలను పరిగణనలోకి తీసుకోవాలి. రాజ్యాంగ సవరణలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఉండాలి తప్ప బలహీనపరచే విధంగా ఉండకూడదు.

మొత్తంగా చూస్తే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఒక హెచ్చరికలా నిలిచింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో సమతౌల్యం ఎంత ముఖ్యమో గుర్తు చేసింది. కేంద్రం, రాష్ట్రాలు పరస్పర గౌరవంతో, సహకారంతో ముందుకు సాగితేనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజల విశ్వాసం, న్యాయవ్యవస్థ స్వతంత్రం, రాజకీయ పారదర్శకత వంటి అంశాలు కాపాడబడితేనే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

ఈ సంఘటన ఒక పాఠాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. రాజ్యాంగం కేవలం చట్టపత్రం కాదు. అది ప్రజల ఆశయాల ప్రతిబింబం. దానిలో చేసే ప్రతి మార్పు ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.

అందుకే ప్రతి సవరణ జాగ్రత్తగా, సమగ్ర చర్చల తర్వాత మాత్రమే ఆమోదం పొందాలి. ఇదే భారత ప్రజాస్వామ్య బలానికి మూలాధారం.

మొత్తం విశ్లేషణను సమగ్రంగా పరిశీలిస్తే, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు కేవలం ఒక చట్ట ప్రతిపాదన మాత్రమే కాదు. అది భారత ప్రజాస్వామ్య వ్యవస్థ భవిష్యత్తును ప్రభావితం చేసే సామర్థ్యం కలిగిన కీలక దశగా భావించాలి. ఈ బిల్లు ఆమోదమైతే అధికార కేంద్రీకరణ వేగంగా పెరిగే అవకాశం ఉండేది. ఫలితంగా సమాఖ్య వ్యవస్థలో సమతౌల్యం దెబ్బతిని రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి క్షీణించే పరిస్థితి ఏర్పడేది. ఇది క్రమంగా రాజకీయ అసంతృప్తి, ప్రాంతీయ ఉద్రిక్తతలు, ప్రజలలో నమ్మకం తగ్గుదల వంటి పరిణామాలకు దారి తీసే ప్రమాదాన్ని కలిగించేది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారాల విభజన, పరస్పర నియంత్రణ, పారదర్శకత వంటి అంశాలు మూల స్తంభాలు. ఈ సూత్రాలు బలహీనపడితే ప్రజాస్వామ్యం రూపకల్పనలోనే మార్పు సంభవిస్తుంది. 131వ సవరణ బిల్లు ఆమోదమైతే ఈ మూల విలువలపై ప్రభావం చూపే అవకాశం ఉండేది. ముఖ్యంగా న్యాయవ్యవస్థ స్వతంత్రత, శాసన వ్యవస్థ పాత్ర, ప్రజల ప్రతినిధుల ప్రాముఖ్యత వంటి అంశాలు క్రమంగా తగ్గిపోయే ప్రమాదం ఉండేది. ఇది చివరకు ప్రజాస్వామ్యాన్ని రూపంలో మాత్రమే ఉంచి, ఆత్మను బలహీనపరచే పరిస్థితికి దారి తీసే అవకాశం ఉండేది.

ఇక ఆర్థిక, సామాజిక కోణాల్లో కూడా దీని ప్రభావం తీవ్రమై ఉండేది. రాష్ట్రాల ఆర్థిక స్వేచ్ఛ తగ్గిపోతే అభివృద్ధి అసమానంగా మారేది. కొన్ని ప్రాంతాలు ముందుకు సాగుతుండగా మరికొన్ని వెనుకబడే పరిస్థితి ఏర్పడేది. సామాజికంగా ప్రాంతీయ భావోద్వేగాలు పెరిగి జాతీయ ఐక్యతకు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉండేది. భాషా, సాంస్కృతిక వైవిధ్యాలను గౌరవించే భారత స్వభావం దెబ్బతినే ప్రమాదం కూడా ఉండేది.

అయితే ఈ బిల్లు పార్లమెంటులో విరిగిపోవడం ప్రజాస్వామ్య శక్తిని ప్రతిబింబిస్తుంది. చర్చలు, వాదనలు, విభిన్న అభిప్రాయాలు కలిసి ఒక సమతౌల్య నిర్ణయానికి దారి తీసినట్లు స్పష్టమవుతుంది. ఇది భారత ప్రజాస్వామ్యంలో సంస్థలు ఇంకా సజీవంగా ఉన్నాయని తెలియజేస్తుంది. ప్రజల అభిప్రాయాలు, ప్రతిపక్ష పాత్ర, రాజ్యాంగ పరిరక్షణ కలిసికట్టుగా ఒక ముఖ్యమైన నిర్ణయాన్ని ప్రభావితం చేసిన సంఘటనగా ఇది నిలిచింది.

భవిష్యత్తు దృష్ట్యా ఈ సంఘటన ఒక గొప్ప పాఠాన్ని అందిస్తుంది. రాజ్యాంగ సవరణలు త్వరితగతిన చేయాల్సిన చర్యలు కావు. అవి విస్తృత చర్చలు, నిపుణుల పరిశీలన, రాష్ట్రాల అభిప్రాయాలు, ప్రజల స్పందన వంటి అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని మాత్రమే చేయాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఉండే మార్పులు మాత్రమే దేశానికి మేలు చేస్తాయి.

చివరగా చెప్పాలంటే, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ఒక సాధారణ రాజకీయ సంఘటన కాదు; అది ప్రజాస్వామ్య పరిరక్షణలో ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ సంఘటన భారతదేశానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది-అధికార కేంద్రీకరణ కంటే సమతౌల్యం ముఖ్యము, వేగం కంటే వివేకం ముఖ్యము, చట్టాల కంటే ప్రజల విశ్వాసం ముఖ్యము. ఈ సూత్రాలను పాటిస్తూ ముందుకు సాగితేనే భారత ప్రజాస్వామ్యం భవిష్యత్తులో మరింత బలంగా, స్థిరంగా నిలబడగలదు.

- డా . రక్కిరెడ్డి ఆదిరెడ్డి
9849577610

# సమ్మె.. సంక్షోభం.. ఆర్టీసీపై భారం

భారతదేశ సామాజిక ముఖచిత్రంలో ప్రజా రవాణా వ్యవస్థ అక్షరాలా కోట్లాది మంది సామాన్యుల జీవన గమనానికి వెన్నెముక వంటిది. ముఖ్యంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు కేవలం రవాణా సాధనాలు మాత్రమే కావు, అవి గ్రామీణ భారతాన్ని పట్టణ ప్రగతితో అనుసంధానించే జీవనాడులు. నిరుపేదలు, విద్యార్థులు, కార్మికులు, చిన్న వ్యాపారులు తమ దైనందిన అవసరాల కోసం ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడతారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, పరిపాలనా పరమైన వైఫల్యాలు, ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వెరసి కార్మిక సమ్మెలకు దారి తీస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె అనేది కేవలం వేతనాల పెంపు కోసం జరిగే పోరాటం మాత్రమే కాదు, అది ప్రజా రవాణా వ్యవస్థ మనుగడ కోసం, సామాన్యుడి ప్రయాణ హక్కు కోసం ఉద్భవించిన ఒక పెను సామాజిక-ఆర్థిక ఉద్యమంగా పరిగణించాల్సి ఉంటుంది.




స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో 1950వ దశకంలో ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ సంస్థలు ఆవిర్భవించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ, నవ్యాంధ్ర వరకు ఆర్టీసీ సేవలు అజరామరమైనవి. నాడు లాభసాటిగా సాగిన ఈ ప్రయాణం క్రమంగా నష్టాల బాట పట్టడానికి ప్రధాన కారణం పెరిగిన ఇంధన ధరలు మరియు ప్రభుత్వాల పన్నుల విధానం. డీజిల్ ధరలు లీటరుకు 100 రూపాయలకు పైగా చేరుకుంటున్నా, సామాన్యుడిపై భారం పడకూడదనే ఉద్దేశంతో టికెట్ ధరలను పెంచక పోవడం సంస్థకు భారంగా మారింది. దీనికి తోడు ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణా వల్ల సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఆర్టీసీ నిర్వ హణలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ఉచితాలు సంస్థ ఆర్థిక సంక్షోభానికి మరో ప్రధాన కారణం. ఉదాహరణకు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యార్థులు, దివ్యాంగులు, జర్నలిస్టులు, వృద్ధులకు ఇచ్చే రాయితీల భారం ఏటా వందల కోట్లలో ఉంటుంది. ఈ రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం సకాలంలో రీయంబర్స్ చేయక పోవడం వల్ల సంస్థ అప్పుల ఊబిలో కూరుకు పోతోంది. గణాంకాల ప్రకారం, ఒక్క తెలంగాణ ఆర్టీసీపైనే గతంలో సుమారు 5,000 కోట్ల రూపాయలకు పైగా అప్పులు ఉండగా, నెలవారీ నష్టం 50 నుండి 80 కోట్ల రూపాయల వరకు నమోద వుతూ వచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సుమారు 48,000 నుండి 50,000 మంది ఉద్యోగులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు కేవలం వాహనాలను నడపడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు బాధ్యత వహిస్తున్నారు. అయితే పని ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, సరైన వైద్య సౌకర్యాలు అందకపోవడం వంటి అంశాలు వారిని మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2019లో తెలంగాణలో జరిగిన చారిత్రాత్మక ఆర్టీసీ సమ్మె ఈ సమస్యల తీవ్రతకు నిలువుటద్దం. 52 రోజుల పాటు సాగిన ఆ సమ్మెలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీనివల్ల రోజుకు 10 నుండి 15 కోట్ల రూపాయల ఆదాయం సంస్థ కోల్పోయింది. సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించడానికి కేవలం సమ్మెలు పరిష్కారం కావు. ప్రభుత్వం మరియు యజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఆర్టీసీని ఒక వ్యాపార సంస్థగా కాకుండా సామాజిక సేవా సంస్థగా చూడాలి. ప్రభుత్వాలు బడ్జెట్లో ఆర్టీసీకి ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా, పన్ను రాయితీలు కల్పించాలి. డీజిల్‌పై వాట్ తగ్గించడం ద్వారా ఏటా వందల కోట్ల రూపాయల వ్యయాన్ని ఆదా చేయవచ్చు. ప్రస్తుతం టికెట్ ఆదాయం కాకుండా ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగానే తెలంగాణ ఆర్టీసీ ప్రారంభించిన 'కార్గో మరియు పార్సిల్' సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రోజుకు సుమారు 50నుండి70లక్షల రూపాయల వరకు అదనపు ఆదాయం ఈ సేవల ద్వారా సమకూరు తోంది.

ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం మరొక కీలక సంస్కరణ. కిలోమీటరుకు డీజిల్ బస్సుతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సు నిర్వహణ ఖర్చు 30% నుండి 40% వరకు తక్కు వగా ఉంటుంది. పర్యావరణ హితంగా ఉండటమే కాకుండా ఇంధన భారాన్ని ఇది గణనీయంగా తగ్గిస్తుంది. ఇప్పటికే హైదరాబాద్ వంటి నగరాల్లో వందలాది ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశ పెట్టడం శుభ పరిణామం. ఇటీవల తెలంగాణ ప్రభు త్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను చేపట్టింది. ఇది కార్మికుల దశాబ్దాల కల. దీనివల్ల సుమారు 43,000 మందికి పైగా కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొంది, ఉద్యోగ భద్రత మరియు సరైన వేతన సవరణ పొందే అవకాశం ఏర్పడింది.

అయితే, సంస్థ స్వయం ప్రతిపత్తిని కాపాడుతూనే ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం సవాలుతో కూడుకున్న పని. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టడం, ప్రయాణికుల కోసం మొబైల్ యాప్ల ద్వారా లైవ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలు సంస్థపై నమ్మకాన్ని పెంచుతాయి. కార్మికులతో యజమాన్యం నిరంతరం చర్చలు జరుపుతూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఒక పటిష్టమైన గ్రీవెన్స్ మెకానిజంను ఏర్పాటు చేయాలి. ప్రజల అవసరాలు, కార్మికుల సంక్షేమం, ప్రభుత్వ ఆర్థిక స్థిరత్వం ఈ మూడింటి మధ్య సమ తుల్యత దెబ్బతిన్నప్పుడే సంక్షోభాలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు, ఆధునిక సంస్కరణలు మరియు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తేనే ఆర్టీసీ మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరిం చుకుంటుంది. భావితరాలకు భరోసా ఇచ్చేలా, సామాన్యుడి ముంగిట ఎర్ర బస్సు నిరంతరం పరుగులు తీయాలంటే సంకల్పం మరియు సమష్టి కృషి అనివార్యం. సమ్మెలు తాత్కాలిక సెగను రేపవచ్చు. కానీ చర్చలు..సంస్కరణలు మాత్రమే శాశ్వత వెలుగును నింపుతాయి. ఆర్టీసీ మనుగడ అనేది కేవలం ఒక ఆర్థిక అంశం కాదు, అది లక్షలాది కుటుంబాల జీవనోపాధి మరియు కోట్ల మంది సామాన్యుల కనీస రవాణా హక్కు. ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఆధునీకరించడం ద్వారా మాత్రమే సుస్థిరమైన పురోగతి సాధ్యమవుతుంది. అందుకే ఆర్టీసీ భవిష్యత్తు ప్రభుత్వ చిత్తశుద్ధి మరియు కార్మికుల అంకితభావంపై ఆధారపడి ఉంది. సమగ్ర ప్రణాళికలతో సంస్థను బలోపేతం చేసి ఆర్టీసీని మళ్ళీ అగ్రగామిగా నిలబెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పారిశ్రామిక శాంతి నెలకొన్నప్పుడే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయి. సంస్థ కూడా లాభాల బాట పడుతుంది.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# భువికి-జీవికి జలమే జీవనాధారం



విశ్వంలో మూడు వంతుల నీరు..ఒక వంతు భూమి ఉంది. ఈభూమికి, దానిపై నివసించే జీవరాశికి సాగునీరు,తాగునీరు లభించడం లేదు. మానవ స్వార్థపూరిత కార్యకలాపాల నుండి ధరిత్రిని, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం..మొక్కలు పెంచడం పైచైతన్యం కల్పించడం '22మే-ఏప్రిల్ అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవ' ప్రాముఖ్యత.



సృష్టి ఆది నుంచి జీవం నిలబెట్టిన మూలాధారం జలం. అందుకే ఏరు ఉన్న చోటే ఊరు-నది ఉన్న చోటే నాగరికత అనే నానుడి శాశ్వత సత్యంగా నిలిచింది. మనిషి జీవన విధానంలో నీరు కేవలం దాహం తీర్చేది మాత్రమే కాదు; అది జీవన యంత్రాన్ని నడిపించే ప్రధాన శక్తి. మన శరీరం నుంచి పంట పొలాల వరకు, పరిశ్రమల నుంచి పర్యావరణ సమతుల్యత వరకు..అన్నింటికీ నీటి చుక్కే ఆధారం.ఈనేపథ్యంలో నీటి విలువను అర్థం చేసుకోవడం, దాన్ని సంరక్షించడం ప్రతి మనిషి బాధ్యతగా మారింది.

ఇటీవలి కాలంలో భూమి ఉపరితల వాతావరణం గరిష్ట సాయిలు వేడెక్కడంతో మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఎండల తీవ్రత ఏటేటా పెరుగుతోంది. ఒకవైపు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకుంటే, మరోవైపు వర్షపాతంఅసమానంగా మారుతోంది.కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు,మరికొన్ని చోట్ల తీవ్రమైన ఎండలు-ఈ అసమతుల్యత సహజ వనరులైన భూమి,నీరు, పర్యావరణాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. భూగర్భ జలాలను అధికంగా వినియోగించడం వల్ల నీటి మట్టాలు పడిపోతున్నాయి. అడవుల నరికివేత వర్షపాతాన్ని ప్రభావితం చేస్తోంది. ఫలితంగా భవిష్యత్తులో భూఉపరితలం కాలుష్య ఉద్గారాలతో, సురక్షిత నీటి(ఎద్దడితో)సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ఇక కాలుష్యం మరో పెద్ద సమస్య. పరిశ్రమల నుంచి విడుదలయ్యే రసాయనాలు,పట్టణాల్లో సరైన మురుగు నిర్వహణ లేకపోవడం వల్ల నదులు,చెరువులు కలుషిత మవుతున్నాయి. ఈ నీటిని వినియోగించడం వల్ల ప్రజలు అనేక రోగాలకు గురవుతున్నారు.ఇది కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా భారాన్ని మోపుతోంది. సమకాలీనంగా చూస్తే,దేశంలో జల్ జీవన్ మిషన్ వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాలకు శుద్ధమైన తాగునీటిని అందించే దిశగా ముందుకు సాగుతున్నాయి. అలాగే మిషన్ భగీరథ వంటి కార్యక్రమాలు కొన్ని రాష్ట్రాల్లో మంచి ఫలితాలను ఇస్తున్నాయి. అయినప్పటికీ అమలు లోపాలు, నిర్వహణ సమస్యలు, అవగాహన కొరత వల్ల ఆశించిన స్థాయిలో ఫలితాలు అందడం లేదు. పైపులైన్ల లీకేజీలు,కలుషిత నీటి ప్రవాహం వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. భూమి, నీరు, పర్యావరణం సంరక్షణలో ప్రజల పాత్ర అత్యంత కీలకం. ప్రతి ఇంటిలో వర్షపు నీటిని నిల్వచేసే పద్ధతులు అమలు చేయాలి. ఇంకుడు గుంటలు ఏర్పాటు చేయాలి. నీటిని వృథా చేసే అలవాట్లను తగ్గించాలి. వ్యవసాయంలో నీటి వినియోగాన్ని తగ్గించే విధానాలను ప్రోత్సహించాలి. పాలకుల బాధ్యత కూడా తక్కువ కాదు. చెరువులు, సరస్సులు పునరుద్ధరించాలి. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యాన్ని కట్టడి చేయాలి. భూమిపై విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయడాన్ని నిషేధించాలి. భూమిపై జననివాస ప్రాంతాల పారిశుద్ధ్యం, కాలుష్య నివారణ తాగునీటి భద్రతకు కీలకం. చెత్త నిర్వహణ సక్రమంగా లేకపోతే నీటి వనరులు కలుషితమవుతాయి. అందుకే స్వచ్ఛతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి. భూమిని,నీటిని కాపాడితేనే మన భవిష్యత్తును కాపాడగలం.

ప్రాధాన్యత గురించి చెప్పాలంటే, 'భువికి-జీవికి జలమే జీవనాధారం'. మనం ఈ రోజు తీసుకునే నిర్ణయాలే రేపటి తరాల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. భూమి నీ పరిరక్షిస్తూ, నీటి చుక్కను గౌరవించే సంస్కృతి మనలో పెరగాలి. ప్రతి నీటిచుక్క- ఆరోగ్యకర జీవితానికి శాశ్వత పునాదిఅనే భావనతో ముందుకు సాగుదాం..వేసవి గండం నుండి గట్టెక్కుదాం.

- మేకిరి దామోదర్
9573666650

# తమిళ తారల స్టార్ తిరిగేనా..?

తమిళనాడు రాజకీయాలు మరోసారి ఆసక్తికరంగా మారాయి. ఈసారి చర్చలో ప్రధానంగా నిలుస్తున్నది సినీ నటుల రాజకీయ ప్రవేశం, ముఖ్యంగా నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభావం. ఇదే సమయంలో సీమాన్ నాయకత్వంలోని నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) కూడా తన స్థాయిని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఈ పరిణామాలన్నీ కలిపి రాష్ట్ర రాజకీయ సమీకరణాలను కొత్త దిశలో మలుస్తున్నాయి. అయితే సినిమా ప్రభావం నిజంగా ఓటుగా మారుతుందా? అనే ప్రశ్న అందరిలో ఉత్కంఠను రేకెత్తిస్తోంది.

తమిళనాడులో సినీ నటులు రాజకీయాల్లోకి రావడం కొత్త విషయం కాదు. ఎమ్.జి. రామచంద్రన్ (ఎంజీఆర్), జయలలిత వంటి నేతలు తెరపై వచ్చిన ప్రజాదరణను రాజకీయ విజయంగా మలిచిన అరుదైన నాయకులు. అయితే ఈ విజయాల వెనుక కేవలం స్టార్ ఇమేజ్ మాత్రమే కాదు. బలమైన పార్టీ నిర్మాణం, స్పష్టమైన సిద్ధాంతం, నిరంతర ప్రజలతో మమేకం కావడం కూడా కీలక పాత్ర పోషించాయి. తాజాగా తమిళనాడులో నెలకొన్న పరిస్థితుల్లో విజయ్ ప్రవేశం యువతలో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తించింది. ఆ ఉత్సాహం అధికారంగా మారుతుందా? అన్న ప్రశ్నకు ఇంకా స్పష్టత లేదు. టీవీకేకు ఇవి తొలి ఎన్నికలే కావడంతో, పార్టీ నిర్మాణం, స్థానిక నాయకత్వం, బూత్ స్థాయి నిర్వహణ వంటి అంశాలు పెద్ద సవాళ్లుగా మారుతున్నాయి. అభ్యర్థుల పరిచయం, వారి సామాజిక మూలాలు, స్థానిక సమస్యలపై అవగాహన ఇవన్నీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తాయి. కేవలం స్టార్ ఆకర్షణతోనే నియోజకవర్గాల్లో ప్రభావం చూపించడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో టీవీకే కొన్ని ప్రాంతాల్లో ప్రభావం చూపినా, మొత్తం రాష్ట్రవ్యాప్తంగా సమానంగా ప్రభావం చూపడం కష్టసాధ్యమే అన్న అభిప్రాయం ఉంది.

మరోవైపు సీమాన్ నేతృత్వంలోని ఎన్టీకే ఇప్పటికే ఒక స్థిరమైన ఓటు బ్యాంకును నిర్మించుకుంది. తమిళ జాతీయవాదం, వ్యవసాయం, పర్యావరణం వంటి భావోద్వేగ అంశాలతో యువతను ఆకర్షించిన ఈ పార్టీ, గత ఎన్నికలతో పోలిస్తే ఓటు శాతాన్ని క్రమంగా పెంచుకుంది. అయితే ఈసారి టీవీకే ప్రవేశం కారణంగా అదే యువ ఓటు బ్యాంకు చీలిపోయే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా కొత్తదనం కోసం ఎదురుచూసే ఓటర్లు విజయ్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.

తమిళనాడులో సంప్రదాయ పార్టీల బలం కొత్తవారికి సవాలే అని చెప్పాలి. ప్రస్తుతం డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి సంప్రదాయ పార్టీలు బలమైన కేడర్, సామాజిక వర్గాల మద్దతుతో నిలబడుతున్నాయి. ఈ పార్టీలను సవాలు చేయాలంటే కొత్త పార్టీలకు దీర్ఘకాలిక వ్యూహం, స్పష్టమైన సిద్ధాంత దృక్పథం అవసరం. టీవీకే ఇప్పుడే ఆ స్థాయికి చేరుకోవడం కష్టమే అయినప్పటికీ, భవిష్యత్తులో అది ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగే అవకాశాన్ని మాత్రం పూర్తిగా కొట్టిపారేయలేం. విశ్వసనీయత అనేది చాలా కీలకమైన అంశం, ఇది మరో ముఖ్య కోణం. సినీ నటులపై ప్రజల్లో ఉన్న విశ్వసనీయత తెరపై హీరోగా కనిపించే వ్యక్తి నిజ జీవితంలో కూడా అదే స్థాయిలో నాయకత్వాన్ని చూపగలడా? అన్నది ఓటర్లు పరిశీలించే అంశం. ప్రజలు ఇప్పుడు కేవలం తారల స్టార్ ఇమేజ్‌కే కాకుండా వారి పనితీరు, నిబద్ధత, పారదర్శకత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సోషల్ మీడియా విస్తరణతో నాయకులపై పరిశీలన మరింత పెరిగింది. టీవీకే, ఎన్టీకే వంటి పార్టీల ప్రభావం చివరకు 'కింగ్ మేకర్' పాత్రలో కనిపించే అవకాశమూ ఉంది. ముఖ్యంగా ట్రయాంగిల్ పోటీ చోటు చేసుకుంటే, చిన్న ఓటు శాతం కూడా ఫలితాలను ప్రభావితం చేయగలదు. ఈ కోణంలో చూస్తే, ఈ పార్టీల అసలు బలం గెలుపు కంటే ఇతర పార్టీల విజయావకాశాలను ప్రభావితం చేయడంలోనే కనిపించే అవకాశముంది.మొత్తానికి, తమిళనాడు రాజకీయాల్లో సినీ తారల ప్రవేశం ఒక ఆసక్తికర ప్రయోగం. కానీ అది విజయం సాధించాలంటే కేవలం అభిమాన గణం సరిపోదు. బలమైన సంస్థాగత నిర్మాణం, స్పష్టమైన రాజకీయ దిశ, నిరంతర ప్రజా సంబంధం అవసరం. తెరపై సంపాదించిన కీర్తి ఓటు పెట్టెలోకి మారాలంటే, నటుడు నాయకుడిగా రూపాంతరం చెందాల్సిందే. ఈ మార్పు ఎంతవరకు సాధ్యమవు తుందనేది విజయ్ రాజకీయ భవిష్యత్తు, అలాగే తమిళనాడు రాజకీయాల దిశ నిర్ణయించబోతోంది.

- ఉదయ్ కుమార్. జి
83676 03197

# సుల్తానాబాద్ అభివృద్ధియే ధ్యేయం

- సుల్తానాబాద్ అభివృద్ధిపై గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం
- సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్నా
- రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



సుల్తానాబాద్, ఏప్రిల్ 21 (మనం న్యూస్): సుల్తానాబాద్ పట్టణంలోని ఊర చెరువును మినీ ట్యాంక్ బండ్ గా నిర్మించేందుకు రూ.12 కోట్ల నిధులతో చేపట్టే పనులకు చెరువు వద్ద మంగళవారం రోజున సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు,నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...చాలా కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న చెరువు అభివృద్ధి వల్ల సుల్తానాబాద్ తో పాటు పలు గ్రామాల పంట పొలాలకు ఆయకట్టు స్థిరీకరణ పెరుగుతుందన్నారు. అలాగే కట్ట అభివృద్ధితో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకుగాను టూరిజం శాఖతో రూ. మరో 2 కోట్ల నిధులను మంజూరీ చేయిస్తానన్నారు. ఇప్పటికే పట్టణంలో ప్రధాన రోడ్లను వెడల్పు చేసి సిసి రోడ్లుగా అభివృద్ధి చేయడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. పూసాల రోడ్డు సెంట్రల్ లైటింగ్ వలె అంబేద్కర్ చౌరస్తా నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు వెడల్పు చేసి ఆధునికరించి ఏర్పాటు చేసిన సెంట్రింగ్ లైటింగ్ ను త్వరలోనే ప్రారంభించనున్నట్టు చెప్పారు. ప్రధాన రోడ్ల నుండి మార్కండేయ కాలనీ, శ్రీరాములపల్లి గ్రామాలకు రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. అమృత్ 2 స్కీం కింద రక్షిత మంచినీటి సదుపాయాన్ని విస్తరించి సమస్య లేకుండా చేస్తామన్నారు. ఇందుకు సంబంధించిన పనులు ప్రగతి దశలో ఉన్నాయని తెలిపారు. అలాగే సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఆఫీసుకు, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ కు కొత్త భవనాలు నిర్మిస్తామని చెప్పారు. తాను పుట్టింది శివ పల్లి గ్రామంలో అయినప్పటికీ పెరిగింది మాత్రం సుల్తానాబాద్ లో అన్నారు. అందుకే పట్టణ పై తనకు మమకారం ఉందన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే గారు తెలిపారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లో ఇలాంటి అభివృద్ధి, సంక్షేమం జరగన్నప్పటికీ మౌనంగా ఉన్నారని, తమ హయాంలో కూడా ఇలా మౌనంగా ఉండకూడదు అన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా కార్యరూపంలోకి తీసుకు వస్తున్నానని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల నాటికి హామీలు తీర్చి ఓట్లు అడుగుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, స్థానిక కౌన్సిలర్ గాదాసు మంజుల తో పాటు పట్టణ కౌన్సిలర్లు, తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్ శాఖ ఎస్ ఈ, డిఈఈ, ఏఈ, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి



జగిత్యాల ఏప్రిల్ 21(మనం ప్రతినిధి): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిపై జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బీఎల్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో చేర్చడం, మరణించిన వారు మరియు డూప్లికేట్ ఎంట్రీలను తొలగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అలాగే, ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, యువ ఓటర్లను ప్రోత్సహించాలని సూచించారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చేలా కృషి చేయాలని జిల్లాలో 100శాతం ఓటరు నమోదు కావాలని సంబంధిత అధికారులను బి ఎల్ వో లను ఆదేశించారు.ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, బి ఎల్ వో లు, జి. పి వో లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# భూమిని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత




- కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్

పెద్దపల్లి, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి): జాతీయ ఎర్త్ డే సందర్భంగా పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక పోస్టర్ను ఆవిష్కరించినట్లు జిల్లా కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బండి ప్రకాష్ తెలిపారు. ఈ పోస్టర్ను నేషనల్ గ్రీన్ క్రాప్స్ (ఎం జి ఎస్), పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సంయుక్తంగా రూపొందించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు వంటి అంశాల్లో ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ పోస్టర్ను జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల వద్ద ప్రదర్శించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.ఎం. షేక్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రవీందర్, ఎస్టీ వెల్ఫేర్ అధికారి, జిల్లా పరీక్షల అధికారి హనుమంతు, జి.సి.డి.ఓ అధికారి కవిత, నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా కోఆర్డినేటర్ గూళ్ల అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భరోసానిచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్



మంథని, ఏప్రిల్ 21 (మనం న్యూస్): రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతులకు భరోసానిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. మంథనిప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్,గంగాపురి, శ్రీపాద కాలనీ, అంగుళూరు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ వైస్ చైర్మన్ ముస్కుల.సహేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.అలాగే సూరయ్యపల్లి, కాకర్లపల్లి,ఖానాపూర్, ఎక్లాస్ పూర్ కొనుగోలు కేంద్రాలను సర్పంచులు ఆర్ల.నాగరాజు,కనవేన కొమురయ్య,సంగెం అరుణ-గట్టయ్య, బొడ్డు రజిత-శ్రీనివాస్ లు ప్రారంభించారు. అనంతరం లక్కెపూర్, తోటగోపయ్యపల్లి, గువ్మునూర్, గాజులపల్లి,మైదుపల్లి కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ,వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు. నస్తూరుపల్లి లో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగిందని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు యెల్లంకి వంశీధర్, మాచిడి రాజుగౌడ్, మద్దికట్ల స్రవంతి - రమేష్ బాబు,పెంటరీ రాజు,జంబోజు శ్రీమతి -సమ్మయ్య,సింగిల్ విండో మాజీ డైరెక్టర్లు ఆకుల. రాజబాపు, లెక్కల కిషన్ రెడ్డి, నాయకులు పేరవేన లింగయ్య, మంథని సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, గుండా. పాపారావు, సేమంతుల ఓదెలు మెండె రాజయ్య,పెండ్లి ప్రభాకర్ రెడ్డి, ఆర్ల నారాయణ, మంథని శ్రీనివాస్,ఆకుల శ్రీనివాస్, కనవేన ఓదెలు, ప్రత్యూష, గోవిందుల రమేష్, భీముని వెంకట స్వామి, కెక్కర్ల మారుతి, రేపాక శ్రీనివాస్, గుంటుకు గణేష్, మహేష్, నారమల్ల శంకరయ్య, గుంజె సత్యనారాయణ, పర్షవేనమల్లయ్య, లింగమూర్తి, బిరుదు సమ్మయ్య, ఎగడ రాజు, జంజర్ల శ్రావణ్, బూడిద రంజిత్, భాద్రపు శ్రీనివాస్, అప్పాల పర్వతాలు, మంథని సదానందం, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, రైతులు, హమాలీ సంఘం నాయకులు, సంఘ సిబ్బంది,పలువురు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈత సరదా విషాదంగా మారకూడదు

- మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు
- చిన్న నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి దారితీయవచ్చు
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




జగిత్యాల, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి): వేసవి కాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో పిల్లలు, యువకులు ఈత నేర్చుకోవడానికి చెరువులు ,కాలువల వద్దకు ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున ఇట్టి క్రమంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణ నష్టం జరుగుతుండటం వలన అందరూ ఇట్టి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈత సరదా విషాదంగా మారకూడదు అని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ఈత రానివారు బావులు, చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని ఈతను నేర్చుకునే వారు వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువుల వద్దకు కాలువల వద్దకు కుంటలు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలుతీసుకోవాలని సూచించారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినట్లయితే పిల్లల ప్రాణానికి ప్రమాదమని ఇట్టి విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని పిల్లలను యొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. మైనర్ లకు వాహనాలు ఇవ్వకండి జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక శ్రద్ధ ఉంచడం జరిగినదని తల్లిదండ్రుల, మైనర్లకు వాహనం ఇవ్వకూడదని, వాహనం ఇచ్చినచో వారు తెలిసి తెలియని డ్రైవింగ్ తో వాహనం నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, దానితో వారికి మరియు ఎదుటి వ్యక్తులకు ప్రమాదం జరగటం వల్ల రెండు కుటుంబాలు నష్ట పోతున్నాయని కావున మైనర్ లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ మైనర్ కు వాహనం ఇచ్చి ఏదైనా ప్రమాదం జరిగిన లేదా మైనర్ డ్రైవింగ్ చేస్తూ వాహనం తో పట్టుబడిన వాహన యజమాని పై కేసు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.

# నేతకాని జాతి ఉనికిని కాపాడాలి



- గెజిట్‌లో తప్పుడు గణాంకాలపై జిల్లా అధ్యక్షులు గొల్లె రాజకుమార్ ఆగ్రహం

పెద్దపల్లి,ఏప్రిల్ 21 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో సుమారు 15 లక్షల జనాభా కలిగిన నేతకాని కులస్థులకు ప్రభుత్వ గెజిట్ గణాంకాల వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని నేతకాని సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లె రాజకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తమ సామాజిక వర్గం 15 లక్షల మంది ఉన్నప్పటికీ,ప్రభుత్వ రికార్డుల్లో కేవలం ఒక లక్షా 30 వేల మందిగా చూపడం దారుణమన్నారు.గత ప్రభుత్వాల కాలంలో ఎస్సీ జాబితాలో కాలమ్ నంబర్ 22లో తమ జనాభా వివరాలు స్పష్టంగా ఉండేవని,కానీ ప్రస్తుతం గెజిట్లో తమ జాతి ఉనికినే కనుమరుగు చేసేలా గణాంకాలను పొందుపరిచారని ఆయన మండిపడ్డారు.తక్షణమే నేతకాని సామాజిక వర్గంపై సమగ్ర సర్వే నిర్వహించి,వాస్తవ జనాభా ప్రాతిపదికన గుర్తింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.జనాభా సంఖ్యను తక్కువగా చూపడం వల్ల తమ జాతి బిడ్డలు విద్యా,ఉద్యోగ మరియు రాజకీయ అవకాశాల్లో తీవ్రంగా వెనుకబడిపోతున్నారని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని, నేతకాని జాతిని గెజిట్లో సముచితంగా చేర్చి న్యాయం చేయాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించని యెడల,రాష్ట్రవ్యాప్తంగా నిరాహార దీక్షలు మరియు భారీ ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు మంచినీళ్ల బాబునాథ్, దుర్గం జగన్, గోదావరి శ్రీనివాస్, మాదాసు సుధాకర్, దుర్గం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రం తల్లితో సమానం



- బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ

జగిత్యాల, ఏప్రిల్ 21(మనం న్యూస్): అంగన్వాడి కేంద్రం తల్లితో సమానమని బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ అన్నారు జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రం 1 వ సెంటర్లో లో పోషణ్ పక్వాడ్ లో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన పిల్లలకు అంగన్వాడి కేంద్రంలో అందించే బాలామృతం గుడ్లు, పిల్లలకు తప్పకుండా తినిపించాలని అలాగే తల్లిపాలను కొనసాగించాలని గర్భిణీ బాలింతలు పిల్లలు ఆకుకూరలు పండ్లు పాలు గుడ్లు, కూరగాయలు ప్రోటీన్స్ విటమిన్స్ ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు అంగన్వాడి టీచర్ ఆదిముల్ల మంజుల ఆయా లత తల్లులు పిల్లలు గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ సమీక్ష



జగిత్యాల ఏప్రిల్ 21(మనం న్యూస్): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనుల నాణ్యత, వేగం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కథలాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో, పంచాయతీ కార్యదర్శులు మరియు ఫీల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ గృహ నిర్మాణం, పన్నుల వసూళ్లు, తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్ పనులు, ఎన్ఆర్ఈజీఎస్ పనులు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ మాట్లాడుతూ ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను నిర్దేశిత కాలపట్టికలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సాంకేతిక మరియు పరిపాలనా సహకారం అందించాలని సూచించారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేసి గ్రామపంచాయతీల ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ పనులు, ఎన్ఆర్ఈజీఎస్ పనులు సమన్వయంతో నిర్వహించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలను అధికారులు ఫీల్ స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శంకర్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్ అసిస్టెంట్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కర్తవ్యానికి ప్రాణం.. సేవే ఆయన మార్గం

- 3నిబద్ధత చాటుకున్న ట్రాఫిక్ పోలీస్ అనిల్

సుల్తానాబాద్, ఏప్రిల్ 21 (మనం న్యూస్): చాలామంది పోలీసు అంటే కేవలం ఫైన్లు వేయడానికో, ట్రాఫిక్ నియంత్రించడానికో పరిమితం అనుకుంటారు. కానీ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిరికొండ అనిల్ మాత్రం తానేంటో నిరూపించారు. కేవలం ట్రాఫిక్ నిబంధనలు చెప్పడమే కాదు, ప్రమాదాలు జరగకుండా రోడ్డు పక్కన ఉన్న అడ్డంకులను తొలగించి 'నిజమైన రక్షకుడు' అనిపించుకున్నారు.

### సమస్యేంటి..?

సుల్తానాబాద్లోని అంబేద్కర్ విగ్రహం ముందున్న తీన్ చౌరస్తా అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం. అక్కడ హైవే రోడ్డును ఆనుకొని ఉన్న ఒక విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పిల్లర్ అత్యంత ప్రమాదకరంగా ఉండేది. ఆ పిల్లర్ కారణంగా గత కొద్దిరోజులుగా వాహనదారులు ఇబ్బంది పడటమే కాకుండా, వరుసగా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

### సొంత ఖర్చుతో సామాజిక బాధ్యత

ప్రభుత్వ నిధుల కోసమో లేదా అధికారుల ఆదేశాల కోసమో వేచి చూడకుండా, అనిల్ గొప్ప మనసు చాటుకున్నారు. తన సొంత ఖర్చులతో డ్రిల్లింగ్ మిషన్, జెసిబిని ఏర్పాటు చేశారు. స్వయంగా దగ్గరుండి రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలను, ప్రమాదకరమైన పిల్లర్ శిథిలాలను తొలగింపజేశారు. ఆ ప్రాంతాన్ని (చదును) క్లీన్ చేయించి, వాహనాల రాకపోకలకు అనువుగా రోడ్డును విశాలంగా మార్చారు. 'డ్యూటీ అంటే కేవలం రోడ్డు మీద నిలబడటం కాదు, జనం క్షేమంగా ఇంటికి చేరుకునేలా చూడటం కూడా' అని అనిల్ మరోసారి నిరూపించారు.

### ప్రజల ప్రశంసలు

కేవలం చలాన్లు రాయడమే కాకుండా, ప్రమాదాల నివారణకు ఒక సామాన్య పోలీస్ కానిస్టేబుల్ ఇంతటి చొరవ చూపడం పట్ల



స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'ప్రమాదాలకు చెక్ పెట్టిన అనిల్ లాంటి వారు పోలీస్ శాఖకు గర్వకారణం' అంటూ నెటిజన్లు, వాహనదారులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

బాధ్యతగల అధికారిగా, మంచి మనసున్న మనిషిగా అనిల్ చేసిన ఈ పని అందరికీ ఆదర్శప్రాయం. హ్యాట్సాఫ్ టు అనిల్.

# ఏప్రిల్ 25న జాబ్ మేళా నిర్వహణ

- జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు

పెద్దపల్లి, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి): జిల్లా లోని నిరుద్యోగ యువకులకు మెడ్ ప్లస్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు ఏప్రిల్ 25న శనివారం రోజున రూమ్ నెంబర్ 233 నూతన కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా ఉపాధి కార్యాలయం లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మెడ్ ప్లస్ కంపెనీలో 40 ఫార్మాసిస్టు , 50 ఆడిట్ అసిస్టెంట్, 20 1 సెక్యూరిటీ గార్డు పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఏప్రిల్ 25న ఉదయం 11 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో రూమ్ నెంబర్. 233 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నెంబర్ లో నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు ఆ ప్రకటనలో తెలిపారు.

# వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు
- చొప్పదండిలో వసతి గృహం ఆకస్మిక తనిఖీ
- కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా

చొప్పదండి ఏప్రిల్ 21(మనం న్యూస్): విద్యార్థుల భద్రతకు, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చొప్పదండిలోని ఎస్సీ సంక్షేమ శాఖ వసతి గృహాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, మరుగుదొడ్లు, డార్మెటరీ హాల్, భోజనశాల పరిశీలించారు. మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. సిబ్బంది హాస్టల్లోనే ఉండాలని.. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిపిఓ జగదీశ్వర్, తహసిల్దార్ నవీన్ కుమార్, వార్డెన్ కుమారస్వామి తదితరులు ఉన్నారు



# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కండి

- నాయకుల్లో వర్గ పోరు ఉండకూడదు
- సమన్వయంతో పని చేస్తే విజయం సాధిస్తాం
- మంత్రి దామోదర రాజనర్సింహ
- పార్టీలో కష్టపడ్డ వారికి టిక్కెట్లు
- ఇండిపెండెంట్ అభ్యర్థులకు తావు ఇవ్వద్దు
- టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి
- దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి
- జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్





సంగారెడ్డి ఏప్రిల్ 21 మనం ప్రతినిధిః రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసి ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు మంగళవారం నాడు సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్లో సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటిసి ఎన్నికలు కు పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు గెలిపించాలని పిలుపునిచ్చారు నాయకుల్లో వర్గ పోరు ఉంటే వాటికి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని అన్నారు శత్రువుని ఎప్పుడు తక్కువ అంచనా వేయకూడదని ప్రస్తుత రాజకీయాల్లో సిద్ధాంతాలు ఎక్కువ అవకాశాలు తక్కువగా ఉన్నాయని అన్నారు. జిల్లాలో ఇంకా నాయకుల మధ్య సమన్వయం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టిన ఆ సందేశాన్ని స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తల పైనే ఉంటుందని అన్నారు. కార్యకర్తలు కు సముచిత న్యాయం ఇవ్వాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుండి సందిత్వం కావాలని వాటి నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండటం సహజమే కానీ వర్గపూరు వల్ల పాటికి నష్టం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నుండి ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనిని పేర్కొన్నారు ఇప్పటివరకు కేవలం ఆరోగ్య శాఖలోని దాదాపు 20వేల ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు 1,20,000 కోట్ల రూపాయలను రైతుబంధు రూపంలో రైతులకు అందించామని అన్నారు. ఇందిరమ్మ పిల్ల కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన విజయవంతంగా అమలు అవుతుందని అన్నారు 40 ఆరు లక్షల మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టామని దేశంలో ఎక్కడ లేని విధంగా డిజిటల్ హెల్త్ కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్ ఆసుపత్రుల్లో మరో 50 పడకలు అదనంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సంగారెడ్డి మెడికల్ కళాశాలలో భవిష్యత్తులో పీజీ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సింగూర్ ప్రాజెక్ట్ ను పర్యాటక అభివృద్ధి చేస్తామని 200 కోట్లతో సింగూర్ ప్రాజెక్టును టూరిజం అభివృద్ధి చేస్తామని అన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకెళ్తుందని అన్నారు. మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు వ్యతిరేకం కాదని సపరేట్గా బిల్లు పెడితే కాంగ్రెస్ పూర్తి సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు డి లిమిటేషన్ ఉన్నా లేకున్నా మరోసారి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ

వచ్చే జెడ్పీటిసి ఎంపిటిసి ఎన్నికల్లో పార్టీలో కష్టపడ్డ వారికి టికెట్లు ఇస్తామని టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ప్రభుత్వ పథకాలను ఎలా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో ఎలా గెలిచాం మన బలబలాలు లోపాలపై చర్చించుకోవాలని అన్నారు. ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి అనే విషయంలో చర్చ జరగాలని అన్నారు మూడేళ్లకు పైగా మండల స్థాయిలో పనిచేసిన వారికి జిల్లా స్థాయిలో పదవులు ఇచ్చి వారి స్థానం మండల లో కొత్త వారిని నియమించాలని సూచించారు. ప్రభుత్వం ఉన్నది కాబట్టి అభ్యర్థుల ఎంపికలో పోటీ ఉందని మన మద్ది మనకి పోటీ వల్ల వాటికి నష్టం జరుగుతుందని అన్నారు మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో జరిగిన పలనామాలను ఎందుకు మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందో మహిళ బిల్లు విషయంలో బిజెపి కుట్రాలను సైతం పార్టీ పరంగా చర్చ జరగాలని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

### జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ

దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ అభివృద్ధి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని అన్నారు మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 70% మంది సర్పంచ్లు గెలుపొందారని పేర్కొన్నారు నాయకుల మధ్య సమన్వయం ఉండాలని అన్ని నియోజకవర్గాల్లో సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు రాష్ట్రంలో ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసే విప్లమాత్మక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టబోతుందని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని తెలిపారు.

### నీలం మధు మాట్లాడుతూ

ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్రంలో ని జరిగిన కులగణ ఆధారంగా వచ్చే ఎన్నికల్లో అన్ని కులాలను సమ ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి చైర్పర్సన్ సునీత పార్టీ, పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, చిన్న ముదిరాజ్ , శశికళ యాదవ్ రెడ్డి సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, సదాశివపేట మున్సిపల్ చైర్పర్సన్ అంజమ్మ సత్యనారాయణ, కోహిర్ జోగిపేట మున్సిపల్ చైర్ పర్సన్ లు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం



- గ్రామాలకు సీసీ కెమెరాలతో భద్రత
- సీపీ సాయిచైతన్య

నిజామాబాద్, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి)ః ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, గ్రామాలకు సీసీ కెమెరాలతో భద్రత ఉంటుందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు 'అరైవ్ అలైవ్ - 2026' కార్యక్రమంలో భాగంగా రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్ ప్రివెన్షన్, డ్రగ్స్ నియంత్రణ, సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లపై సర్పంచ్లకు, కౌన్సిలర్లకు బోధన్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ., ప్రపంచంలో ఒక్క యాక్సిడెంట్ జరుగకుండా ఉన్న దేశం ఫిన్లాండ్ అని అన్నారు. వ్యవసాయాదరులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టినప్పుడు భద్రత కోన్లు, లేదా బకెట్ పెట్టి స్టిక్కర్లు అంటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లు వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కోరారు. ప్రతిఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు వాహనాల మధ్య తగినంత దూరం ఉండేటట్లు చూసుకోవాలన్నారు.

యువత డ్రగ్స్కు బానిస కాకుండా ప్రతి ఒక్కరూ గమనిస్తూ ఉండాలని, ఆన్లైన్ బెట్టింగ్కు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక వేగం, క్రమశిక్షణ లోపం, అలసటతో వాహనం నడపడం వంటి అంశాలు ప్రమాదాలకు దారితీస్తాయని సీపీ వివరించారు. ఆరోగ్యంపై శ్రద్ధ, కట్టుదిట్టమైన ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. 2020 సంవత్సరంలో కరోనా ఫేస్-1 ఫేస్-2లో నిజామాబాద్ జిల్లాలో దాదాపు 200 మంది మృతి చెందారని, అదే 2025లో రోడ్డు ప్రమాదాల వల్ల దాదాపు 302 మంది మృతి చెందారని వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, బోధన్ మున్సిపల్ ఛైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఇలియాస్, బోధన్ టౌన్ ఎస్హెచ్వో వెంకటనారాయణ, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూర్ సీఐ శ్రీకృష్ణ, బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, ఎన్ఎస్సీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాంబశివరావు, ఎన్ఎస్ఈ మెంబర్స్ దుష్యంత్, కొడాలి కిషోర్, బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్, బోధన్ టౌన్ ఎస్ఐ మనోజ్, రెంజల్ ఎస్ఐ చంద్ర మోహన్, కోటగిరి ఎస్ఐ సునీల్, సర్పంచులు కౌన్సిలర్లు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.


# అక్రిడేషన్ల జారీకి మొదలైన ప్రక్రియ



- కలెక్టర్తో అక్రిడేషన్ కమిటీ సమావేశం
- దరఖాస్తులను పరిశీలించిన అధికారులు

సిద్దిపేట, ఏప్రిల్ 21(మనం ప్రతినిధి)ః సిద్దిపేట జిల్లా లో నూతనంగా ఎంపికైన అక్రిడేషన్ కమిటీతో జిల్లా యంత్రాంగం మంగళవారం సమావేశం నిర్వహించింది. జిల్లా కలెక్టర్ కే హైమావతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2026-28 సమయానికి మీడియా కార్డుల జారీపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా జర్నలిస్టులకు మీడియా అక్రిడేషన్ జారి కోసం ఆన్లైన్ లో చేసుకున్న దరఖాస్తులను, మీడియా సంస్థలు అందజేసిన జాబితాలను పరిశీలించారు. అక్రిడిషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలుస్తుండగా ఈ సమావేశంలో డిపిఆర్ఓ రవికుమార్, సమాచార శాఖ డి ఈ భూపాల్, కమిటీ సభ్యులు రంగాచారి, మైపాల్ రెడ్డి, రాజు, అరుణ్ కుమార్, వంశీధర్, రాజిరెడ్డి, గిరిబాబు, సమాచార శాఖ సీనియర్ అసిస్టెంట్ రాంబాబు, రాములు, మహేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



కామారెడ్డి, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః కామారెడ్డి నియోజకవర్గం పలు మండలలలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో తోడ్పడుతున్నాయని తెలిపారు.

కల్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక ఇబ్బందులు తగ్గి పేద కుటుంబాల కుమార్తెల వివాహాలు సులభంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. రామారెడ్డి మండలంలో రామారెడ్డి మండలంలోని పలు గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. పాల్వంచ, దోమకొండ, భిక్కనూరు, రాజాంపేట మండల కేంద్రంలలోని రైతు వేదికలో ఆయా గ్రామాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### కామారెడ్డి జిల్లా కేంద్రంలో...

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన కల్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను స్థానిక ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## గోమాతకు సేవ చేయడం ఒక పవిత్ర కార్యక్రమం

గజ్వేల్ ఏప్రిల్ 21 మనం న్యూస్ః వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గో సేవా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రజ్ఞాపూర్ లోని గోశాలకు వెళ్లి అక్కడ గోవులకు సేవ చేయడంతో పాటు గోవులకు ఆహారాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా వాసవి క్లబ్ నాయకులు జగ్గయ్య గారి శేఖర్, గంగిశెట్టి వెంకటేశములు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గోవును కేవలం జంతువుగా కాకుండా 'గోమాత'గా, తల్లితో సమానంగా పూజిస్తారని, వేదాల కాలం నుండి నేటి వరకు గోవుకు మన జీవితంలో విశిష్టమైన స్థానం ఉందని,అందుకే 'గోసేవ'ను ఒక పవిత్ర కార్యంగా భావిస్తారు అని అన్నారు. గోవు పాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, పేడ - వీటినే పంచగవ్యాలు అంటారని,ఇవి ఆరోగ్యానికి, వ్యవసాయానికి ఎంతో మేలు చేస్తాయిని, గోపేడ ఎరువుగా, గోమూత్రం క్రిమిసంహారిగా పనిచేస్తుందని రసాయన ఎరువులు లేకుండా సేంద్రియ వ్యవసాయం చేయడానికి గోమాత ఆధారం. హిందూ ధర్మంలో 33 కోట్ల దేవతలు గోవులో కొలువై ఉంటారని నమ్మకం అని అన్నారు . శ్రీకృష్ణుడు భగవానుడు గోపాలుడిగా పెరిగాడని,ఇంటి ముందు గోపూజ చేస్తే లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుందని పెద్దలు చెబుతారు అన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. అలాగే గోవులు మేత మేసి భూమిని సారవంతం చేస్తాయి. గోఆధారిత వ్యవసాయం నేలను, నీటిని కాపాడుతుందఅన్నారు. గోసేవ అంటే కేవలం పూజించడం కాదు. గోవులను ప్రేమగా చూసుకోవడం, వాటి ఆకలి తీర్చడం, రోగం వస్తే వైద్యం చేయించడం, వృద్ధ గోవులను వదిలేయకుండా గోశాలల్లో కాపాడడం అందరి బాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో గంగిశెట్టి ఉమేష్, సిరిపురం సత్యనారాయణ, తడుపునూరి కాశీనాథ్ ,గంగా రమేష్, కైలాస ప్రశాంత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 35,300 మెట్రిక్ టన్నుల ప్యాడీ కొనుగోలు

- రాష్ట్ర సివిల్ సప్లైస్ ప్రధాన కార్యదర్శి అండ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



కామారెడ్డి, ఏప్రిల్ 21 (మనం జిల్లా ప్రతినిధి)ః తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ ప్రధాన కార్యదర్శి అండ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మంగళవారం కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని ప్యాడీ ప్రొక్యూర్మెంట్ సెంటర్ (పిఎసిఎస్) మరియు గోకుల్ తాండా పీపీసీ (ఐకెపి)లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన, కొనుగోలు కేంద్రాల పనితీరును సమీక్షించారు. ప్యాడీ కొనుగోలులో భాగంగా పని చేస్తున్న అన్ని శాఖల అధికారులతో సమావేశమై, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు త్వరగా జరగాలంటే ఓపిఎంఎస్ టాబ్లెట్లలో నమోదులను సమయానికి పూర్తి చేయాలని సూచించారు.

జిల్లాలో ఇప్పటివరకు 35,300 మెట్రిక్ టన్నుల ప్యాడీ కొనుగోలు జరిగినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి, డీఎం (సివిల్ సప్లైస్), డిఆర్డిఓ, డి సి ఓ, డిఎల్ఎమ్ఓ, ఏడి (మార్కెటింగ్) తదితర అధికారులు పాల్గొన్నారు.

# భిక్కనూర్లో తీరిన 'లో-వోల్టేజ్' కష్టాలు

- రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ అధికారులు



భిక్కనూర్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్)ః స్థానిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు వేగంగా స్పందిస్తున్నారు. ఇటీవల భిక్కనూర్లో నిర్వహించిన స్పెషల్ గ్రామసభల్లో వెల్లడైన సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. గ్రామసభలో సమస్య ప్రస్తావన ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ కారణంగా ఆ ప్రాంతంలో గత కొంతకాలంగా లో-వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని బిజెపి మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ట్రాన్స్ఫార్మర్కు ఏబి స్విచ్ లేకపోవడం వల్ల అత్యవసర సమయాల్లో విద్యుత్ నిలిపివేతకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఏఈ సంకీర్త్ వివరించారు.

### క్షేత్రస్థాయిలో చర్యలు....

ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ సంకీర్త్ మంగళవారం సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ లోడ్ బ్యాలెన్సింగ్ను సరిచేసి, లో-వోల్టేజ్ సమస్యను నివారించారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ..

ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరలోనే కొత్తగా ఏబి స్విచ్ను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తమ సమస్యపై సానుకూలంగా స్పందించి పరిష్కరించినందుకు పట్టణ ప్రజలు మరియు ఉప్పరి రమేష్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సంకీర్తతో పాటు లైన్మెన్ మాణిక్యం, వేణు మరియు ఉప్పరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ సంరక్షణే లక్ష్యం




- జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

సంగారెడ్డి, ఏప్రిల్ 21(మనంప్రతినిధి)ః అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని పురస్కరించుకుని, 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నేషనల్ గ్రీన్ కారప్స్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను మంగళవారం కలెక్ట్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ పాండుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భూమిని కాపాడుకుందాం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం, పచ్చదనం పెంచుదాం వంటి నినాదాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలమని తెలిపారు.అలాగే, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్ల పెంపకం చేపట్టడం, నీటి వనరులను సంరక్షించడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, యువత పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే భూమి సంరక్షణ సాధ్యమవుతుందని, పర్యావరణ హిత చర్యలను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ఎన్జిసి జిల్లా సమన్వయ కర్త మాధవ రెడ్డి, ఎస్ జి ఎఫ్. సెక్రటరీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రణాళిక ప్రకారం పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి



- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 21(రాజన్న సిరిసిల్ల)ః పోటీ పరీక్షలకు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు యువత, అభ్యర్థులు సిద్ధమవుతుండగా, మంగళవారం జిల్లా కలెక్టర్ వారితో మాట్లాడారు. విద్యార్థులు, ఏ ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్నారు? ఏ ఏ పుస్తకాలు చదువుతున్నారు? ఆరా తీశారు. రోజా ఎంత మంది లైబ్రరీకి వస్తారని గ్రంథాలయ అధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అన్ని సబ్జెక్టులు ప్రణాళిక ప్రకారం.. ప్రతి అంశం క్షుణ్ణంగా చదవాలని సూచించారు. కరెంట్ అఫైర్స్, ఇతర అన్ని అంశాలపై మంచి అవగాహనతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఎన్సీఈఆర్టీ పుస్తకాలు కూడా రిఫరెన్స్ గా తీసుకోవాలని సూచించారు.

# ప్రతి విద్యార్థి స్వతంత్రంగా చదవగలిగే స్థాయికి చేరుకోవడమే లక్ష్యం...

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంతో పఠన సామర్థ్యంలో గణనీయమైన పురోగతి**

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టితో ప్రత్యేక పాఠ్యసామగ్రి**

**ఎవ్రీ చైల్డ్ రీడ్స్ విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**




**ఖమ్మం, ఏప్రిల్ 21(మనం బ్యూరో):** ప్రతి విద్యార్థి స్వతంత్రంగా చదవగలిగే స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం ఎస్ ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ విజయోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ₹జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గత ఆరు నెలలుగా జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన ఎవ్రీ చైల్ రీడ్స్ కార్యక్రమం వల్ల విద్యార్థుల పఠన సామర్థ్యం గణనీయంగా పెరిగినట్లు స్వతంత్ర సంస్థ నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైందని తెలిపారు. ఈ పురోగతిపై వారు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే పఠన సామర్థ్యం అత్యంత కీలకమని భావించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పిల్లలతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ నిర్వహించామని, వారానికి ఒకసారి అంచనాలు నిర్వహిస్తూ, ఫలితాల ఆధారంగా వ్యూహాలను మారుస్తూ ముందుకు తీసుకెళ్లామని అన్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి ప్రత్యేక పాఠ్య సామగ్రిని రూపొందించా మని, ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి వారికి వేర్వేరు విధానాలు అమలు చేశామని తెలిపారు.ఏఐ సాంకేతికతతో ప్రత్యేక యాప్ను అభివృద్ధి చేసి, ఉపాధ్యాయులపై అంచనాల భారం లేకుండా సులభంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేయగలిగే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఆనంద దాయకంగా రూపొందించడంతో పిల్లలు ఆసక్తిగా పాల్గొన్నారని పేర్కొన్నారు. డిసెంబర్ నెల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులకు, వెనుకబడిన విద్యార్థులకు వేర్వేరు పాఠ్య సామగ్రిని అందించామని, రోజూ పాఠశాల సమయాల్లోనే సాయంత్రం 3 నుండి 4 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి రోజు ఉపాధ్యాయుల,విద్యార్థుల కార్యకలాపాలు, కథల పఠనం వంటి అంశాలతో సమగ్ర ప్రణాళికను అమలు చేశామని వివరించారు. అక్షరాలు, పదాలు, వాక్యాలు అనే మూడు స్థాయిలలో విద్యార్థుల పఠన సామర్థ్యాల అంచనా నిర్వహించామని తెలిపారు. అక్టోబర్లో కార్యక్రమం ప్రారంభించినప్పుడు సుమారు 55 శాతం విద్యార్థులు అక్షర స్థాయిలో, 34 శాతం పదాల స్థాయిలో, 11 శాతం వాక్య స్థాయిలో ఉన్నారని చెప్పారు. 21 వారాల కృషి ఫలితంగా ప్రస్తుతం 29 వేల మంది విద్యార్థుల్లో 85 శాతం మంది వాక్యాలు చదవ గలుగుతున్నారని, మొత్తం 21,309 మంది విద్యార్థులు వాక్య పఠనంలో నైపుణ్యం సాధించారని తెలిపారు. పిల్లలు సహజంగానే ఆసక్తి కలిగినవారని, వారికి పఠనంపై నమ్మకం పెరిగితే వారు మరింత జ్ఞానం స్వయంగా సంపాదించ గలరని అన్నారు. జిల్లాలోని పలు శాఖల అధికారులు కూడా పాఠశాలలను సందర్శించి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, వెనుకబడిన మండలాలు, క్లస్టర్లలో మెరుగుదలకు సహకరించారని తెలిపారు. ఎన్నికలు, దసరా సెలవులు వంటి అనేక అంతరాయాలు వచ్చినప్పటికీ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించా మని, అందువల్లే మంచి ఫలితాలు సాధించగలిగామని అన్నారు. ప్రతి బుధవారం అంచనా ఫలితాలను విశ్లేషిస్తూ, నిరంతర కృషితో 11 శాతం నుంచి 85 శాతం వరకు సాధించిన ఈ ప్రయాణం ఒక్క రోజులో సాధ్యంకాలేదని, ప్రతి వారం మెరుగుదల సాధించామని తెలిపారు. ఈ విజయానికి ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ గర్వించాల్సిన అవసరం ఉందన్నారు. తాను యూపిఎస్సి సన్నద్ధతలో ఉన్న సమయంలో అజర్ నివేదికల్లో 5వ తరగతి విద్యార్థుల్లో 55 శాతంమంది 2వ తరగతి పుస్తకాలు కూడా చదవలేరని పేర్కొనబడిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఖమ్మం జిల్లాలో ఇప్పుడు ఆ పరిస్థితి మారిందని అన్నారు. ఫిబ్రవరి 2026లో ఎస్ సి ఈ ఆర్ టి బృందం విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని అంచనా వేసిందని తెలిపారు. ఇదే సమయంలో ఎవ్రీ చైల్ రీడ్స్ డేటా కూడా ఇదే స్థాయిలో ఉందని, డేటాలో ఎలాంటి వ్యత్యాసం లేకపోవడం ఈ కార్యక్రమం సమర్థతను నిరూపిస్తుందని తెలిపారు. మంచి పఠన నైపుణ్యాలు ఉండటం వల్ల విద్యార్థులు ఇతర విషయాలను సులభంగా అర్థం చేసుకుని విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందించు కుంటారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో పద పఠనం సగటు 29 శాతం కాగా, ఖమ్మం జిల్లాలో 53 శాతం ఉందని, వాక్య పఠనం రాష్ట్రంలో 32 శాతం కాగా, ఖమ్మంలో 52 శాతం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం గణితం వంటి ఇతర విషయాలలో కూడా విద్యార్థుల ప్రతిభను పెంపొందించడంలో సహాయపడుతోందని అన్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఒక గొప్ప నైపుణ్యాన్ని అందించామని, రాబోయే విద్యా సంవత్సరంలో 100 శాతం విద్యార్థులు వాక్యాలు చదవగలిగే లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. తదుపరి దశలో విద్యార్థుల పఠన వేగాన్ని పెంపొందించడం, అర్థ గ్రహణ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. నిమిషానికి 30, 40, 50 పదాలు చదవగలిగే లక్ష్యాలను నిర్దేశించి పని చేయాలని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసి ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ మంగళవారం సివిల్ సర్వీసెస్ డే కావడం, ఇదే రోజు ఎవ్రీ చైల్ రీడ్స్ కార్యక్రమం విజయోత్సవాన్ని జరుపుకోవడం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, జిల్లా యంత్రాంగం అందరూ ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. గత ఆరు నెలల్లో 75 శాతం మేర పఠన సామర్థ్యంలో వృద్ధి సాధించడం విశేషమని పేర్కొన్నారు. ఎవ్రీ చైల్ రీడ్స్ కార్యక్రమం విద్యార్థుల పాఠన నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేసి ప్రతి విద్యార్థికి ఉపయోగపడేలా చేయాలని సూచించారు. అనంతరం ఈసిఆర్ అమలులో ఉత్తమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు మెమొంటోలు అందజేసి, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా విద్యా శాఖ అధికారి చైతన్య జైనీ, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి):** జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, సమయపాలనతో అమలు చేస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏ ఈ ఆర్ వో లు,బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), సూపర్వైజర్లు, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు సుమారు 70 శాతం ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 30 శాతం పనులను అత్యంత ప్రాధాన్యంతో వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా, పోలింగ్ బూతుల వారీగా మ్యాపింగ్ పురోగతిని సమగ్రంగా విశ్లేషిస్తూ, ప్రతి ప్రాంతంలో పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మణుగూరు మండలంలో కేవలం 37 శాతం మాత్రమే మ్యాపింగ్ పూర్తవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ఆలస్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రాంతంలో ఉద్యోగస్తులు బదిలీ అవ్వడం లేదా వేరొక చోటకి వెళ్లి స్థిరపడటం వంటి కారణాలతో మ్యాపింగ్ ప్రక్రియ ఆలస్యమైందని త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రతి బీఎల్ఓకు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి, వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సక్రమంగా పర్యటిస్తూ, ప్రతి గృహానికి చేరుకుని ఖచ్చితమైన వివరాలను సేకరించి మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ శాతం తక్కువగా ఉన్న మండలాలు, పోలింగ్ బూతుల వారీగా ప్రత్యేక దృష్టి సారించి, పనిలో జాప్యానికి గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. అవసరమైన సిబ్బంది, సాంకేతిక లేదా ఇతర సహకారం అవసరమైతే ఆలస్యం చేయకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం తప్పనిసరిగా పాటించాలని, ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి స్థాయిలో డేటా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న సాధా బైనామా దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా వేగవంతమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసి, ప్రజలకు త్వరితగతిన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ఉత్తమ ప్రశంసా పత్రం అందుకున్న దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి

**దమ్మపేట, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** నేషనల్ లోక్ అదాలత్ లో భాగంగా ఎక్కువ కేసులు మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపి కేసుల పరిష్కారంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నందుకు గానూ ఎస్పీ రోహిత్ రాజ్ చేతులు మీదుగా ప్రశంస పత్రం అందుకున్న దమ్మపేట సబ్ ఇన్స్పెక్టర్ సాయి కిషోర్ రెడ్డి,ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐకు పలువురు ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.



## విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ విజయవంతం

- **జిల్లా వ్యాప్తంగా 166 హాస్టళ్లు, కేజీబీవీలు, గురుకులాలు ఆదర్శ పాఠశాలల్లో నిర్వహణ**
- **వ్యాసరచన నుంచి క్రీడల వరకు విభిన్న కార్యక్రమాలు**
- **విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యం**



**ఖమ్మం, ఏప్రిల్ 21(మనం బ్యూరో):** కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సంక్షేమ వారం కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలోని 166 హాస్టళ్లు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, గురుకులాలు, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి విభిన్న పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, ప్రసంగం, క్విజ్, డ్రామా, డ్యాన్స్, సింగింగ్, క్యారమ్ వంటి కార్యక్రమాలతో పాటు కొన్ని విద్యా సంస్థల్లో రన్నింగ్ వంటి క్రీడా పోటీలు కూడా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల నిర్వహణను జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, సంక్షేమ శాఖ సిబ్బంది పర్యవేక్షించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడుతున్నాయని ధికారులు తెలిపారు.వెల్ఫేర్ వీక్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫిజిక్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



**ఖమ్మం, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** ఎస్ ఆర్.బి.జి.ఎన్.ఆర్ కళాశాల లో ఫిజిక్స్ విభాగం లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న బోయ రాజశేఖర్ కు,వరంగల్ ఎస్.ఆర్ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం నుండి డాక్టరేట్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా మంగళవారం నాడు అభినందనపూర్వక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఏ.ఎల్.ఎన్.శాస్త్రి, డా.సీహెచ్ శ్రీ నివాస్, ఎగ్జామ్స్ కంట్రోలర్ డా.రమాసత్యవతి, ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, ఫిజిక్స్ విభాగాధిపతి డా.అనిత అధ్యాపకులు, డా.బి.శ్రీనివాస్, ఎస్.రాంబాబు, డా.కె.కిరణ్ కుమార్, దర్మయ్య, అనురాధ వివిధ విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- **కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **'నేతన్న భరోసా' పథకం ద్వారా ఆర్థిక భద్రత**
- **151 మంది చేనేత కార్మికులకు మొత్తం రూ.4,56,000 నేతన్న భరోసా చెక్కుల పంపిణీ**



**ఖమ్మం, ఏప్రిల్ 21(మనం న్యూస్):** చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్లో మంగళవారం 151 మంది అర్హులైన చేనేత కార్మికులకు మొత్తం రూ.4,56,000 విలువైన 'నేతన్న భరోసా' చెక్కులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేనేత కార్మికులకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. 'నేతన్న భరోసా' పథకం ద్వారా కార్మికులకు భరోసా కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని చెప్పారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నేతన్నలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేయాలని సూచించారు. హన్మకొండ చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం.విజయలక్ష్మి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా ఈ చెక్కుల పంపిణీ నిర్వహించినట్లు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. 151 మంది చేనేత కార్మికులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అధికారులు, జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 21 (మనంప్రతినిధి):** జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఏటీఎంలు మరియు సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సుమారు 83,635 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 56 కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరిందని, ముఖ్యంగా ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి ప్రాంతాల్లో అధికంగా ధాన్యం వచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం గ్రేడింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు .రైస్ మిల్లర్ల నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పించడంతో పాటు టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని, కూలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు తమ కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలని పిలుపునిచ్చారు.
ధాన్యాన్ని తాలు, తడి లేకుండా శుభ్రంగా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఆన్లైన్ నమోదు ప్రక్రియ, మిల్లుల కేటాయింపులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# కష్టపడి పనిచేస్తే ఏ లక్ష్యమైనా సాధ్యం

- **కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **పోటీ పరీక్షలపై దృష్టి సారించాలి**
- **విజయం తర్వాత ఆగకుండా ఇంకా ఉన్నత లక్ష్యాలు సాధించాలి**
- **విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి**
- **ఇంటర్లో మంచి ఫలితాలు సాధించిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు సన్మానం**



**ఖమ్మం, ఏప్రిల్ 21(మనం న్యూస్):** ఇంటర్ పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థు లను అభినందిస్తూ, వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, కష్టపడి పని చేస్తే ఎంతటి విజయమైనా సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తన చిన్నతనంలో తనకు ప్రత్యేకమైన కలలు లేదా ఆత్మవిశ్వాసం లేవని, అయితే ఇంటర్ ఫలితాలు తనలో నమ్మకాన్ని పెంచాయని తెలిపారు. కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించగలమనే విశ్వాసం అప్పుడు కలిగిందని చెప్పారు. ప్రస్తుతం మంచి మార్కులు సాధించిన ప్రతి విద్యార్థిలో ప్రతిభ, మేధస్సు ఉన్నాయని, వాటిని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.విద్యార్థులు ఇప్పటితోనే ఆగకుండా ఇంకా ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, మంచి కళాశాలలో సీటు పొందేందుకు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని తెలిపారు. మంచి విద్యా సంస్థల్లో చదవడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు, జీవన శైలీలు తెలుసుకునే అవకాశం ఉంటుందని, ఎప్పుడూ తక్కువగా భావించకూడదని సూచించారు. కష్టపడి పనిచేస్తూ, మనపై మనం నమ్మకం ఉంచితే ఏ లక్ష్యమైనా సాధ్యమని పేర్కొన్నారు. విజయం సాధించిన వారిలో మేధస్సు, మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కష్టపడే స్వభావమనే మూడు ముఖ్య లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఒకసారి విజయం సాధించిన తరువాత అక్కడే ఆగిపోకుండా ఇంకా ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ మంచి పరిజ్ఞానాన్ని సాధించే దిశగా కృషి చేస్తే విజయం సహజంగా వస్తుందని, వైఫల్యాలు మనల్ని ఆపకూడదని చెప్పారు. జీవితం అనేది సవాళ్లతో నిండినదని, వాటిని ఎలా అధిగమిస్తామన్నదే ముఖ్యమని పేర్కొన్నారు. కష్టాల ద్వారా వచ్చిన ఫలితాలు మరింత విలువైనవని తెలిపారు. జీవితంలో అవకాశాలు ఎప్పుడూ ఉంటాయని, ఒక అవకాశం కోల్పోయినా మరో అవకాశం వస్తుందని, విద్యార్థులు తమ లక్ష్యాల సాధనలో పట్టుదలగా ఉండాలని సూచించారు. అడ్డంకులు, వైఫల్యాలను పాఠాలుగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల విద్యను నేర్చుకోవడం సులభమైందని, సోషల్ మీడియా, రీల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఇంటర్నెట్ను సానుకూలంగా వినియోగిస్తూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, ప్రపంచంలో జరుగుతున్న మార్పులను నిరంతరం తెలుసుకుంటూ ఉండాలని చెప్పారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, ప్రతి నెల ఒక కొత్త పుస్తకం చదివే లక్ష్యాన్ని పెట్టుకోవాలని సూచించారు. చదివిన విషయాలను రాసుకునే అలవాటు పెంచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ విద్యార్థులను తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచాలని ప్రోత్సహించారు. ప్రతి విద్యార్థిని వారి లక్ష్యాల గురించి అడిగి తెలుసుకుని, వాటి సాధనకు అవసరమైన మార్గదర్శకత్వం అందించారు. కొంతమంది విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను చూసి కృషి చేసి మంచి ఫలితాలు సాధించామని చెప్పడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఇకపై విద్యార్థులు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని, ఆ పరీక్షలలో మూడు గంటల సమయం ఎంతో కీలకమని, ముందుగానే సమగ్రంగా సిద్ధం కావాలని సూచించారు. మనకంటే ఎక్కువ కష్టాలు ఎదుర్కొనే వారు ఎంతో మంది ఉన్నారని గుర్తుంచుకుని ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కాలేజీల్లో నిర్వహించిన ప్రత్యేక తరగతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంలో ఎంతో సహాయ పడ్డాయని తెలిపారు. ఆ తరగతుల వల్లే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించ గలిగామని పేర్కొన్నారు. అలాగే, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు సహకరించిన జిల్లా యంత్రాంగం, లెక్చరర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రభుత్వ విద్యార్థినీ, విద్యార్థులను ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కే.రవిబాబు, కెజిబివి, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ఆర్జేసీ, స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్, అంబేద్కర్ కళాశాల, మోడల్ కాలేజీ ఎస్ఓలు, సంబంధిత అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మనం Manam Mahabubnagar మహబూబ్ నగర్

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

- కొనుగోలు కేంద్రాల్లో టోల్ ఫ్రీ నంబర్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -21(మనం ప్రతినిధి ):** రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్లు, ఏపీఎంలు, పీఏసీఎస్ సెక్రటరీలు, జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అధికారులు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు వేయించాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల వద్ద రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఫన్నరకం కొనుగోలు కేంద్రాలకు దొడ్డు రకం ధాన్యం రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు

### టోల్ ఫ్రీ నంబర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలి

జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు కేంద్రం వద్ద టోల్ ఫ్రీ నెం.1800 4250 0333/ 1967 జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 6303928692 బ్యానర్ బోర్డులో తప్పనిసరిగా ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి

- నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 21 (మనం బ్యూరో):** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండల పరిధిలో సంబంధించిన దేవదారికుంట తండా వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా సమీక్షించిన జిల్లా కలెక్టర్, అక్కడికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ రైతులను కోరారు.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పందించిన జిల్లా కలెక్టర్ కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ముఖ్యంగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.2400 రైతులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తేమ శాతం 14 శాతం లోపు ఉండే విధంగా పంటను సిద్ధం చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. తేమ శాతం అధికంగా ఉంటే ధర తగ్గే అవకాశాలు ఉన్నందున, ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మొక్కజొన్న నాణ్యతపై కూడా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాగే కేంద్రంలో తూకం, నిల్వ, రవాణా వంటి ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ సైదులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈఓ కొమ్ము ఎల్లయ్య, ఆర్ఐ బలరాం, శివ, పీఏసీఎస్ మల్లేష్, రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఐఐటి-జెఇఇ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విద్యా సంస్థల సంచలనం

**కరీంనగర్ ఏప్రిల్ 21(మనం బ్యూరో):** ప్రకటించిన మెయిన్స్-2026 ఫలితాలలో, మన శ్రీ చైతన్య విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుతమైన ర్యాంకులను సాధించారు. వివిధ కేటగిరీలలో ర్యాంకులు సాధించిన శ్రీ చైతన్య ప్రతిభావంతులు వరుసగా: ఎం. సిరిచందన 143, టి. సాయి సిరి 164, ఎం. శ్రీసంజన 1008, కె. అభినవ్ 1141, బి. అంజి 2010, పి.ఎస్. 5699, కె. 7074, ఎం. శ్రీరామ్ రెడ్డి 14515, భుక్య శ్రీవిద్య 15870, గుగ్లవత్ యోగేశ్వర్ 17557, గుగ్లవత్ పల్లవి 19745. అఖిల భారత ర్యాంకులు సాధించినందుకు అభినందనలు తెలిపారు. అంతేకాక, జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరైన విద్యార్థులలో 50% మంది ఐఐటి అడ్వాన్స్డ్ పరీక్షకు అర్హత సాధించడం ద్వారా శ్రీ చైతన్య మరో సంచలనం సృష్టించిందన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ పరీక్ష జరిగే వరకు శ్రీ చైతన్య విద్యార్థులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వారి మనోధైర్యాన్ని పెంచడం వల్లే ఈరోజు మనం ఇంత గొప్ప విజయాన్ని సాధించగలిగామన్నారు. శ్రీ చైతన్య విద్యార్థులు ఐఐటి మరియు మెయిన్స్లో సీట్లు సాధించి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. శ్రీ చైతన్య విద్యార్థులు రాబోయే అడ్వాన్స్డ్ పరీక్షలో కూడా జాతీయ స్థాయిలో అగ్ర ర్యాంకులు సాధించి, ప్రతిష్టాత్మక ఐఐటీలలో సీట్లు సంపాదిస్తారని మేము విశ్వసిస్తున్నామన్నారు. మెయిన్స్-2026లో అగ్ర ర్యాంకులు సాధించిన మన శ్రీ చైతన్య ప్రతిభావంతులకు, వారి తల్లిదండ్రులకు చైర్మన్ రమేష్ రెడ్డి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. ప్రతి ముగ్గురు విద్యార్థులలో ఇద్దరిని అడ్వాన్స్డ్ అర్హత సాధించేలా తీర్చిదిద్దిన ఘనత శ్రీ చైతన్యకే దక్కుతుందన్నారు. ఈ విజయానికి ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా దోహదపడిన మన శ్రీ చైతన్య బోధనా సిబ్బందికి నా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల డైరెక్టర్ కారా నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్ రెడ్డి , జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఏజీఎం శ్రీనివాస్ , బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.




## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి..

**ఎమ్మార్పీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రాజన్న....**



**కల్వకుర్తి ఏప్రిల్21(మనం న్యూస్):** రాష్ట్రపతి ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు రాజన్న డిమాండ్ చేశారు.మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని పరిణయం ఫంక్షన్ హాలులో దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మకొండ రాజు దళిత క్రైస్తవుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రాజన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అనంతరం మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తించదని తీర్పు వెలువరిస్తే అన్ని రాజకీయ పార్టీలు మౌనం వహించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దళిత క్రైస్తవులకు అండగా ఉండి పోరాడుతానని పిలుపునిచ్చారని పేర్కొన్నారు.మంద కృష్ణ మాదిగ పిలుపుతో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులు దళిత క్రైస్తవుల ఎస్సి హోదా పోరాటానికి అండగా ఉంటామని తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. దళిత సిక్కు బౌద్ధులకు మినహాయింపు ఇచ్చినట్టే దళిత క్రైస్తవులకు కూడా కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మకొండ రాజు మాట్లాడుతూ దేశంలో క్రైస్తవం రాకముందు ఏ విధమైన వివక్ష ఉన్నదో నేటికీ అదే వివక్ష కొనసాగుతుందన్నారు. బ్రాహ్మణ,రెడ్డి,కమ్మ,వైశ్య కులస్తులు క్రైస్తవ మతంలోకి వెళ్తే సామాజిక హోదా మారినప్పుడు కేవలం దళితులకు మాత్రమే ఎందుకు హోదా మారుతుందని ప్రశ్నించారు. దళిత క్రైస్తవులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పోరాడి ఎస్సీ హోదా సాధించుకుందామని ఆయన పిలుపునిచ్చారు.దళిత క్రైస్తవులపై అమలులో ఉన్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని లేదా వాటి పరిధి నుండి దళితులను మినహాయించి దళితులకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు ఆర్టికల్ 14,15,25 లకు పూర్తిగా విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు తమ ఇష్టానుసారంగా మతాన్ని ఎంచుకునే హక్కు కలిగి ఉండాలని,ఇతర వర్గాలైన ఓసి,బీసీ,ఎస్టి,లకు లేని మత పరిమితులు కేవలం ఎస్సీలకే ఎందుకు విధిస్తున్నారని దీనిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.1950 రాష్ట్రపతి ఉత్తర్వులు పూర్తిగా అసమానతలను ప్రతిబింబిస్తున్నాయని, చారిత్రాత్మకంగా దళితుల విద్య ఆరోగ్య పురోగతిలో క్రైస్తవ మిషనరీలు కీలకపాత్ర పోషించిన నేపథ్యంలో మతం మారినందుకు దళితులను శిక్షించేలా ప్రభుత్వ విధానాలు ఉండకూడదని స్పష్టం పేర్కొన్నారు.ఏ మతంలో ఉండాలనేది వ్యక్తిగత నిర్ణయమని దానిపై ఆంక్షలు విధించే హక్కు ఎవరికీ లేదన్నారు.రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి సభ్యులు, ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షుడు పర్శపాకుల శేఖర్, నాయకులు అరుణ్ కుమార్, యోహాన్,నందు,శ్రీకాంత్, శేఖర్,ఆనంద్,జ్యోతి ప్రసాద్, శివరాంప్రసాద్,పాస్టర్లు లూకాస్,రామస్వామి,జేబి రాజు,సృజన్,వివిధ మండలాల పాస్టర్స్ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- నిల్వ ఉన్న ఆహార పోషకాలపై దృష్టి పెట్టండి....
- విద్యార్థుల నైపుణ్యాన్ని కలెక్టర్ దగ్గరుండి పరిశీలించి అభినందించారు....
- నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 21 (మనం బ్యూరో):** గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, సదుపాయాల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా కొనసాగుతున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా మంగళవారం అచ్చంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాఠశాల ప్రాంగణాన్ని సమగ్రంగా వంటశాలలు, నిల్వ గదులు, తరగతి గదులు, వసతి గృహాల పరిస్థితిని కలెక్టర్ పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పరిశుభ్రత కీలకమన్నారు. ప్రతి విభాగంలో శుభ్రతను నిరంతరం పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా వంటశాలలో ఆహారం తయారీ సమయంలో నాణ్యత ప్రమాణాలు, శుభ్రతపై ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్నారు. సరైన డైట్ ప్లాన్ను అమలు చేయాలన్నారు. ఆహార భద్రత విషయంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. నిల్వ గదుల్లో ధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయాలన్నారు. గడువు ముగిసిన పదార్థాలు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులపై దృష్టి సారిస్తూ, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ వారోత్సవాల భాగంగా నేడు నిర్వహిస్తున్న క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మమేకమై ప్రశ్నలు అడిగి, సరైన సమాధానాలు చెప్పిన వారిని అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి పోటీలు విద్యార్థి ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థుల మార్కులను అడిగి తెలుసుకుని, మెరుగైన ఫలితాలు సాధించిన వారిని అభినందించారు. ఇంకా ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బాలస్వామి, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వరిధాన్య సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి



**జగిత్యాల ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి):** మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో 'రా' మరియు బాయిల్ రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో యాసంగి 2025-26 వరిధాన్య సేకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా మరియు వేగంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత సంబంధిత అధికారులను మరియు రైస్ మిల్లర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూ యాసంగి సీజన్కు సంబంధించి ధాన్యం కొనుగోలు మరియు దిగుమతుల్లో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని, లారీల అన్-లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం లారీలు నిల్వలు పేరుకుపోకుండా ఉండాలంటే సరిపడా సంఖ్యలో హమాలీలను ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. రబీ 2024-25 ఖరీఫ్ 2025-26 ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రెతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, రైస్ మిల్లర్లు మరియు ట్రాన్స్ పోర్టర్ట్ లు సమన్వయం చేసుకుని ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా మరియు వేగవంతంగా అయ్యేలా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్ (సివిల్ సప్లైస్) జితేంద్ర ప్రసాద్, నాయబ్ తహశీల్దారులు, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు మరియు జిల్లాలోని రైస్ మిల్లర్లు. మరియు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి



**వరంగల్, ఏప్రిల్ 21(మనం న్యూస్):** తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నేడు వరంగల్ జిల్లా కేంద్రంలో పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిరుద్యోగుల భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నాయకులు ఇంద్రా నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పి, ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా 70,000 ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం బాధాకరమన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ రాదేమో అనే ఆందోళనతో రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పుడైనా కళ్ళు తెరిచి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, జీవో నెంబర్ 29 రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈ డబ్ల్యూ స్ రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.తెలంగాణ బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్య కుమార్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ విడుదల చేయాలని, గురుకుల, మోడల్ స్కూల్ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఉపాధ్యాయులకు రెండుసార్లు ప్రమోషన్లు ఇచ్చారని, కానీ నిరుద్యోగులతో భర్తీ చేయాల్సిన వాటా భర్తీ చేయకుండా డీఎస్సీ అభ్యర్థులను ఈ ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. టెట్ పరీక్ష కేంద్రాలను అభ్యర్థుల జిల్లా కేంద్రాల్లోనే ఏర్పాటు చేయాలని, జాతీయస్థాయి సీటెట్ మాదిరిగా రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పరీక్ష ఒకేరోజు నిర్వహించాలని డిమాండ్ చేశారు.10954 పోస్టులతో జీపీఓ నోటిఫికేషన్ విడుదల చేసినా వీఆర్ఓ, వీఆర్ఏలతో భర్తీ చేయగా మిగిలిన ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఈ ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు.శింబు నాయక్ మరియు చెర్రీ ప్రవీణ్ మాట్లాడుతూ జీవో నెంబర్ 46ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, 45వేల పోస్టులతో ఖిఐ, ౧ఇ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 29 శాఖల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, లేనిపక్షంలో గ్రామీణ స్థాయి నుంచి నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేస్తామని నిరుద్యోగ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు ఇంద్ర నాయక్, భూక్య కుమార్, శింబు నాయక్, చెర్రీ ప్రవీణ్, శ్యామ్, శ్రీపతి రాజు, సరస్వతి, సంధ్య, రేణుక, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## మన్ననూరు గ్రామంలో ఉన్న పీహెచ్సీ ఆకస్మిక తనిఖీ

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలు అందించాలి
- ప్రజల ఆరోగ్య సంరక్షణకు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వేదికలు కావాలి
- నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 21 (మనం బ్యూరో):** అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని మన్ననూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. అందులో భాగంగా ఆసుపత్రి పనితీరు, వైద్య సేవల అందుబాటు, రోగులకు అందుతున్న సదుపాయాలపై సమగ్రంగా పరిశీలన జరిపారు. మొదటగా ఆసుపత్రిలో డాక్టర్, ఇతర వైద్య సిబ్బంది ప్రతిరోజూ విధులకు హాజరవుతున్నారా, లేదా అనే విషయాన్ని తెలుసుకోవడానికి హాజరు రిజిస్టర్ను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది సమయపాలన, విధి నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడడం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న వారికి అందుతున్న వైద్య సేవల నాణ్యతపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చారో, డాక్టర్ పరీక్షలు ఎలా చేస్తున్నారో, చికిత్స పట్ల సంతృప్తి ఉందో లేదో ప్రశ్నించి వివరాలు సేకరించారు. పి హెచ్ సి లో రోజువారీ అవుట్ పేషెంట్ల (ఓపీ) సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, అలాగే రోగులకు ఇచ్చే చికిత్స, మందుల వివరాలను కూడా సక్రమంగా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. రికార్డు నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. తదుపరి ఆసుపత్రిలోని ల్యాబొరేటరీ, మెడికల్ స్టోర్, లేబర్ రూమ్ వంటి విభాగాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, ఔషధాల నిల్వ, పరిశుభ్రత పరిస్థితులను సమీక్షించారు. లేబర్ రూమ్లో సదుపాయాలు ఎలా ఉన్నాయో పరిశీలించి, గత నెలలో ఎన్ని ప్రసవాలు జరిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అలాగే రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలన్నారు. వారికి సమయానుకూలంగా చికిత్స అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట ఐటిడిఏ మేనేజర్ జాఫర్ హుస్సేన్, వైద్యులు ఇతర అధికారులు, గ్రామ సర్పంచ్ ఇస్లావత్ మంజుల రాజారం నాయక్ తదితరులు ఉన్నారు.

# అమెరికాకు తలనొప్పిగా ట్రంప్ అత్యుత్సాహం..!



**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు డెడ్‌లైన్ దగ్గరపడుతోంది. దానికి ఇంకా గంటల సమయమే ఉంది. మలివిడత చర్చల గురించి అంతా టెన్షన్ పడుతుండగా.. 'నేనే ముందు ప్రకటనలు చేయాలి' అనేలా ట్రంప్ వైఖరి ఇరాన్‌ను ఆగ్రహానికి గురిచేస్తోంది. దీంతో చర్చలు జరుగుతాయో, లేదో తెలియని సంధిగ్ధావస్థ నెలకొంది. ట్రంప్ బెదిరిస్తే.. తగ్గేదేలే అని ఇరాన్ పట్టుదల ప్రదర్శిస్తోంది. పాకిస్థాన్ వేదికగా జరిగిన చర్చల కోసం అమెరికా-ఇరాన్ ప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కానీ అక్కడ ఎలాంటి ఫలితం రాకపోయేసరికి ఇప్పటికే ఇంధన సంక్షోభం ఎదుర్కొంటోన్న ప్రపంచం తీవ్ర ఆందోళనలోకి వెళ్లిపోయింది. సీజ్‌ఫైర్ ముగిసేలోపు రెండోదఫా చర్చలు ఉంటాయని ప్రకటనలు వినిపించడంతో కాస్త ఊరట కనిపించింది. కానీ అంతలోనే సీనియర్ స్టాఫ్ సలహాలను పక్కనపెట్టిన ట్రంప్.. చర్చల కోసం జరుగుతోన్న దౌత్య ప్రయత్నాలను దెబ్బతీసేలా బహిరంగ ప్రకటనలు చేశారు. ఇరాన్ వెళ్లిన పాక్ మధ్యవర్తులు ఇచ్చిన సమాచారంపై మాట్లాడటం మొదలుపెట్టారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ సమాచారంపై చర్చించేందుకు ట్రూత్‌లో పోస్టులు పెట్టారు. పాత్రికేయులకు కాల్ చేశారట. తమ షరతులకు ఇరాన్ అంగీకరించిందని ప్రగల్భాలు పలికారు. వాస్తవంగా వాటిని అంగీకరించేందుకు ఇరాన్ సిద్ధంగా లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. శుద్ధి చేసిన యురేనియాన్ని అప్పగించడం సహా పలు డిమాండ్లకు ఇరాన్ అంగీకరించిందని, యుద్ధం ముగిసిందని బహిరంగంగా ప్రకటనలు చేశారు. ఈ వ్యాఖ్యలు ఇరాన్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి. అధ్యక్షుడి ప్రకటనలను ఆ దేశం తోసిపుచ్చింది. చర్చల కోసం జరుగుతోన్న ప్రయత్నాలను పక్కనపెడతామని తేల్చి చెప్పేసింది. ట్రంప్ అత్యుత్సాహం వారం రోజులుగా కాస్త ఆశావహంగా కనిపిస్తోన్న వాతావరణాన్ని దెబ్బతీసింది.

**ఇరాన్ నాయకత్వంలో చీలికపై కలవరం..!**

ఈ సమస్య ఒకవైపు ఉండగా.. ఇరాన్‌లోని నాయకత్వంలో చీలిక ఉందన్న నిఘావర్గాల సమాచారం అమెరికాను మరింత కలవరానికి గురిచేస్తోందట. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ బృందానికి, ఐఆర్జీసీకి మధ్య విభేదాలున్నాయనే అనుమానాలున్నాయి. కరడుగట్టిన ఐఆర్జీసీ నాయకుల చేతుల్లోకి ఇరాన్ వెళ్లిందన్న వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఒకవేళ ఒప్పందం కుదిరితే ఎవరు చేసిన సంతకం చెల్లుబాటు అవుతుందనే ప్రశ్న ఇప్పుడు అగ్రరాజ్యాన్ని వెంటాడుతోంది.

**కాల్పుల విరమణ ఉల్లంఘించేలా**

ఇక, ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్.. ఇరుదేశాల చర్చల్లో కీలకాంశం. యురేనియం శుద్ధి చేయడం పూర్తిగా ఆపేయాలని యూఎస్ పట్టుబడుతోంది. ఇదంతా ఒక క్రమంలో జరగాలని ఇరాన్ కోరుకుంటోంది. ప్రస్తుతానికి ఈ యురేనియం శుద్ధిని తాత్కాలికంగా నిలిపివేసి, తర్వాత కఠిన పర్యవేక్షణలో పరిమితంగా అనుమతిం చాలంటోందని చర్చల వివరాలు వెల్లడిస్తున్నాయి. ఇదే చర్చల్లో ప్రధాన అడ్డంకిగా ఉంది. ఒకవేళ ఇరాన్ అంగీకరిస్తే ప్రపంచవ్యాప్తంగా ఫ్రీజ్ చేసిన ఆస్తుల్లో కొంత మొత్తాన్ని విడుదల చేసే అంశాన్ని అమెరికా యోచిస్తోందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదీ.. చాలదన్నట్టు కాల్పుల విరమణ సమయంలో హర్మూజ్‌ను అమెరికా దిగ్బంధించి, ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు సాగించే నౌకలను అడ్డుకుంటోంది. హర్మూజ్ సమీపంలో టెహ్రాన్ నౌక తౌస్కాపై వాషింగ్టన్ బలగాలు దాడి చేయడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనతో పాటు తమ నౌకల రాకపోకలపై దిగ్బంధనం విధించడంతో ట్రంప్ దౌత్య ప్రయత్నాలను దెబ్బతీశారని ఇరాన్ ఆరోపించింది. ఇరాన్‌తో చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మంగళవారం పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ బెదిరింపుల మధ్య ఇరాన్ ప్రతినిధుల రాకపై ఇంకా అనిశ్చితి నెలకొంది.

## తమిళనాట అసెంబ్లీ పోరు.. ప్రచారానికి తెర



**చెన్నై, ఏప్రిల్ 21:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. పశ్చిమ బెంగాల్లోనూ మొదటి విడత ఎన్నికల ప్రచారానికి తెరపడింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. తమిళనాడులో తుదిరోజు అన్ని పార్టీల అగ్రనేతలు ముమ్మర ప్రచారం నిర్వహించారు.

# ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వ వైభవం

## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు

**చెన్నై, ఏప్రిల్ 21:** తమిళనాడులో రెండో రోజు ఏపీ సీఎం చంద్రబాబు పర్యటిస్తున్నారు. ఎన్డీయే తరఫున ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ''కేంద్రంలో మోడీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా?'' అని చంద్రబాబు ప్రశ్నించారు.''తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోడీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను



ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుంది'' అని చంద్రబాబు అన్నారు.

# గతంలో ఎన్నడూ లేదు..!

## భారీ సంఖ్యలో భద్రతాబలగాలతో మీటింగ్..!



**కోల్‌కతా, ఏప్రిల్ 21:** రెండురోజుల్లో పశ్చిమ బెంగాల్లో తొలివిడత పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర భద్రతా బలగాలు సమావేశమయ్యాయి. అందులో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ చీఫ్‌లందరూ పాల్గొన్నారు. ఇప్పటికే కేంద్రం-బెంగాల్ ప్రభుత్వానికి మధ్య ఉన్న విభేదాలను ఈ పరిణామం తీవ్రం చేసింది. ఇది సాధారణ సమావేశంలా కనిపించడం లేదని, సైనిక తరహా స్వాధీనానికి పన్నాగంలా కనిపిస్తోందని తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. సీఏపీఎఫ్.. కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు రిపోర్ట్ చేస్తుంటుంది. ఇలా సీఏపీఎఫ్‌లోని అన్ని యూనిట్లు ఒక దగ్గర చేరి, ఎన్నికల వేళ భద్రతా ఏర్పాట్ల గురించి చర్చించినట్లు వార్తలు వచ్చాయి. గతంలో ఏ అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇలా సమావేశం కాలేదని, ఇదొక అనూహ్య భేటీ అని సంబంధిత వర్గాలు మీడియాకు వెల్లడించాయి. రికార్డు స్థాయిలో 2400 కంపెనీలకు చెందిన 2.4 లక్షలమందిని బెంగాల్లో మోహరించడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న చరిత్ర ఈ రాష్ట్రానికి ఉందని, ఈసారి అలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకూడదనే ఈ మోహరింపులు అని కేంద్రం చెప్తోంది. తొలి విడతలో 3.4 కోట్ల మంది ఓటు వేయనున్నారు. అంటే ప్రతి 140 మందికి ఒక భద్రతాసిబ్బంది చొప్పున మోహరించినట్లు కనిపిస్తోంది. ఘర్షణలు జరిగే ప్రాంతాల్లోకి వెళ్లేందుకు జమ్మూకశ్మీర్ నుంచి బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను తెప్పించారు. ఇదంతా ఓటర్లను భయపెట్టే ప్రయత్నమని, మణిపూర్‌లో హింస తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు కూడా 290 కంపెనీలకు చెందిన 29,000 మందినే మోహరించారని తృణమూల్ మాజీ ఎంపీ సాకేత్ గోఖలే విమర్శించారు. మోడీ-అమిత్ షా బెంగాల్‌ను చేజిక్కించుకోవాలని ఎదురుచూస్తున్నారని, ఢిల్లీ నుంచి రాష్ట్రాన్ని నియంత్రించాలనుకుంటున్నారని ఎక్స్ వేదికగా ఆరోపించారు. 2021లో బెంగాల్లో ఎన్నికలు 8 దశల్లో జరిగాయి. ఈసారి రెండు విడతల్లోనే పూర్తి కానున్నాయి. ఒకేసారి భారీ ఓటింగ్ జరుగుతుండటంతో ఈస్థాయిలో బలగాలను దించినట్లు కొందరు విశ్లేషిస్తున్నారు.

## వీసా దరఖాస్తులు..

### తగ్గిన ప్రాసెసింగ్ టైమ్

### భారతీయులకు కెనడా ఊరట



**ఒట్టావా, ఏప్రిల్ 21:** భారతీయ వీసా దరఖాస్తుదారులకు కెనడా ప్రభుత్వం ఊరట కల్పించింది. తాత్కాలిక నివాస దరఖాస్తులతో పాటు విజిటర్స్, స్టడీ పర్మిట్స్, సూపర్ వీసా ప్రాసెసింగ్ సమయాన్ని తగ్గిస్తూ మరింత వేగవంతం చేసింది. ఈమేరకు ఆ దేశ ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ తాజాగా వివరాలు వెల్లడించింది. విజిటర్ వీసాల ప్రాసెసింగ్‌ను 37 రోజుల నుంచి 23 రోజులకు, స్టడీ పర్మిట్ వీసా 4 వారాల నుంచి 3 వారాలకు, సూపర్ వీసా ప్రాసెసింగ్‌ను 202 రోజుల నుంచి 182 రోజులకు తగ్గించింది. తాత్కాలిక వీసా కేటగిరీల్లో మెరుగుదలను ఈ గణాంకాలు వెల్లడి చేస్తున్నాయి. దరఖాస్తుల సంఖ్య, రకం, పనిభారాన్ని బట్టి ఈ ప్రాసెసింగ్ సమయంలో మార్పు ఉంటుందని కెనడా అధికారులు వెల్లడించారు.

# ఎన్నికల వేళ..బెంగాల్లో..



- బైక్ వెనుక కూర్చోవడంపై ఆంక్షలు

**కోల్‌కతా, ఏప్రిల్ 21:** అసెంబ్లీ ఎన్నికల పోరుకు పశ్చిమ బెంగాల్ సిద్ధమైంది. గురువారం జరగనున్న తొలిదశ పోలింగ్‌కు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలకు ఉపక్రమించింది. బైక్ ర్యాలీలను పూర్తిగా నిషేధించింది. రాత్రిపూట రాకపోకలను నియంత్రించడం, బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపైనా ఆంక్షలు విధించింది. మంగళవారం నుంచే ఆ ఆంక్షలను అమలు చేయాలని ఎన్నికల విధుల్లో ఉండే ఆయా విభాగాలకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేశారు.

పోలింగ్ నేపథ్యంలో సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు బైకులు, స్కూటర్లను రోడ్లపైకి అనుమతించరు. వైద్యసేవలు, కుటుంబ వేడుకలు, తదితర అత్యవసర కార్యక్రమాలకు హాజరయ్యే వారిని మాత్రమే అనుమతిస్తారు. బైక్ ర్యాలీలపై పూర్తిగా నిషేధం విధించారు. పగటిపూట బైక్‌లపై ఇద్దరు వెళ్లడంపై (ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు) ఆంక్షలు విధించారు. పాఠశాలలు, కాలేజీ విద్యార్థులను తీసుకెళ్లే వారికి మినహాయింపు ఇచ్చారు. పోలింగ్ రోజు కూడా ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. ఎన్నికల వేళ ఓటర్లపై బెదిరింపులకు పాల్పడటం, పోలింగ్‌కు వెళ్లే వారికి ఆటంకం కలిగించడం, జామింగ్‌లను నివారించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు. మినహాయింపు కోరుకునే వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇరుకుగా ఉండే వీధుల్లో నగదు, మద్యం తరలించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు బైక్‌లను ఉపయోగించే అవకాశం ఉందని ఓ అధికారి పేర్కొన్నారు. ఇదిలాఉంటే, ఏప్రిల్ 23న బెంగాల్లో 152 నియోజకవర్గాల్లో తొలి దశ పోలింగ్ జరగనుంది.

# ఎంత బెదిరించినా.. తగ్గేదేలే

## ఇరాన్ పార్లమెంటు స్పీకర్



**టెహ్రాన్, ఏప్రిల్ 21:** పాకిస్థాన్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య జరగాల్సిన రెండోవిడత చర్చలు జరుగుతాయా, లేదా అనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈక్రమంలో ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమపై బెదిరింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో.. వారితో చర్చలకు అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పేశారు. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనతో పాటు తమ నౌకల రాకపోకలపై దిగ్బంధనం విధించడంతో ట్రంప్ దౌత్య సంబంధాలను దెబ్బతీశారని ఘాలిబఫ్ ఆరోపించారు. టెహ్రాన్ లొంగిపోయేలా ఒత్తిడి చేసేందుకు, యుద్ధం తిరిగి ప్రారంభించడానికి ఈ చర్చలను ఓ సాకుగా చూపేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారన్నారు. అయితే బెదిరింపుల మధ్య జరిగే చర్చలను ఇరాన్ ఎప్పటికీ అంగీకరించదని స్పష్టంచేశారు. గత రెండు వారాలుగా యుద్ధంలో సరికొత్త వ్యూహాల అమలుకు ఇరాన్ ప్రణాళికలు రచిస్తోందని ఆయన హెచ్చరించారు.

ఇరాన్‌తో చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మంగళవారం ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నట్లు అమెరికా అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. మరోవైపు ఇరాన్ చర్చల్లో పాల్గొనడంపై భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. అమెరికా దిగ్బంధనం ఎత్తివేసే వరకు చర్చల్లో పాల్గొనేది లేదని ఇరాన్‌కు చెందిన ఓ వర్గం పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇక, చర్చలకు వాన్స్ హాజరుకానున్న నేపథ్యంలో.. ఘాలిబఫ్ కూడా ఇందులో పాల్గొనే అవకాశం ఉన్నట్లు అవి వెల్లడించాయి.

**ప్రత్యక్ష చర్చలకు ఓకే: ట్రంప్**

ఇరాన్ నాయకత్వంతో నేరుగా సంప్రదింపులు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ట్రంప్ సూచనప్రాయంగా పేర్కొన్నారు. 'వారు కలవాలనుకుంటే.. మా దగ్గర చాలా సమర్థవంతమైన వ్యక్తులు ఉన్నారు. ఒకవేళ నేరుగా నన్నే కలవాలనుకున్నా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు' అని ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇక, చర్చల నేపథ్యంలో అమెరికా మాజీ సీఐఏ చీఫ్ డేవిడ్ హెచ్ పెట్రాయస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించే అవకాశం ఉందన్నారు.

## కౌంటింగ్ వరకు.. స్ట్రాంగ్ రూమ్‌లు తెరవొద్దు

### ఎన్నికల సంఘం ఆదేశాలు




**తిరువనంతపురం, ఏప్రిల్ 21:** కేరళలోని జిల్లా ఎన్నికల అధికారులకు ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపు ముందువరకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్ట్రాంగ్ రూమ్‌లను తెరవకూడదని ఆదేశాలు జారీచేసింది. కొయ్‌కోడ్ జిల్లాలోని పెరంబ్ర నియోజకవర్గంలోని ఈవీఎంలను ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచినట్లు ప్రచారం జరిగింది. దీంతోపాటు పాలక్కాడ్‌లోని నెన్మర నియోజకవర్గంలోని మరో స్ట్రాంగ్ రూమ్ తెరిచేందుకు యత్నించారన్న కథనాలు వెలువడ్డాయి. ఇదికాస్తా రాజకీయ దుమారం రేపింది. ఈ క్రమంలోనే కేరళ ప్రధాన ఎన్నికల అధికారి రతన్ యు కెల్కర్ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ స్ట్రాంగ్ రూమ్‌లను, సీల్ వేయని గదులను తెరవడం లాంటివి చేయొద్దని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకత, భద్రతను కాపాడేందుకు అధికారులంతా ఈ సూచనలు కచ్చితంగా పాటించాలని కోరారు. కాగా.. కేరళలోని 140 నియోజకవర్గాలకు ఈనెల 9న అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. వీటికి సంబంధించిన ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

# హర్మూజ్ దాటిస్తామంటూ నౌకలకు మోసగాళ్ల గాలం..!

**టెహ్రాన్, ఏప్రిల్ 21:** హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా కట్టుదిట్టమైన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఈ క్రమంలో హర్మూజ్‌లో వందలాది నౌకలు నిలిచిపోయాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు దోపిడీదారులు అధికారుల వేషంలో ఆ నౌకల వద్ద నుంచి డబ్బు వసూలు చేస్తున్నారు. క్రిప్టో కరెన్సీ చెల్లిస్తే దానికి బదులుగా నౌకలను హర్మూజ్ దాటిస్తామని హామీలు ఇస్తూ నౌకల యజమానుల్ని మోసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రీక్ మ్యారిటైమ్ రిస్క్ మేనేజ్‌మెంట్ సంస్థ మారిస్క్స్ నౌకల యజమానులకు హెచ్చరికలు జారీ చేసింది. ''ఇరాన్ అధికారులమని పెత్తనం చెలాయిస్తూ.. క్రిప్టో కరెన్సీ, బిట్కాయిన్స్, టెథర్ రూపంలో చెల్లింపులు చేయండి. మీ నౌకలను క్షేమంగా హర్మూజ్ జలసంధిని దాటిస్తాం. అని ఎవరైనా అధికారుల వేషంలో వచ్చి హామీలు ఇస్తే వాటిని నమ్మొద్దు. ఇరాన్ అధికారులు ఇలాంటి అవకాశాలు కల్పించలేదు. ఇది కచ్చితంగా మోసమే'' అంటూ మారిస్క్స్ తన ప్రకటనలో వెల్లడించింది. పశ్చిమాసియాలో యుద్ధం మొదలవడానికి ముందు ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గ చమురు వాణిజ్యంలో సుమారు 20శాతం, ఎల్ఎన్‌జీలో 20శాతం ఈ జలసంధి నుంచే రవాణా జరిగేవి.

# డీల్ కుదరకపోతే యుద్ధమే

- రెండో దఫా శాంతి చర్చలపై ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- తగ్గేదే లేదని టెహ్రాన్ జవాబు

**వాషింగ్టన్, ఏప్రిల్ 21 :** పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఇరాన్కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్తో చర్చలు సఫలం కాకపోతే యుద్ధం తప్పదని, తాము ఇప్పటికే ఆయుధాలను సిద్ధం చేసుకున్నామని సంచలన వ్యాఖ్యలు చేశారు. శాంతి కోసం తాము ప్రతిపాదించే 'డీల్'ను అంగీకరించాలని, లేనిపక్షంలో వినాశకర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్తో డీల్ కుదరకపోతే మేము మరోసారి యుద్ధానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. గత కాల్పుల విరమణ సమయంలో మేము మా శక్తిని మరింతగా కూడగట్టుకున్నాం. ఇప్పటికే అన్ని రకాల అత్యాధునిక ఆయుధాలను యుద్ధం కోసం సిద్ధం చేశాం అని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ పోర్టుల దిగ్బంధనం అమెరికా సాధించిన గొప్ప విజయమని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేవలం కాల్పుల విరమణతో సమస్య పరిష్కారం కాదని, పటిష్టమైన ఒప్పందం (డీల్) లేకుండా దీనిని కొనసాగించలేమని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ కోసం మేము ఒక అద్భుతమైన డీల్ సిద్ధం చేస్తున్నాం. దీని ద్వారా శాంతి, భద్రత, రక్షణ ఏర్పడతాయి. నేను రూపొందించిన ఈ ఒప్పందాన్ని చూసి యావత్ ప్రపంచమే గర్వపడుతుంది అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలతో అంతర్జాతీయంగా, ముఖ్యంగా ఇంధన మార్కెట్లో కలకలం మొదలైంది. అమెరికా తదుపరి అడుగు ఏంటన్నది ఇప్పుడు ప్రపంచ దేశాల్లో ఆసక్తికరంగా మారింది.

# అమెరికా సీజ్ చేసిన నౌకలో..

# చైనా నుంచి ఇరాన్‌కు క్షిపణి రసాయనాలు!

## రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ



**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** ఐక్యరాజ్యసమితిలో యూఎస్ మాజీ రాయబారి, రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ సంచలన ఆరోపణలు చేశారు. హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ పతాకంతో ప్రయాణిస్తున్న 'తౌస్కా' అనే వాణిజ్య నౌకను ఇటీవల అమెరికా సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ నౌకలో క్షిపణి తయారీలో ఉపయోగించే రసాయనాలు ఉన్నాయని నిక్కీ హేలీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. ఇటీవల హర్మూజ్ జలసంధిలో అమెరికా స్వాధీనం చేసుకొన్న నౌక చైనా నుంచి ఇరాన్‌కు వెళుతుందని నిక్కీ హేలీ పేర్కొన్నారు. క్షిపణి తయారీలో వినియోగించే రసాయనాలను అందులో తరలిస్తున్నట్లు ఆరోపించారు. నౌకను ఆపాలని యూఎస్ దళాలు అనేకసార్లు హెచ్చరించినా, అది పట్టించుకోలేదన్నారు. దీంతో యుద్ధంలో ఇరాన్‌కు చైనా సైనిక సాయం అందిస్తోందనే విషయాన్ని తోసిపుచ్చలేమని వ్యాఖ్యానించారు.

**నౌకను తక్షణమే విడుదల చేయండి..**

అమెరికా తమ వాణిజ్య నౌకను సీజ్ చేయడంపై ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్రంగా మండిపడింది. నౌకను, అందులోని సిబ్బందిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఇది వెంటనే జరగకపోతే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఓ ప్రకటనలో అమెరికాను హెచ్చరించింది. ఈ ఆపరేషన్‌లో సిబ్బందిని, వారి కుటుంబాలను బెదిరించి అమెరికా దళాలు.. బందీలుగా చేసుకున్నాయని ఆరోపించింది. అంతర్జాతీయ సంస్థలు వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, నౌకను, అందులోని సిబ్బంది క్షేమంగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరింది. జాతీయ ప్రయోజనాలను, తమ పౌరుల హక్కులను కాపాడుకొనేందుకు ఇరాన్ అన్ని మార్గాలను వాడుతుందని వెల్లడించింది.

# రబి ధాన్యం సేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి



- **రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి**
- **కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలి**
- **రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**నల్లగొండ, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి):** నల్గొండ జిల్లాలో రబీ ధాన్యం సేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నల్గొండలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరా భవన్లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తో కలిసి పౌరసరఫరాలు, మార్కెటింగ్, డిఆర్డిఏ, రవాణా, కో-ఆపరేటివ్ తదితర శాఖల అధికారులు,రైస్ మిల్లర్లతో రబీ దాన్యం సేకరణ పై సమీక్ష నిర్వహించారు. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని, అన్ని కొనుగోలు కేంద్రాలకు పూర్తిస్థాయిలో లారీలను పంపించి రాత్రి ,పగలు ధాన్యం కొనుగోలు చేసి అవసరమైతే లైట్లు ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరణ సేకరించాలని, రానున్న వారం ,పది రోజుల్లో రబి ధాన్యం సేకరణ పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆదేశించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని కొనుగోలు కేంద్రాలలో తప్పనిసరిగా నీడ తాగునీరు ఏర్పాటు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని,లారీలు,హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం పరిశీలించినట్లయితే నల్గొండ నియోజకవర్గంలోనే 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, అందువల్ల నియోజకవర్గంలోని అన్ని కొనుగోలు కేంద్రాలకు వీలైనన్ని ఎక్కువ లారీలు ఏర్పాటు చేయాలని ,ప్రతిరోజు 10,000 మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేయాలని చెప్పారు. ఇంకా 10 శాతం కోతలు పూర్తి కావాల్సి ఉందని, రోడ్లపై ఎవరు ధాన్యం పోయరాదని, అవసరం అయితే పాఠశాల భవనాలు, ఫంక్షన్ హాల్ లాంటి చోట కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, ప్రతి కేంద్రంలో ఒక కాంటాను అదనంగా ఉంచాలని, ఎక్కువగా ధాన్యం వచ్చేందుకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ ఎక్కువ లారీలు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ను ఆదేశించారు. మంగళవారం నుండే యుద్ధ ప్రాతిపదికన రాత్రి ,పగలు కొనుగోలు ప్రారంభం చేసి, ఉన్న ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లులకు పంపించాలని ,మిల్లర్లు కూడా జాప్యం చేయకుండా వెంటనే ధాన్యాన్ని దిగుమతి చేసుకొని సహకరించాలని కోరారు .కనగల్, ధర్వేశిపురం తదితరచోట్ల ఖాళీగా ఉన్న వ్యవసాయ గోదాములలో ధాన్యం ఉంచేందుకు చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రానున్న వారం, పది రోజుల్లో రబీధాన్యం సేకరణ పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని, షెడ్యూల్ ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, జిల్లాలో 6 మిల్లులు సీజ్ చేయడం వల్ల వచ్చిన మిల్లులకే ధాన్యం ఎక్కువగా వస్తున్నదని తెలిపారు. ఏ ఎం ఆర్ పి లైనింగ్ పూర్తి కావడం వల్ల నీటి సౌకర్యం పెరిగిందని, దీంతో రైతులందరూ బత్తాయి నిమ్మ తోటలను తీసేసి ధాన్యాన్ని పండిస్తున్నారని తెలిపారు. ఏది ఏమైనప్పటికీ రానున్న వారం,10 రోజుల్లో 90% ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామన్నారు. తన నియోజకవర్గంతో పాటు, జిల్లాలో రహదారులు భవనాల శాఖ ద్వారా అవసరమైన అన్ని రోడ్లను ఏర్పాటు చేస్తున్నామని, ఔటర్ రింగ్ రోడ్డు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రత్యేకించి పట్టణంలోని రోడ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని, హైదరాబాదులా నల్గొండ పట్టణం చుట్టూ రోడ్లను ఏర్పాటు చేస్తామని, ఎస్డిఎఫ్ నిధులతో పాటు, సిసి రోడ్లు, ఇతర పనులు నడుస్తున్నాయని, ఆయన తెలిపారు. అలాగే అన్ని పార్కుల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించామని, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అవసరమైతే ట్యాంకర్ల ద్వారా అన్ని వార్డులకు కృష్ణ నీటిని అందజేస్తామని, అందుకు తగ్గ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, రెవెన్యూ కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశం, మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, డిసిఓ పత్యా నాయక్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, ఆర్టీవో లావణ్య, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- **కొనుగోలు కేంద్రలలో రైతులకు మౌలిక వసతులు కల్పించాలి**
- **రోజుకు 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం.సేకరణ లక్ష్యం**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్**

**కోదాడ, ఏప్రిల్ 21(మనం న్యూస్):** జిల్లాలో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.. మంగళవారం పట్టణ పరిధిలోని తమ్మర బండపాలెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందన్న అంచనా మేరకు జిల్లా వ్యాప్తంగా 340కి పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 25వేల మెట్రిక్ టన్నుల పైగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, సోమవారం ఒక్కరోజే 8900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు వివరించారు. గతంలో రోజుకు 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుండగా వరి కోతలు ఎక్కువ కావడంతో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశామని రోజుకు 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని మౌళిక వసతులతో పాటు తేమ కొలిచే యంత్రాలు, టార్ఫలిన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. లోడింగ్ చేసిన ధాన్యాన్ని మిల్లులలో వేగంగా అన్ లోడింగ్ చేసి తిరిగి కొనుగోలు కేంద్రాలను వచ్చేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. కొనుగోలుకు అనుగుణంగా లారీలను ఏర్పాటు చేయాలని, అవసరం అయితే లారీల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయం సమయంలోనే ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇచ్చామని, అదే విదంగా ప్రతి కొనుగోలు కేంద్రంలో నీడ, తాగునీటి సౌకర్యం, ఓఆర్ఎస్ లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వాతావరణ మార్పుల దృష్ట్యా అకాల వర్షాలతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామని తెలిపారు.ఈ కార్యక్రమములు ఆర్డిఓ సూర్యనారాయణ, తహసిల్దార్ వాజిద్ అలీ, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సూర్యాపేట ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి):** హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం.నియోజకవర్గ కేంద్రంలోనీ రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని, ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైట్, గ్రీనరీ, త్రాగునీరు, పైలాన్ స్తూపం స్థలాన్ని పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు హౌసింగ్ పీడీ సిద్ధార్థ, హర్టికల్చర్ పిడి నాగయ్య, తహసిల్దార్ కవిత, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ వసతి గృహాల సమస్యల నివేదికలు అందించాలి




- **వేసవి సెలవులలో వసతి గృహాల మరమతులు పూర్తి చేయాలి**
- **ఇమాంపేట కేజీవిబి స్కూల్లో ఫ్యాన్లు మైనర్ రిపేర్ల కోసం తక్షణమే రూ50 వేలు విడుదల చేసిన జిల్లా కలెక్టర్**

**సూర్యాపేట, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి):** సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలపై సత్వరమే నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా సూర్యాపేట రూరల్ పరిధిలోని కేజీవిబిని కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మెస్ కమిటీలు సక్రమంగా రిజిస్టర్ మెంటెయిన్ చేయాలని, రోజు వారీగా స్టాక్ వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడం జరిగిందని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలలో వసతి గృహాలలో నెలకొన్న సమస్యలతో పాటు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలలో రిపేర్లను గుర్తించి నివేదికను సిద్ధం చేయాలని తెలిపారు. రిపేర్ల కోసం నివేదికను అందించాలని తెలిపారు.గతంలో కంటే ప్రస్తుతం వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టి రెగ్యులర్గా మానిటరింగ్ చేస్తున్నామని పేర్కొన్నారు.వేసవి సెలవుల నేపథ్యంలో వసతి గృహాలలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వసతి గృహాలలో రెగ్యులర్ గా పేరెంట్స్, టీచర్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని విద్యార్థుల సమస్యలపై చర్చించుకోవాలని సూచించారు.. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం వంట శాల, స్టోర్ గదులను, లివింగ్ రూమ్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.. విద్యార్థులకు అందిస్తున్న మెనూ పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీవిబిలో ఫ్యాన్లు, మైనర్ రిపేర్ల కోసం కలెక్టర్ అవైలబుల్ నిధుల నుండి రూ.50వేలు అందించారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి డిబేట్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, ఎస్.ఓ.నారాయణమ్మ, జిసిడిఓ పుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# జయ విద్యార్థుల ప్రభంజనం




**సూర్యాపేట, ఏప్రిల్ 21, మనం న్యూస్:** జేఈఈ మెయిన్స్ పరీక్ష లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాల విద్యార్థులు 5 మంది విద్యార్థులు 99 శాతం, మరో 26మంది విద్యార్థులు 90 శాతానికి పైగా, అలాగే 74 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షకు అర్హత సాధించి ప్రభంజనం సృష్టించారని కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ హర్షించారు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విజయభేరి మ్రోగించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్. సాయి రిత్విక్ 99.55, జి. శ్రీనిక 99.43, ఎస్ ఆశువర్ధన్ 99.36, ఎం రితిన్ శెట్టి 99.23, సిహెచ్ శివకుమార్ 99.09, ఎస్కే నేహా 98.68, డి సిరి 97.16, ఎండి హాదియా 96.96, జీ వంశీ 96.09, జి హర్షిత 95.92, వి గౌతమ్ కుమార్ 95.71 పర్సంటేజ్ సాధించారని తెలిపారు. ఆల్ ఇండియా అన్ని కేటగిరీ లలో 115, 563, 862, 963 లతో పాటు 5000 లోపు 10 ర్యాంకులు, 10000 లోపు 18 ర్యాంకులు సాధించాలని తెలిపారు. వారి ర్యాంక్ కై ఎంతో కృషిచేసిన అధ్యాపక బృందాన్ని కరస్పాండెంట్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి లు అభినందించారు.

# అంగన్వాడిలో పౌష్టికాహారం పంపిణీ

**తిరుమలగిరి, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** తిరుమలగిరి మున్సిపాలిటీ 2వ వార్డులో అంగన్వాడీ కేంద్రాలో పౌష్టికాహారాన్ని కౌన్సిలర్ జక్కుల రమేష్ మంగళవారం పంపిణీ చేశారు. పిల్లలకు,గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారమైన గుడ్లు,బాల అమృతంఅందించారు.ఈ సదర్భంగా ఆరోగ్యలక్ష్మి కమిటినివేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బిఆర్ ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి మేడబోయిన వెంకన్న,పయ్యాముల లింగేష్, అంగన్వాడీ సిబ్బంది,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఆదిశంకరాచార్యులు జయంతి



**మేళ్లచెరువు, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** స్థానిక శ్రీ ఇష్టకామేశ్వరి సమేత శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం నందు ఆదిశంకరాచార్యులు జయంతి ఉత్సవాలను మంగళవారం అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదిశంకరాచార్యులు విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ముఖ్య అర్చకులు కొంక పాక విష్ణువర్ధన్ శర్మ మాట్లాడుతూ చిన్న వయసులోనే వేదాలు శాస్త్రాలు నేర్చుకొని హిందూ ధర్మాన్ని భారతదేశం అంతా పర్యటిస్తూ తత్వ ప్రచారం నిర్వహించారని అన్నారు. సందర్భంగా ప్రాతకాలమున స్వామివారికి గణపతి పూజ, పుణ్యా వచనం, ఇష్టకామేశ్వరి అమ్మవారికి అభిషేక కార్యక్రమం, రాహు కేతువులు ప్రత్యేక అభిషేకము, స్వామి వారికి పూల అలంకరణ, అనంతరం అష్టోత్తర పూజ మహా నివేదన మహా హారతి తీర్థప్రసాద లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాణాధికారి నాగేళ్ల శంబి రెడ్డి అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను అభినందించిన ఎస్పి

**సూర్యాపేట, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించిన అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం సందర్భంగా రోడ్డు భద్రతపై వీడియో రూపొందించి రోడ్డు ప్రమాదాల నివారణ భాగస్వామ్యం కావాలని పోలీసు శాఖ ఇచ్చిన పిలుపు మేరకు సూర్యాపేట పట్టణం జమ్మిగడ్డకు చెందిన కిరాణా దుకాణం నిర్వాహకులు నాగరాజు హెల్మెట్ వినియోగం పై అవగాహన వీడియో రూపొందించారు. ఈ అవగాహన వీడియో నందు నటించిన చిన్నారులు యశస్వి, వర్ష, సుశాంత్, రవి లకు మిఠాయిలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వీడియో నందు హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాన్ని చక్కగా వివరించారని, ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



# ఐఐటి జేఈఈ ఫలితాలలో ప్రగతి జూనియర్ కళాశాల ప్రభంజనం

**నల్లగొండ, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** ఐఐటి జేఈఈ (మెయిన్స్ ) - 2026 ఫలితాలలో నల్లగొండ పట్టణంలోని 'ప్రగతి జూనియర్ కళాశాల' విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. కళాశాలకు చెందిన విద్యార్థులు వివిధ క్యాటగిరిలలో సాధించిన ర్యాంకులు, డి. అభిశేక్- 1109, డి. తరుణ్ -1158, కె. సిద్దు 1380, ఆర్. దివ్యాంభికాశ్రీ -4476, జె. సాత్విక్సాయి -6107, యన్. మనోహర్ ముత్యం -6485, వై. భువిశ్రీ-9296, కె. సాత్విక్ -17937 ర్యాంకులు సాధించారు. మరియు 72 మంది విద్యార్థులు ఐఐటి జేఈఈ (అడ్వాన్స్ ) - 2026 కు అర్హత సాధించి నల్లగొండ జిల్లాలో 'ప్రగతి జూనియర్ కళాశాల' ది బెస్ట్ కళాశాల అని నిరూపించినారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులను వారి తల్లిదండ్రులను అందుకు సహకరించిన అధ్యాపక బృందానికి చైర్మన్ చందాకృష్ణమూర్తి, మరియు డైరెక్టర్లు ఎ. నరేందర్ బాబు, ఎన్. శశిధర్రా రావు, చందా శ్రీనివాస్, పైళ్ళ రమేష్ రెడ్డి లు మంగళవారం అభినందించారు. పట్టుదల, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికబద్ధమైన విద్యాబోధన, అంకితభావం కలిగిన యాజమాన్యం మరియు అధ్యాప కబృందం కృషివలన ఉత్తమ ఫలితాలు సాధించడం జరిగిందని ప్రిన్సిపల్ తెలియజేశారు.



# సాంకేతిక వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు పెంపు



- **జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు విజయలక్ష్మి**
- **పదవ తరగతి తర్వాత సంప్రదాయ కోర్సులకు పరిమితం కాకూడదు**
- **డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు విద్యార్థులు ముందుకు రావాలి**

**ఖమ్మం, ఏప్రిల్ 21(మనం న్యూస్):** పదవ తరగతి తర్వాత విద్యార్థులు కేవలం సంప్రదాయ కోర్సులకే పరిమితం కాకుండా, ఉపాధికి గ్యారెంటీ ఇచ్చే సాంకేతిక వృత్తి విద్యను ఎంచుకోవాలని హన్మకొండ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నందు కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ , హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయ లక్ష్మి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో చేనేత రంగం ఫ్యాషన్ డిజైనింగ్, టెక్స్టైల్ కెమిస్ట్రీ వంటి అత్యాధునిక సాంకేతికతతో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ టెక్స్టైల్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి ఉన్న అవకాశాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. మగ్గం నేయడమే కాకుండా సీఏడి (కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్), స్మార్ట్ గార్మెంట్స్ తయారీలో అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కోర్సు చదువుతున్న కాలంలో విద్యార్థులకు నెలకు రూ. 2,500/- స్టైఫండ్, చేనేత కుటుంబాల వారికి అదనంగా రూ. 5,000/- వరకు లభించే అవకాశం ఉందన్నారు. ఏడాదికి కేవలం రూ. 4,250/- ఫీజుతో ఈ కోర్సు పూర్తి చేయవచ్చని, అనంతరం పెద్ద టెక్స్టైల్ కంపెనీలలో ఉద్యోగాలు లేదా స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత అర్హతగా ఉండగా, మొత్తం 60 సీట్లు మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయబడతాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ మొదటి వారం లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణం, నాంపల్లి, హైదరాబాద్లో సమర్పించవచ్చన్నారు. ఖమ్మం జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ సిబ్బంది, విద్యార్థులు , తల్లిదండ్రులు , తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం

## దశలవారీగా అన్ని గ్రామాల్లో ఏర్పాటు

**మల్లూరు, మంగపేటలో ప్రజా దర్బార్ కార్యక్రమం వినతుల వెల్లువ**

**మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

**మహిళా సంఘాలకు 60 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు**

**గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు**

**రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క**





ములుగు, ఏప్రిల్ 21, మనం ప్రతినిధిః ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దశలవారీగా అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. మల్లూరు, మంగపేటలో నిర్వహించిన ప్రజా దర్బారుకు విశేష స్పందన లభించిందన్నారు. మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, మహిళా సంఘాలకు 60 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని, గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి స్పష్టం చేశారు. మంగళవారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి దర్శించుకున్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక₹లో భాగంగా మంగపేట మండలం మల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ₹ప్రత్యేక ప్రజా దర్బార్₹ కార్యక్రమంలో చుంచుపల్లి, కొత్త మల్లూరు, మల్లూరు, నరసింహసాగర్, శనగకుంట ఆవాసం, పూరేడుపల్లి గ్రామాల ప్రజల నుంచి మంత్రి సీతక్క, ₹జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.₹ కలిసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మంగపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రజా దర్బార్లో మంగపేట, కమలాపూర్, బోర్ నర్సాపూర్, కోమటిపల్లి, కొత్తూరు, మోట్లగూడెం, తొండ్యాల లక్ష్మీపురం గ్రామాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్థానిక గ్రామాల్లోని సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనులు, ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వినియోగ వివరాలను మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సభలను సక్రమంగా నిర్వహించి, గ్రామ ప్రజలకు అవసరమైన, అందరికీ ఉపయోగపడే అభివృద్ధి పనులకు మాత్రమే నిధులను వినియోగించాలని, గ్రామ సభ అనుమతి లేకుండా నిధులను దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని మంత్రి సీతక్క అధికారులను హెచ్చరించారు. మల్లూరు ప్రజా దర్బార్లో 130, మంగపేటలో 210 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా వినూత్నంగా స్థానిక గ్రామాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే సంకల్పంతో ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంతో పాటు అధికారులు గ్రామ ప్రజల ముందుకు వస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, నూతన పెన్షన్ల మంజూరు, ఉచిత విద్యుత్, పోడు భూముల పట్టాలు, పలు రెవెన్యూ సమస్యలపై అర్జీలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా దర్బార్లో వచ్చిన దరఖాస్తులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, పెన్షన్లు, ఇందిరమ్మ గృహాలు, ఇతర సంక్షేమ పథకాలకు వచ్చిన దరఖాస్తులపై ఫీల్ విజిట్ చేసి అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, జూన్ 2వ తేదీ నుంచి నూతన పెన్షన్లను మంజూరు చేస్తామని, రెవెన్యూ-అటవీ అధికారుల సమన్వయంతో పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

తాగునీటి సరఫరా సాధ్యంకాని గుత్తి కోయ ఆవాసాల్లో ప్రత్యేక వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు అందించాలని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందని, మహిళా సంఘాల సభ్యులకు 60 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు మంజూరు చేశామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐకేపీ సెంటర్ల ద్వారా మహిళా సంఘాలకు ఆదాయం చేకూరుతోందని, మహాలక్ష్మి పథకం ద్వారా కోట్లాది మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని, రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు చీరల పంపిణీ పూర్తి చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లక్ష మందికి పెన్షన్లు మంజూరు చేశామని, జూన్ 2వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి, కార్యదర్శుల ద్వారా పరిశీలించి అర్హులకు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నిధులను తాగునీరు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, డ్రైనేజీ పనులు, మోటార్ల రిపేర్లు వంటి గ్రామ అవసరాలకు వినియోగించాలని సూచించారు. ప్రతి రూపాయిని గ్రామ సభల ద్వారా పరిశీలించి, ఖర్చు చేసిన పనులకే బిల్లులు తీయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. నిధుల దుర్వినియోగం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెండ్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. మంగపేట మండలం కమలాపూర్ గ్రామంలో బస్టాండ్ కావాలని గ్రామస్తులు త్వరగా వెంటనే స్పందించిన మంత్రి సీతక్క బస్టాండ్ నిర్మాణానికి అనువైన స్థలం ఉంటే వెంటనే వాటి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బస్టాండ్ గోదావరి పుష్కరాల వరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చూడాలని పేర్కొన్నారు. సుమారు 70 కోట్ల రూపాయల నిధుల అంచనా తో మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉండే పుణ్యక్షేత్రాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి చేయాలని సంకల్పించుకున్నారని పేర్కొన్నారు.త్వరలోనే మంగపేట కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ బస్టాండ్ మార్కెట్ యార్డ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ములుగు జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **200 కోట్ల రూపాయలతో ములుగు జిల్లాకు గోదావరి జలాలు**
- **మంత్రి సీతక్క**



మంగపేట, ఏప్రిల్ 21, మనం ప్రతినిధిః ములుగు జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, 200 కోట్ల రూపాయల నిధులతో ములుగు జిల్లాకు గోదావరి నది జలాలను మళ్ళించడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. మంగళవారం మంగపేట మండలం బోర్ నర్సాపూర్ గ్రామం వద్ద గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, ఆర్బి రోడ్డు నుండి గోదావరి ఫెర్రీ పాయింట్ వరకు రోడ్ ఇన్ఫ్రా ఐటీడీఏ 11 డిస్ట్రికట్స్ పథకం కింద రెండు కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గోదావరి నది పరివాహక ప్రాంతంలోని ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు సాగునీటి సౌకర్యాలు కూడా కల్పిస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ములుగు నియోజకవర్గానికి మళ్లించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, 200 కోట్ల రూపాయల నిధులతో గోదావరి జలాల మళ్లింపు పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. మల్లూరు ప్రాజెక్టు నుంచి గౌరారం వరకు నీటిని అందించేందుకు అవసరమైన అంచనాలు పూర్తయ్యాయని, ఆ పనులను త్వరలోనే ప్రారంభించి మంగపేట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు, ముఖ్యంగా గోదావరి తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్, ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు చేసి, గత రెండు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పనులను వచ్చే ఆరు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేఖ కళ్యాణి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం, పాఠ్యపుస్తకాలను అందజేసిన మంత్రి



మంగపేట, ఏప్రిల్ 21, మనం ప్రతినిధిః మంగళవారం మంగపేట గ్రామ పరిధిలోని శాంతినగర్ గుత్తి కోయ గుంపులోని అంగన్వాడీ చిన్నారులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి అదనపు జత ఏకరూప దుస్తులను,మూడేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం 'బాలామృతం', ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్బుక్లు, పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పిల్లలను పనిచేసే ప్రదేశాలకు తీసుకెళ్లవద్దని సూచించారు. గుత్తి కోయ ఆవాసంలోని పిల్లలు సక్రమంగా అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతూ ఆటపాటలతో కూడిన ప్రీ-ప్రైమరీ విద్యను అభ్యసించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య ప్రభుత్వం అందిస్తుందని, ప్రతి చిన్నారి శారీరక, మానసిక వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. చిన్నారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకే, గ్రంథలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, డి డబ్ల్యు ఓ ప్రేమలత, అంగన్వాడి సూపర్వైజర్, జిల్లా అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పట్టుదలతో చదవాలి



- **డాక్టర్ ప్రహసిత్**

భీమదేవరపల్లి, ఏప్రిల్ 21 మనం న్యూస్: విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయాన్ని అందుకుంటారు సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ అన్నారు. మంగళవారం రోజున గట్ల నర్సింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవిత లక్ష్యాలు ,ఆశయాలు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా సైకిల్స్ డాక్టర్ ప్రహసిత్ డాక్టర్ రెహమాన్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల్లో విఫలం కావడం వల్ల నెగిటివ్ నిర్ణయాలు తీసుకోవద్దని, పట్టుదలతో ప్రయత్నిస్తే తప్పకుండా విజయాన్ని సాధించవచ్చునని తెలిపారు. జీవితంలో క్రమశిక్షణ, పట్టుదల ,కష్టపడి పని చేయడం వల్ల విద్యార్థులు విజయాన్ని అందుకుంటారని విద్యార్థులను ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

# శ్రీ జగిని టెక్స్టైల్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయం



- **జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్**

నల్లగొండ,ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః పోలీస్ హెడ్ కోటర్ ప్రాంగణం నందు జిల్లా ఎస్ పి శరత్ చందర్ పవార్ చలివేంద్రం ప్రారంభించినారు. వేసవి కాలంలో పాదచారుల దాహాన్ని తీర్చేందుకు జగిని టెక్స్టైల్స్ మరియు జగిని దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్ పి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిరంతరంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అఖ్కి రమేష్ మాట్లాడుతూ వేసవి కాలం పాదాచరులు దప్పిక తీర్చుకోవటానికి ఎంతో ఉపయోగం అని, జగిని వారు చలివేంద్రంలు, రోడ్ సేఫ్టీ గురుంచి భారీకెట్స్ స్టాపర్స్ పెట్టటం సామాజిక సేవలకు ఎపుడు జగిని టెకస్స్ టైల్స్ వారు ముందుంటారు అన్నారు... జగిని వెంకన్న మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ వేసవిలో కూడా జగిని టెకస్స్ టైల్స్ చలివేంద్రం ఏర్పాటు చేయడం తమకు ఆనందాన్ని, సంతృప్తిని కలిగిస్తోందని తెలిపారు.అలాగే మా జగిని దంత వైద్య శాల తరపున పేదవారికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నమని డాక్టర్ జగిని ఆదిత్య తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎఊరమేష్ , డాక్టర్ జగిని ఆదిత్య, జగిని వెంకన్న,ఆర్.ఐ లు,ఆర్ యస్. ఐ లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ హామీకి కార్యరూపం

- **మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ**
- **రాయినిగూడెం, దో మేడ గ్రామాలకు చెందిన 25 మంది మహిళలకు లబ్ధి**
- **మంత్రి దనసరి సీతక్క**



మంగపేట,ఏప్రిల్ 21,మనం ప్రతినిధిః 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ములుగు జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు, మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మంగళవారం ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరం ఆవరణలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో రాయినిగూడెం గ్రామానికి చెందిన పది మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., దాత చంద్రమౌళితో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ శనివారం ములుగు మండలం రాయినిగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్లో స్థానిక మహిళలు తమ సమస్యను విన్నవించారని తెలిపారు. కుట్టు మిషన్ నేర్చుకున్నప్పటికీ మిషన్లు లేకపోవడంతో ఉపాధి పొందలేక ఇబ్బంది పడుతున్నామని, కుట్టు మిషన్లు అందిస్తే ఉపాధి దొరుకుతుందని వారు కోరారని చెప్పారు.వెంటనే స్పందించిన మంత్రి సీతక్క రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహాయ సహకారంతో రాయినిగూడెం గ్రామానికి చెందిన పది మంది మహిళలకు, మంగపేట మండలం దోమేడ గ్రామానికి చెందిన 15 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించడంతో పాటు మహిళల స్వయం ఉపాధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పేద మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు విస్తరాకుల తయారీ యంత్రాలు, గ్లాసుల తయారీ యంత్రాలు, కుట్టు మిషన్లు వంటివి దాతల సహకారంతో అందిస్తున్నామని వివరించారు.సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి కుట్టు మిషన్లను విరాళంగా అంది ంచిన రోటరీ క్లబ్ ప్రతినిధి చంద్రమౌళి, ఇతర దాతలకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీడబ్ల్యూఓ ప్రేమలత, రోటరీ క్లబ్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జనగణనలో తపులకు ఆస్కారం ఇవ్వద్దు



- **బాధ్యతాయుతంగా చేపట్టాలి**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

చొప్పదండి, ఏప్రిల్ 21 (మనం న్యూస్)ః జనగణన- 2027లో వివరాలను తప్పులు లేకుండా.. పారదర్శకంగా నమోదు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ఏర్పాటు చేసిన మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ.. తప్పులు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలన్నారు. డిజిటల్ సర్వేపై అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. గత సర్వేల్లో పాల్గొన్న సిబ్బంది అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. మొదటి దశలో మే 11వ తేదీ నుంచి జూన్ 9 వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని తెలిపారు. రెండవ దశ ఫిబ్రవరి 2027లో వ్యక్తులవారీగా సమాచారం సేకరిస్తారని పేర్కొన్నారు. అధికారులు ప్రతి కుటుంబం వివరాలు పక్కగా సేకరించి నమోదు చేయాలని సూచించారు. అందరు వివరాలు గోప్యంగా స్పష్టం చేశారు. జనగణను సూపర్వైజర్లు ఎన్యుమరేటర్లు బాధ్యత విధంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తూ సర్వే పూర్తి చేయాలని సూచించారు. హౌస్ లిస్టింగ్.. ఇద్దరి అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్ కుమార్, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# మొదటి దశ జనగణన శిక్షణలో స్టీల్ ప్లేట్ల వినియోగం

- **పర్యావరణ స్పృహకు నిదర్శనం**






మహాదేవపూర్ ఏప్రిల్ 21 మనం న్యూస్ః జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ని మండల పరిషత్ సమావేశంలో ని 2027 జనాభా గణన మొదటి దశ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న శిక్షకులకు భోజన సదుపాయంలో ప్లాస్టిక్ ప్లేట్లను పూర్తిగా నిషేధించి, స్టీల్ ప్లేట్లను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు మాణిక్యం శంకరయ్య కుమారుడు కీర్తిశేషులు శశికాంత్ జ్ఞాపకార్థం స్టీల్ ప్లేట్లను విరాళంగా అందజేశారు. ప్లాస్టిక్ ప్లేట్లు ఆరోగ్యానికి హానికరమనివేడి అన్నం,కూరలాంటి వేడి పదార్థాలు ప్లాస్టిక్ ప్లేట్లలో వేస్తే, ప్లేట్ ఉపరితలం నుండి లక్షలాది సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు పాలీస్టైరీన్, పాలీప్రొపైలిన్, పిఈ టి,బిస్ఫినాల్, థాలేటులు వంటి విషపూరిత రసాయనాలు ఆహారంతో కలుసి శరీరంలోని హార్మోన్ల పనితీరును దెబ్బతీస్తాయి. పురుషుల్లో ఆండ్రోజెన్లనుతగ్గించి,సంతానోత్పత్తి సమస్యలు, గుండె జబ్బులు వచ్చే రిస్క్ ను పెంచుతాయి.ప్లేట్లలోని మెలమైన్ విడుదలై మూత్రంలోకి వెళ్తుంది. ఎక్కువ కాలం తక్కువ మోతాదులో తీసుకున్నా కిడ్నీలో రాళ్లు వచ్చి కిడ్నీ ఫెయిల్యూర్ అయ్యే ప్రమాదం ఉంది.ప్లాస్టిక్ నుండి వచ్చే మైక్రోప్లాస్టిక్స్, రసాయనాలు మానవ పేగు కణాలను విషపూరితంగా చేసి సెల్ మెంబ్రేన్ దెబ్బతీయడం, మైటోకాండ్రియా పనితీరు తగ్గించడం జరుగుతుంది. ఫలితంగా దీర్ఘకాలంలోపేగుదెబ్బతినడంగుండెకు ప్రమాదం జరుగుతుంది. పిల్లలు, గర్భిణులు, నవజాత శిశువులపై ప్లాస్టిక్ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని అందుకే వాటి వినియోగాన్ని పూర్తిగా నివారించే ఉద్దేశంతో మహాదేవపూర్లో 'ప్లేట్ బ్యాంకు ఏర్పాటు చేస్తున్నట్లు ఈ బ్యాంకులోకి సుమారు 2000 స్టీల్ ప్లేట్లు అందుబాటులోకి తీసుకొచ్చే యోచనలో ఉన్నట్లు ఎస్జీసీ ఉపాధ్యాయులు మడక మధు అన్నారుభవిష్యత్తులో గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా ఈ ప్లేట్ బ్యాంకు నుండే ప్లేట్లు తీసుకొని, కార్యక్రమం అనంతరం శుభ్రపరిచి తిరిగి బ్యాంకులో జమ చేయాలి అని సూచించారు. మరో ఎస్జీసీ ఉపాధ్యాయులుప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూఇంట్లో వాడే ప్లాస్టిక్ కవర్లను ప్లాస్టిక్ బాటిళ్లలో నిల్వ చేస్తే నేల కాలుష్యాన్ని నివారించవచ్చుఅని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ శ్రీమతి హసీనాబానో అక్బర్ ఖాన్ స్టీల్ ప్లేట్లను శిక్షకులకు అందజేశారు. ప్లేట్ బ్యాంకు ఏర్పాటుకు సర్పంచ్ గారు రూ.5000/- విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్ ట్రైనర్ బిల్లా రఘునాథ రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# నా ఆట విషయంలో గర్విస్తున్నా: తిలక్ వర్మ



గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో ముంబయి ఇండియన్స్ బ్యాటర్ తిలక్ వర్మ (101₹; 45 బంతుల్లో) సెంచరీతో కదం తొక్కాడు. తాను ఆడిన తొలి 22 బంతుల్లో 19 పరుగులే చేసిన తిలక్.. తర్వాత విధ్వంసం సృష్టించాడు. 23 బంతుల్లోనే 82 పరుగులు చేసి సెంచరీ కూడా పూర్తిచేసుకున్నాడు. ఈ మ్యాచ్ లో ముంబయి 99 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐపీఎల్ లో తొలిసారి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్న తిలక్ వర్మ.. తన ఇన్నింగ్స్ గురించి మాట్లాడాడు. క్రీజులో కుదురుకోవడానికి ఆరంభంలో నెమ్మదిగా ఆడానని పేర్కొన్నాడు. ఈ ఇన్నింగ్స్ కోసం కొత్తగా ఏమీ చేయలేదని, తన సామర్థ్యాలపై నమ్మకం ఉంచి సహజ శైలిలో ఆడినట్లు తెలిపాడు.

''మొదటి 20 బంతుల్లో ప్రతి బంతికి ఒక్కో పరుగు చేస్తూ క్రీజులో కుదురుకోవడం పైనే దృష్టిసారించా. క్రీజులో కొంత సమయం గడిపి పిచ్ తీరును అర్థం చేసుకున్నా. నా సామర్థ్యాలపై నమ్మకం ఉంచి నా సహజ శైలిలో ఆట ఆడా. జట్టు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఆ దశలో టీమ్ కు అసలు ఏం అవసరమో నేను అంచనా వేశాను. నా దగ్గర రకరకాల షాట్లు ఉన్నాయి. కానీ ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో మన నైపుణ్యాలను మనం నమ్మడం చాలా ముఖ్యం. ఈ రోజు నేను చేసింది కూడా అదే. అందువల్లే నాకు ఆశించిన ఫలితం దక్కింది. నా ఆట విషయంలో నేను నిజంగా గర్విస్తున్నాను'' అని తిలక్ పేర్కొన్నాడు. గుజరాత్ తో మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి.. 14 ఓవర్లకు 103/4తో ఉండగా తిలక్ తుపాన్ తో అనూహ్యంగా ప్రత్యర్థి ఎదుట 200 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. బౌలర్లు సమష్టిగా రాణించడంతో గుజరాత్ 15.5 ఓవర్లలోనే 100 పరుగులకు ఆలౌటైంది.

## సీఎస్కేకు షాక్..
# యువ బ్యాటర్ దూరం



చెన్నై సూపర్ కింగ్స్ కు షాక్ తగిలింది. ఈ ఐపీఎల్ సీజన్ మిగిలిన మ్యాచ్ లకు యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే దూరమైనట్లు సీఎస్కే యాజమాన్యం ప్రకటించింది. ఈ నెల 18న సన్ రైజర్స్ తో జరిగిన మ్యాచ్ లో బ్యాటింగ్ చేస్తున్నప్పుడు గాయమైనట్లు తెలిపింది. ఎడమ తొడ కండరాల గాయం నుంచి కోలుకునేందుకు 6-12 వారాల సమయం పడుతుందని, ఈ నేపథ్యంలో ఈ సీజన్ లో మిగిలిన మ్యాచ్ లకు దూరమైనట్లు వెల్లడించింది. అతడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది.

ఈ ఐపీఎల్ సీజన్ లో చెన్నై ఇప్పటివరకు ఆరు మ్యాచ్ లు ఆడింది. రెండు మాత్రమే గెలిచింది. బ్యాటింగ్ లో ఇబ్బంది పడుతోన్న ఈ జట్టుకు ఆయుష్ తన ఆటతీరుతో కీలకంగా మారాడు. ఇప్పటివరకు జరిగిన మ్యాచు ల్లో 177.87 స్ట్రైక్ రేటుతో 201 పరుగులుచేశాడు. ఇప్పటికే ఖలీల్ అహ్మద్ వంటి ఆటగాళ్లు గాయాలతో జట్టుకు దూరమైన నేపథ్యంలో.. ఆయుష్ లేనిలోటు జట్టును మరింత బలహీనపర్చనున్నట్లు కనిపిస్తోంది.



# ఐపీఎల్ తర్వాత తీరిక లేని షెడ్యూల్..

ఐపీఎల్ 2026 సీజన్ ఫైనల్ మే 31న జరగనుంది. తర్వాత టీమ్ఇండియా వరుస సిరీస్ లతో బిజిబిజీ కానుంది. తీరిక లేకుండా మ్యాచ్ ల షెడ్యూల్ రూపొందించడంపై కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్ మన్ గిల్ బీసీసీఐపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. జూన్ 6-10 మధ్య ముల్లాన్ పుర్ లో భారత్, అఫ్గాన్ మధ్య టెస్టు మ్యాచ్ మొదలవుతుంది. ఈ మ్యాచ్ కు ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ పాయింట్లతో సంబంధం లేదు. దీంతో అగ్రశ్రేణి ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి యువ ఆటగాళ్లను బరిలోకి దింపాలని టీమ్ మేనేజ్ మెంట్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

జస్ ప్రీత్ బుమ్రా, శుభ్ మన్ గిల్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా వంటి సీనియర్లకు రెస్ట్ ఇచ్చే ఛాన్స్ ఉంది. ఫస్ట్-క్లాస్ క్రికెట్ లో ఆకట్టుకున్న గుర్నూర్ బ్రార్, మానవ్ సుతార్, ఆకిబ్ నబీ, దేవదత్ పడిక్కల్ వంటి ఆటగాళ్లను అఫ్గాన్ తో టెస్టు మ్యాచ్కు ఎంపిక చేసే అవకాశాలున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఐపీఎల్ 2026 ముగియగానే టీమ్ఇండియా వరుస సిరీస్ లతో తీరిక లేకుండా గడపనుంది. జూన్ లో అఫ్గానిస్థాన్ తో టెస్టు మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది. తర్వాత రెండు టీ20ల సిరీస్ కోసం ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. జులై లో ఇంగ్లాండ్ లో పర్యటించి ఆతిథ్య జట్టుతో ఐదు వన్డేలు, మూడు టీ20ల్లో తలపడనుంది. జులై 23 నుంచి జింబాబ్వే, టీమ్ఇండియా మధ్య మూడు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది.



# దేవర' 2 గ్యాప్ బాలయ్యతో మార్చేసిన కొరటాల?

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నుంచి లేటెస్ట్ గా దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో చేస్తున్న భారీ సినిమా నుంచి వచ్చిన స్ట్రజింగ్ అప్డేట్ ఇపుడు పాన్ ఇండియా లెవెల్లో సంచలనంగా మారింది. ఇక ఈ సినిమా తర్వాత ఎన్టీఆర్ లైనప్ లో మరిన్ని సినిమాలు ఉండగా వాటిలో దర్శకుడు కొరటాల శివతో చేస్తున్న అవైటెడ్ సీక్వెల్ సినిమా దేవర 2 కూడా ఒకటి.

అయితే ఈ సినిమాకి ఎన్టీఆర్ జాయిన్ అవ్వాలంటే చాలా సమయమే పట్టేలా ఉంది. మెయిన్ గా ఎన్టీఆర్ నీల్ షూట్ చాలా బాలన్స్ ఉండడంతో తారక్ ఇంకా అదే ఫిజిక్ మైంటైన్ చేయాల్సి ఉంటుంది. సో అందుకు సమయం కావాల్సిందే. ఇక ఈ గ్యాప్ లోనే దర్శకుడు కొరటాల శివ మరియు బాలయ్య ప్రాజెక్ట్ కూడా స్టార్ట్ అయిపోవచ్చని టాక్. అయితే దీని గ్యాప్ లో గోపీచంద్ తో సినిమా కూడా పూర్తి కావాల్సి ఉంది. మరి ఇవన్నీ ఎలా వెళ్తాయో చూడాలి.




# 'జైలర్ 2' షూటింగ్ పూర్తి

మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. దీనికి కొనసాగింపుగా 'జైలర్ 2' వస్తోన్న సంగతి తెలిసిందే. అగ్రహీరో రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు తెలుపుతూ టీమ్ కొన్ని ఫొటోలు పంచుకుంది. భారీ స్థాయిలో ఇది రానున్నట్లు తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ లో ఈ సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. త్వరలోనే విడుదల తేదీని కూడా టీమ్ వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.

విడుదలకు సిద్ధమవుతోన్న వేళ ఇటీవల ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు లీక్ కావడం చిత్ర యూనిట్ ను ఆవేదనకు గురిచేసింది. 'జైలర్-2' సెట్లో తీసిన కొన్ని సన్నివేశాలు సోషల్ మీడియాలో లీకయ్యాయి. ఈ వీడియోను షేర్, ప్రచారం చేసిన ఖాతాలకు వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు బయటకు వచ్చిన సన్నివేశాల వీడియోను ఆ ఖాతాల నుంచి తొలగించడానికి అవసరమైన చర్యలను చేపట్టినట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ప్రకటించింది.

# ఎన్టీఆర్-నీల్ మూవీ కొత్త విడుదల తేదీ ప్రకటన





ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానున్న ఈ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్లు తెలిపింది. ''తుపాను తన లక్ష్యాన్ని కనుగొంది. 2027 జూన్ 11న థియేటర్ లలో తుపాను రావడం ఖాయం'' అంటూ కొత్త విడుదల తేదీతో పాటు ఓ అప్ డేట్ ను పంచుకుంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలిపింది.

మొదట ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావించారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండడంతో దీన్ని ఈయేడాది జూన్ 25కు వాయిదా వేశారు. అయితే ఇంకా షూటింగ్ పూర్తికాకపోవడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మిగిలిఉండడంతో ఇప్పుడు వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ప్రశాంత్ నీల్ మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా దీన్ని రూపొందిస్తున్నారు. సినిమా ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా ఉండేలా చూస్తున్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ కు జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆరట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తన లుక్ మార్చుకున్నారు. బరువు తగ్గి నాజూగ్గా కనిపిస్తున్నారు. ఇటీవల తన జిమ్ ఫొటో విడుదల చేయగా అది వైరల్ అయింది. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# తాను ప్రేమించే పెద్దితో బుచ్చిబాబు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్ లో రూపొందుతున్న 'పెద్ది' కోసం ప్రేక్షకులు ఏ రేంజ్ లో ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో పెద్ది పెహల్వాన్ పాత్రలో రామ్ చరణ్ నెవర్ బిఫోర్ లుక్ లో కనిపిస్తున్నాడు. ఇక ఈ సినిమా షూటింగ్ చివరిదశకు చేరుకుంది. దీంతో ఈ సినిమా పై దర్శకుడు బుచ్చిబాబు సానా తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చాడు.

తాజాగా చిత్ర షూటింగ్ సెట్స్ నుండి రామ్ చరణ్ తో బుచ్చిబాబు కలిసి ఉన్న ఫోటోలను నెట్టింట షేర్ చేశారు. ఈ ఫోటోల్లో రామ్ చరణ్ సెల్ఫీ తీస్తుంటే, బుచ్చిబాబు సానా గర్వంగా



నిల్చున్న పిక్స్ మనకు కనిపిస్తున్నాయి. ఇక ఈ ఫోటోలకు బుచ్చిబాబు ఎమోషనల్ క్యాప్షన్ ఇచ్చాడు. పెద్ది సెట్స్ లో చివరి 6 రోజులు మాత్రమే మిగిలి ఉందని.. తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిన పాత్ర.. తాను ఎంతో ప్రేమించే పెద్ది అంటూ ఆయన ఈ ఫోటోలకు క్యాప్షన్ ఇచ్చారు.

ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని జూన్ నెలలో వరల్ వైడ్ గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

**'పెద్ది' కాంబినేషన్లో ఈసారి ఊహించని జానర్?**

మన టాలీవుడ్ లో ఉన్నటువంటి పలు క్రేజీ కాంబినేషన్ చిత్రాల్లో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ అలాగే దర్శకుడు బుచ్చిబాబు సానా కలయిక కూడా ఒకటి. వారి కలయికలో చేస్తున్న పెద్ది సినిమా మంచి స్టాండరడ్స్ ఇప్పుడు సెట్ చేయగా ఈ సినిమా తర్వాత మళ్ళీ వీరి కలయికలలో ఓ సినిమా ఉంటుంది అని బజ్ వినిపించింది. అయితే ఇప్పుడు స్పోరట్స్ డ్రామా చేస్తున్న వీరి కలయిక నెక్స్ట్ ప్రాజెక్ట్ గా మాత్రం ఒక సెపరేట్ జానర్ ని ఎంచుకున్నట్టు తెలుస్తుంది. ప్రస్తుతం వినిపిస్తున్న రూమర్స్ ప్రకారం బుచ్చిబాబు ఈసారి రామ్ చరణ్ తో ఇతిహాసాల బ్యాక్ డ్రాప్ లో సినిమా చేస్తాడని వినిపిస్తుంది. మరి ఇది ఎంతవరకు నిజం అనేది తెలియాల్సి ఉంది. రామ్ చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్ కి సాలిడ్ డివోషనల్ సబ్జెక్టు పడితే దాని ఇంపాక్ట్ వేరే లెవెల్లో ఉంటుంది. మరి దానిని బుచ్చినే తీసుకొస్తాడా లేదా మరో దర్శకుడు చేస్తాడా అనేది కాలమే నిర్ణయించాలి.

**కెరీర్ తొలినాళ్లలో ఎదురైన దెబ్బలు, అనుభవాలే తన కెరీర్ ను తీర్చిదిద్దాయని అంటోంది బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్. గతేడాది 'ఎమర్జెన్సీ' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించిందీమె. వైవిధ్యమైన పాత్రలతో, కథలతో సినీప్రియుల్ని అలరిస్తుంటుంది. ప్రస్తుతం 'భారత్ భాగ్య విధాత' అనే సినిమా చిత్రీకరణలో బిజీగా గడుపుతోందీ తార. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కంగన సినీ రంగంలో తన తొలి రోజుల్ని గుర్తుచేసుకుంటూ అభిమానులతో కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.**

# అవకాశాలు రాకపోతేనే ఎక్కువ నేర్చుకుంటాం!



''ముంబయిలో నేను ఇంకా నిలదొక్కుకోవడానికి ఇబ్బంది పడుతున్న సమయంలో అగ్రహీరో సల్మాన్ ఖాన్ ను కలిశాను. అప్పుడు నాకు కేవలం 16, 17ఏళ్లు ఉంటాయి. 'గ్యాంగ్ స్టర్' సినిమా ఇంకా రాలేదు. అప్పుడు సల్మాన్ 'ఈమె సంజయ్ లీలా భన్సాలీ హీరోయిన్' అని ప్రశంసించారు. నన్ను వెళ్లి ఆయన్ను కలువమని చెప్పారు. నా దృష్టిలో ఇది చాలా పెద్ద ప్రశంస. సల్మాన్ సూచన వల్లే నేను భన్సాలీని సంప్రదించాను. సంజయ్ ఇంటికి వెళ్లాను. నన్ను సల్మాన్ పంపించారని చెప్పా. భన్సాలీ నాతో ఏ ప్రాజెక్టు గురించి ఒప్పందం చేసుకోలేదు.. కానీ ఇప్పుడు ఆయన నన్ను కలిసినప్పుడల్లా నేను సల్మాన్ మాట విని ఉండాల్సిందని అంటుంటారు. ఆ క్షణం అలా గడిచిపోయింది. 'క్వీన్', 'తను వెడ్స్ మను రిటర్న్స్' తర్వాత 'రామ్ లీలా'లోని ప్రత్యేక పాట కోసం భన్సాలీ నన్ను సంప్రదించారు. కానీ నేను ఐటెమ్ నంబర్లు చేయాలనుకోవడం లేదని చెప్పాను''.

**దక్షిణాది చిత్రాలకే ఎక్కువ గుర్తింపు**

''భారతీయ చిత్రపరిశ్రమ తగ్గుతున్న బాక్సాఫీస్ రాబడులు, మారుతున్న ప్రేక్షకుల అభిరుచులతో సతమతమవుతోంది. ఒక విధంగా చెప్పాలంటే చిత్రపరిశ్రమ దేశంతో సంబంధాలు తెంచుకుంటోంది. ప్రేక్షకుల భాగస్వామ్యం తగ్గిపోయింది. స్టూడియోలు కనుమరుగవుతున్నాయి. ప్రేక్షకులు మూసధోరణి పద్ధతిలో రూపొందే చిత్రాలను చూడటానికి ఇష్టపడడం లేదు. సంస్కృతి, ప్రాంతీయ కథలపై దృష్టిసారిస్తున్న దక్షిణాది చిత్రాలు ఎక్కువ గుర్తింపును పొందుతున్నాయి. ఇటీవలే విడుదలైన 'ధురంధర్' చిత్రపరిశ్రమకు పునరుజ్జీవం పోసింది. కొత్త ఆశలు కల్పించింది. ఇది ప్రేక్షకులతో నేరుగా మాట్లాడుతోంది. ఇలాంటి సినిమాల్ని ప్రేక్షకులు చూడాలనుకుంటున్నారు''.

**హాలీవుడ్ కి వెళ్లే ప్రణాళిక లేదు**

''నేను ఎప్పుడూ ఒకటే చెప్తుంటాను. మీకు ఏదైన అవకాశం వస్తే మంచిదే. కానీ ఆఫర్లు రాకపోతే ఇంకా మంచిది. ఎందుకంటే అవకాశాలు లేకపోతేనే ఎలా ముందుకెళ్లాలో నేర్చుకుంటారు. ఆ అనుభవాలే మనకు ఇంకా ఎక్కువ విషయాల్ని నేర్పిస్తాయి. ప్రారంభంలో నాకు గుర్తింపు లభించకపోవడం కారణంగానే ఒక చిత్రనిర్మాత, రచయితగా నన్ను నేను నిలబెట్టుకున్నాను. చాలా మంది సినీతారలు హాలీవుడ్ కి వెళ్తున్నారు. నాకు అక్కడికి వెళ్లే ప్రణాళికలు లేవు. హాలీవుడ్ అంటే అంతగా ఇష్టం లేదు. ఎందుకంటే అమెరికాను గొప్పగా చూపించే సినిమాలు తీయాలనే ఒక ఎజెండా హాలీవుడ్ కు ఉంది. కాబట్టి మనకు మన సొంత ఎజెండా ఉండాలి. మనం అనవసరంగా అక్కడికి వెళ్లి అమెరికాను గొప్పగా చూపించడానికి ఎందుకు ప్రయత్నించాలి''.


Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.